

ఈ సంచికతోపాటు 12 పేజీల
లైఫ్ సప్లిమెంట్ అందుకోండి

ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత

వెలుగు

14.01.2019
www.v6velugu.com

సోమవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 329 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

బిజినెస్

ఫుడ్.. ఇప్పుడో పెద్ద బిజినెస్



క్లౌడ్ కిచెన్లు, ఫుడ్ రోబోలు, ఐఓటీలు, డీప్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్స్ కిచెన్లుకే మార్చేస్తున్నాయి.

10

దేశం - విదేశం

యూపీలో ఒంటరిపోరే



ఎస్పీ, బీఎస్పీ పొత్తుతో యూపీలోని 80 సీట్లలో పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయం.


05



హమ్మయ్య.. ఆగింది!

ఏపీలోని కర్నూలు జిల్లా శ్రీశైలం ఘాట్ రోడ్డు... చిన్నారుట్ల మలుపు... ఆదివారం ఉదయం... బ్రేకులు ఫెయిలైన మహారాష్ట్ర టూరిస్ట్ బస్సు లోయలోకి దూసుకెళ్లింది. వెంటనే ప్రయాణికులు బస్సు నుంచి కిందకు దిగారు. కాస్త ఉంటే బస్సు లోయలో పడిపోయేదే. బస్సులో 36 మంది ఉన్నారు.

అన్నారం



బ్యారేజ్ పనులు: పూర్తి
వంతెనపై
66 స్లాబ్‌ల నిర్మాణం: పూర్తి
66 గేట్ల బిగింపు: పూర్తి
సైడ్ బండ్ పనులే పెండింగ్

సుందిళ్ల



బ్యారేజ్ పనులు: దాదాపు పూర్తి
మట్టి పని: 1.1 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పని మాత్రమే పెండింగ్
ఫిబ్రవరి కల్లా మట్టి పనులు పూర్తి

కన్నెపల్లి



కన్నెపల్లి పంప్ హౌస్
సివిల్ పనులు: మార్చికి పూర్తి
మొత్తం పంపులు: 11
ఇప్పటికి బిగించినవి: 6
నెలాఖరుకు బిగించేవి: 3
ఏప్రిల్‌లో బిగించేవి: 2
వెట్ రన్: ఏప్రిల్‌లో

మేడిగడ్డ

మట్టిపని : 54.44 లక్షల క్యూబిక్ మీటర్ల మేర జరగాలి. ఇప్పటికి 53.17 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తి

కాంక్రీట్ పని : 17.89 లక్షల క్యూబిక్ మీటర్ల మేర జరగాలి. ఇప్పటికి 13.73 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తి



కాళేశ్వరం మహా స్పీడు

మరో మూడున్నర నెలల్లో పనులు కంప్లీట్ • సీఎం ఆదేశాలతో శరవేగంగా వర్క్

పూర్తయిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీ పనులు	ఏప్రిల్ 15 నాటికి మేడిగడ్డ పూర్తి	వచ్చేనెలకల్లా అన్నారం పంపులు రెడీ	ఏప్రిల్ చివరికి గోలివాడ పంపులు సిద్ధం

కాళేశ్వరం ఉరుకుతంది. పనులన్నీ జల్ది జల్ది అయితున్నయి. మొన్న సీఎం పోయి మందలిచ్చుడుతోని పెద్దసార్లు, ఇంజనీర్లు కండ్ల మీద నీళ్లు జల్లుకొని పని చేస్తున్నరు. వానల టైంకల్లా పొలాల్ల నీళ్లు పారియ్యాలని యజ్ఞమే చేస్తున్నరు. ఇప్పటికే అన్నారం కట్ట పనులైనయి. ఇంకో మూడు నెల్లల్ల మేడిగడ్డ పనులు అయితయని అధికారులు చెప్తున్నరు. వచ్చేనెల నాటికి కన్నెపల్లి, అన్నారం పంపుహౌస్‌లు, ఏప్రిల్‌నాటికి గోలివాడ పంపుహౌస్ పనులు అయిపోతయి. తర్వాత ఇగ పొలాలకు నీళ్లు ఇడ్సుడే! అటుఇటుగా వందరోజుల్లో 100 శాతం పనులు అయ్యేటట్టు కనిపిస్తున్నది.

02



బాస్ కాల్..? అయినా కట్ చేసెయ్!

రైట్ టు డిస్‌కనెక్ట్ కూడా ఓ హక్కే
మన దేశంలోనూ తేవాలని పార్లమెంట్‌లో బిల్లు
చర్చకు నోచుకోకుండానే మరుగున

రఘు.. ఫీల్డ్ వర్క్ ముగించుకుని ఇంటికెళ్లాడు. అలా వెళ్లి.. ఫ్రెష్ అయ్యి కూర్చున్నాడో లేదో.. బాస్ ఫోన్. ఏమయ్యా రఘు ఆ పని చెయ్యి.. అది చూడు.. ఇది కాలేదు.. అని ఆర్డర్లు.

రమ్య.. ఓ సైట్‌లో సివిల్ ఇంజనీర్. సాయంత్రం ఐదు వరకే ఆమె డ్యూటీ. కానీ, ఓ గంట ఎక్కువే చేసింది. ఇంటికొచ్చాక సైట్ ఓనర్ నుంచి ఫోన్. ఇంకో కొత్త అసైన్‌మెంట్.

సత్యం.. హమ్మయ్య వీకెండ్ వచ్చేసింది.. అని ఊపిరిపీల్చుకున్నాడు. తెల్లారి లేచి చూస్తే పై అధికారి నుంచి ఈ మెయిల్. ఓ కొత్త ప్రాజెక్టు రెడీ అయిపోయింది. ఇంకేముంది.. ల్యాప్‌టాప్ చేత పట్టేశాడు.

....ఇదీ ప్రతి కంపెనీలో, చాలా మంది ఉద్యోగులకు ఎదురవుతున్న అనుభవం. బాస్ కాల్ కదా.. కట్ చేయాలంటే ఏదో బెరుకు. చచ్చినట్టు ఫోన్ ఎత్తాల్సిందే. కానీ, అలాంటి ఉద్యోగులకు అండగా నిలుస్తూ ఇటీవల జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)

మిగతా 2లో

బిల్లు రాదాయె.. అప్పు తెగదాయె

ఈఎస్ఐ రీయింబర్స్‌మెంట్ కోసం చిన్న ఉద్యోగులు, కార్మికుల అవస్థలు
అత్యవసరంగా ప్రైవేటు వైద్యానికి వెళితే అంతే..
రెండు, మూడేళ్లు పడుతున్న బిల్లుల చెల్లింపులు
చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆవేదన
కార్పొరేషన్ తీరుపై విమర్శలు

వాళ్లంతా కార్మికులు, చిన్న చిన్న ఉద్యోగులు. ఏదైనా రోగమొస్తె ఆస్పత్రి బిల్లుల కోసమూ అప్పులు చేయాల్సిన దుస్థితిలో ఉన్నరు. అయినా 'ఈఎస్ఐలో ఉన్నం కదా, భయమెందుకులే' అన్న భరోసాతో బతుకుతున్నరు. అట్లనే అత్యవసరంల ప్రైవేటు దవాఖానాల చేరిండ్రు. అప్పులు చేసో, బంగారం కుదువపెట్టో పైసలు తెచ్చి బిల్లులు కట్టిండ్రు. ఈ బిల్లుల పైసలు రీయింబర్స్‌మెంట్ వస్తయి కదా అన్న ధైర్యంతో ఉన్నరు. కానీ ఏడాది పాయె, రెండేండ్లు పాయె.. బిల్లుల పైసలు రాకపాయె. తెచ్చిన అప్పుల మీద వడ్డీలు పెరగవట్టె, బంగారం అమ్మేసుకుంటనని సావుకారు చెప్పవట్టె. పైసలెప్పుడు వస్తయనుకుంట ఈఎస్ఐ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నరు.

04



పంచాయతీ ఏకగ్రీవాలు 667

మూడు జిల్లాల్లో 50కి పైగా... కరీంనగర్‌లో నాలుగే..

తొలి దశలో 3,813 చోట్ల ఎలక్షన్లు... రెండో దశకు ముగిసిన నామినేషన్లు

రాష్ట్రంలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 667 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి వరకూ ఉన్న సమాచారం మేరకు నిర్మల్ (58), నల్లగొండ (52), ఆదిలాబాద్ (50), వరంగల్ రూరల్ (41) జిల్లాల్లో ఎక్కువగా, కరీంనగర్ జిల్లా (4) పరిధిలో అతి తక్కువ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 197 మండలాల పరిధిలోని 4,480 సర్పంచ్ పదవులకుగానూ 3,813 చోట్ల ఈ నెల 21న పోలింగ్ జరుగనుంది. పోటీలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులను కేటాయించారు. మరోవైపు రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ఆదివారంతో ముగిసింది.

03




జాతరో.. జాతర

వచ్చే 3 నెలలు రాష్ట్రమంతటా సందడి

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే వేడుకలు
ఇప్పటికే మొదలైన ఐలోని మల్లన్న, కొత్తకొండ వీరన్న జాతరలు
రేపటి నుంచి ఉమామహేశ్వరంలో..
వచ్చేవారం కొమురవెల్లి మల్లన్న..
ఫిబ్రవరిలో పెద్దగట్టు, సింగరాయ, పుల్లూరు జాతరలు
మార్చిలో ఏడు పాయలలో ..

06



రేపటి నుంచే కుంభమేళా..

అలహాబాద్‌లో అర్ధ కుంభమేళాకు అంతా సిద్ధమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా పేరొందిన కుంభమేళా రేపటి నుంచి ప్రారంభం కానుంది. సంక్రాంతితో మొదలై మహాశివరాత్రితో ముగిసే 49 రోజుల ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశవిదేశాల నుంచి 12 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. అతి ప్రాచీనమైన అలహాబాద్ కుంభమేళాలో స్నానం చేస్తే పాపాలన్నీ తొలిగి, ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) త్రివేణి సంగమ ప్రాంతంలో ప్రపంచంలోనే అతి పెద్ద తాత్కాలిక నగరమే వెలిసింది. 3,200 హెక్టార్లలో టెంట్లతో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేశారు.

05



జవాన్లకు వల

ఫేస్‌బుక్‌లో పాక్ ఐఎస్ఐ ఏజెంట్ ఎర
50 మందిని ట్రాప్ చేసే యత్నం
ఉచ్చులో పడి ఆర్మీ కీలక సమాచారం ఇచ్చిన ఓ జవాను..
అరెస్టు చేసిన పోలీసులు

02

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
84.00	84.00	84.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
84.00	84.00	84.00

సీఎం కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.



మావోయిస్టు మిలిటరీ కమిషన్ చీఫ్‌గా సిడమా?

తొలిసారి ఆదివాసీకి కీలక బాధ్యతలు

జగిత్యాల వెలుగు: మావోయిస్టు మిలిటరీ కమిషన్ చీఫ్ బాధ్యతలను తొలిసారి ఆదివాసీ చేపట్టాడు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తికి చెందిన మాడవి సిడమా(38)కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఇంతకాలం మిలిటరీ కమిషన్ సారథిగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజు కేంద్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకోవడంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. దండకారణ్యంపై పట్టున్న వ్యక్తిగా, మిలిటరీ ఎత్తుగడల్లో సిడమా ఆరితేరినట్టు సమాచారం. తొమ్మిదేళ్ల క్రితం సుక్మా ప్రాంతంలోని చింతల్‌నగర్ వద్ద జరిగిన దాడితో పాటు అనేక ఘటనలకు సూత్రధారి. మావోయిస్టు అగ్ర నాయకత్వంలో పలు కీలక బాధ్యతలను తెలుగువారు చేపట్టడంతో ఆదివాసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ భావించినట్లు తెలుస్తోంది. రావుల శ్రీనివాస్, కటకం సుదర్శన్, మల్లోజుల వేణుగోపాల్ పేర్లను కూడా పార్టీ పరిశీలించినట్టు సమాచారం. సిడమాపై ఇప్పటికే రూ.40 లక్షల రివార్డు ఉంది.

ఓటర్ స్లిప్‌కు మొబైల్ యాప్

‘టీ పోల్’ను ఆవిష్కరించిన ఎన్నికల సంఘం

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికలకు ఓటరు స్లిప్‌లను మొబైల్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కల్పించింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన ‘టీపోల్’ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. యాప్ ఓపెన్ చేసి ఓటర్ ఐడీ నంబర్, జిల్లా పేరు ఎంట్రీ చేస్తే ఓటర్ స్లిప్ వస్తుందని, ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకోవాలని సూచించారు.

ఫిబ్రవరి 14న అక్కాచెల్లెళ్ల రోజు

పాక్‌లో ఓ యూనివర్సిటీ నిర్ణయం

లాహోర్ : ‘ఫిబ్రవరి 14’న ప్రపంచమంతా ప్రేమికుల దినోత్సవం కోసం సిద్ధమవుతుంటే, పాకిస్తాన్‌లోని ఓ యూనివర్సిటీ మాత్రం అదే రోజున అక్కాచెల్లెళ్ల దినోత్సవాన్ని నిర్వహించడానికి రెడీ అవుతోంది. ఇస్లాం సంప్రదాయాల ప్రకారం ఆ రోజున మహిళా స్టూడెంట్స్‌కు స్కార్ఫ్, బట్టలు ఇవ్వనున్నట్లు ఫైసలాబాద్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రకటించింది. 2017, 2018ల్లో పాక్‌లో వాలెంటైన్స్ డే సెలబ్రేషన్స్‌ను ఇస్లామాబాద్ హైకోర్టు నిషేధించింది. ప్రేమికుల రోజుపై ఎలాంటి వార్తలు ఇవ్వకూడదని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థల్ని ఆదేశించింది.



ఆదివారం షార్జాలో సుల్తాన్ బిన్ మహమ్మద్ అల్ ఖాసింతో రాహుల్

షార్జా అమీర్‌తో రాహుల్ భేటీ

దుబాయ్ : షార్జా పాలకుడు సుల్తాన్ బిన్ మహమ్మద్ అల్ ఖాసింతో కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనేక అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. రెండు రోజుల ‘యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ’ (యూఏఈ) పర్యటన ముగించుకుని ఇండియాకు తిరిగిరావడానికి కొన్ని గంటల ముందు షార్జా సుల్తాన్ తో రాహుల్ భేటీ అయ్యారు. అరబ్ ఎమిరేట్స్‌లోని ప్రవాస భారతీయులు చూపిన ప్రేమాభిమానాలు తనను ముగ్ధుడిని చేశాయని రాహుల్ అన్నారు. తన దుబాయ్ పర్యటనను సక్సెస్ చేసిన అందరికీ ఆయన థాంక్స్ అంటూ ఆయన ట్వీట్ చేశారు. దుబాయ్ పర్యటన సందర్భంగా ఇక్కడి భారతీయ కార్మికులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ఆయన సమావేశమయ్యారు. తర్వాత యూఏఈ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ రషీద్ తో భేటీ అయ్యారు. రెండు దేశాల ముఖ్య అంశాలపై చర్చించారు.

ఇద్దరు టెర్రరిస్టుల హతం

జమ్మూకాశ్మీర్ కుల్గాం జిల్లాలో ఎన్‌కౌంటర్

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఆదివారం ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు టెర్రరిస్టులను హతమార్చినట్టు పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన కరడుగట్టిన తీవ్రవాది, ఐఈడీ ఎక్స్‌పర్ట్ జీనతుల్ ఇస్లాం కాగా, మరొకరు షకీల్‌దార్. వీరిద్దరు 2015 నుంచి పలు టెర్రరిస్ట్ కార్యకలాపాల్లో యాక్టివ్‌గా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇస్లాం ప్రస్తుతం అల్‌బాదర్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. ‘కుల్గాం జిల్లా యరిపోరా ఏరియాలోని కట్పొరాలో శనివారం సాయంత్రం సెక్యూరిటీ బలగాలు కార్డన్ సెర్చ్ చేస్తుండగా అక్కడ మిలిటెంట్లు ఉన్నట్లు సమాచారం అందింది. మమ్మల్ని చూసి టెర్రరిస్టులు కాల్పులు మొదలెట్టారు. లొంగిపోవాలని హెచ్చరించాం. అయినా ఆపకపోవడంతో ఎన్‌కౌంటర్ చేశాం. ఘటనలో ఆరుగురు స్థానికులకు గాయాలయ్యాయి.’ అని ఓ ఉన్నతాధికారి చెప్పారు.



జీనతుల్ ఇస్లాం

బాస్ కాల్..? అయినా కట్ చేసెయ్!

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ సుప్రియా సూలే ఓ ప్రైవేట్ బిల్లు పెట్టారు. ఆ బిల్లు ‘రైట్ టు డిస్‌కనెక్ట్ (కాల్ కట్ చేసే హక్కు) బిల్ 2018’. కానీ, ఉద్యోగులతో సహా దాదాపు ఎవరికీ ఆ బిల్లు గురించి తెలిసుండదు. పని చేసే టైం అయిపోయినా చాలా మంది బాస్‌లు, ఉద్యోగులకు అదనపు పని చెబుతుండడంతో ఉద్యోగుల హక్కును కాపాడేందుకు ఆమె ఆ బిల్లును ప్రవేశపెట్టారు. అంటే, ఆఫీస్ టైం అయిపోయినా లేదా సెలవుల్లో అయినా బాస్ ఫోన్ చేస్తే కట్ చేసే హక్కు అన్నమాట. నిజానికి యూరప్ దేశాల్లో ఇప్పటికే అలాంటి చట్టాలున్నాయి. అక్కడ టైమ్ అంటే టైమే. మన దగ్గర అలాంటి పరిస్థితి లేదు. బయటి దేశాల కంటే మన దేశంలో ఎక్కువ టైం పనిచేస్తున్నారు. ఇటీవలి యూబీఎస్ రిపోర్ట్ ప్రకారం ముంబైలో ఏటా ఉద్యోగులు పనిచేస్తున్న సగటు టైం 3,314 గంటలు. ఈ విషయంలో ప్రపంచంలోనే ముంబై టాప్. అయితే, ఈ బిల్లును మాత్రం కొన్ని కంపెనీలు వ్యతిరేకిస్తున్నాయి. ఉద్యోగి, కంపెనీ సంబంధాలను చెడగొట్టడమేనని అంటున్నాయి.

బిల్లులోని ముఖ్యమైన అంశాలు..

- పని వేళలు పూర్తయ్యాక బాస్ కాల్ చేసినా, ఈ మెయిల్లు పెట్టినా పట్టించుకోనవసరం లేదు. ఫోన్లను ఎత్తాల్సిన అవసరం లేదు. అవసరమైతే కట్ చేయొచ్చు.
- ఫోన్లకు, ఈమెయిళ్లకు ఉద్యోగి రిప్లై ఇవ్వకుంటే.. క్రమశిక్షణ చర్యలు తీసుకోరాదు.
- పని వేళలు పూర్తయితే.. ఇంకా కొన్ని గంటలు ఎక్కువ పనిచేసేందుకు ఉద్యోగులతో సంస్థలు చర్చించుకోవచ్చు.
- వర్క్ అవర్స్ తర్వాత కూడా పనిచేస్తే ఉద్యోగికి ఓవర్‌టైం (ఓటీ) చెల్లించాలి.
- ఏ ఒక్క నిబంధనను అతిక్రమించినా ఉద్యోగి మొత్తం జీతంలో ఒక శాతం జరిమానాను కంపెనీకి విధించాలి.

కార్మిక చట్టాలు మార్చాలి

‘‘ముందు కార్మిక చట్టాలను మార్చడం చాలా అర్జెంట్. ఇప్పుడీ బిల్లుకు అంత తొందరేం లేదు. అయినా పని టైం తర్వాత లేదా సెలవు రోజుల్లో ఫోన్లు లిఫ్ట్ చేయకపోయినా, ఈ మెయిళ్లకు బదులివ్వకపోయినా ఉద్యోగికేం ఫైన్లు వేయట్లేదు. బిల్లులో ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటున్నారు. ఉద్యోగికి ఎదురయ్యే ఆ సమస్యకు చట్టం పరిష్కారం కాదు’’

- రీతూపర్ణ చక్రవర్తి,
ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, టీమ్ లీజ్

రిలేషన్స్ చెడగొడతారా?

ఏటా యువ టాలెంట్‌ను ప్రోత్సహించడానికి చాలా కంపెనీలు పోటీ పడుతున్నాయి. పాత కంపెనీల్లో ఉద్యోగుల జీతాలు ఎంత ఉన్నాయని చూడట్లేదు. పని, వ్యక్తిగత జీవితాన్ని ఎలా బాలెన్స్ చేస్తున్నారనే విషయాన్ని మాత్రమే చూస్తున్నాయి. ఇలాంటి చట్టాల ద్వారా ఉద్యోగి, కంపెనీల మధ్య బంధాన్ని చెడగొట్టాలనుకోవడం అస్సలు మంచిది కాదు.

- ఫైజల్ ఫరూఖీ,
సీఈవో, mouthshut.com

‘కాళేశ్వరం’ పరుగులు

మరో మూడున్నర నెలల్లో పనులు కంప్లీట్ ■ సీఎం ఆదేశాలతో శరవేగంగా పనులు

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ జీవధార కాళేశ్వరం పరుగులు పెడుతోంది. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసి వానాకాలానికల్లా నీళ్లిచ్చేందుకు ఇంజనీర్లు పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో సీఎం కేసీఆర్ స్వయంగా ప్రాజెక్టును పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నీటిని తరలించే గ్రావిటీ కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేయాలని సీఎం అప్పటికప్పుడు ఆదేశించి, నిధులు విడుదల చేయాలని సీఎస్‌కు సూచించారు. ఆ ఆదేశాలతో ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపడం, అందుకు అనుమతులు జారీ చేయడం చకచకా జరిగిపోయాయి. కాళేశ్వరంతో కొత్తగా 18 లక్షల ఎకరాలకు నీళ్లివ్వడంతో పాటు అంతే మొత్తంలో పాత ఆయకట్టును స్థిరీకరించనున్నారు.



మేడిగడ్డలో మట్టి పని అయింది

మేడిగడ్డ బ్యారేజీ మట్టిపని దాదాపు పూర్తయింది. 54.44 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను శనివారం నాటికి 53.17 లక్షల క్యూబిక్ మీటర్ల పని అయింది. 17.89 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనిలో మరో 4 లక్షల క్యూబిక్ మీటర్ల పని చేయాల్సి ఉంది. సైడ్‌బండ్స్, రివిట్‌మెంట్ పనుల్లోనూ వేగం పెంచారు. ప్రాజెక్టు ఎడమ వైపు బండ్ రివిట్‌మెంట్ పనుల్లో నిత్యం 250 మంది పనిచేస్తుండగా, కుడి వైపున 120 మంది కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఏప్రిల్ 15 నాటికి మేడిగడ్డ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అన్నారం బ్యారేజీ ఎర్త్ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. 4 వేల క్యూబిక్ మీటర్ల సైడ్ బండ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరో వారం రోజుల్లో ఈ పనులను పూర్తి చేయాలని ఇంజనీర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. వంతెనపై మొత్తం 66 స్లాబ్‌లు వేశారు. 66 గేట్లు బిగించి, అన్నింటిని లిఫ్ట్ చేయడానికి సిద్ధం చేశారు. 11.95 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనిచేయాల్సి ఉండగా ఇప్పటికే 11.88 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది.

వచ్చేనెలకల్లా సుందిళ్ల ఎర్త్‌వర్క్ పనులు

సుందిళ్ల బ్యారేజీ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఎర్త్ వర్క్‌లో సైడ్ బండ్స్ పనులు లక్ష క్యూబిక్ మీటర్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు మూడు షిఫ్టుల్లో పనులు చేయిస్తున్నారు. వచ్చేనెలకల్లా ఈ పనులు పూర్తి చేస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ బ్యారేజీకి మొత్తం 74 గేట్లను బిగించగా, అన్నింటిని లిఫ్ట్ చేసి వరదలు వచ్చినప్పుడు నీళ్లు వదలడానికి సిద్ధంగా ఉంచారు. వంతెనపై 74 స్లాబ్‌లకుగాను 61 స్లాబ్‌లు వేశారు. సుందిళ్ల పంపుహౌస్(గోలివాడ) పనులు ఏప్రిల్ చివరికల్లా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

వేగంగా కన్నెపల్లి లైనింగ్

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు 13.4 కి.మీ. గ్రావిటీ ఎర్త్ పనుల్లో మరో 20,953 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాలువ సిమెంట్ లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. సీఎం తన పర్యటన సందర్భంగా ఈ కాలువ వెంట ప్రయాణించి పలు సూచనలు చేశారు. 2.45 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సి ఉండగా 80,801 క్యూబిక్ మీటర్ల పని పూర్తయ్యింది. సీఎం పర్యటనకు ముందురోజు 900 మంది కార్మికులతో పనులు చేయించగా ఇప్పుడు కార్మికుల సంఖ్యను 2,500కు పెంచారు. నిత్యం 4,500 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ లైనింగ్ పనులు చేస్తున్నారు. ఇటీవల కొత్తగా మరో ప్యాచింగ్ ప్యాడ్ తెప్పించి పనుల్లో వేగం పెంచారు. కార్మికుల సంఖ్యను మరో 500 పెంచి రోజుకు 6 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేయాలని ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాలువపై 30 స్ట్రక్చర్లకు గాను 22 నిర్మాణం పూర్తి చేశారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో సివిల్ పనులు మార్చి కల్లా పూర్తి చేసేందుకు పనులు జరుగుతున్నాయి. 11 మోటార్లు, పంపులకుగాను 6 మోటార్లు బిగించారు. ఈ నెల చివరకు మూడు, ఏప్రిల్ 15లోపు మరో రెండు పంపులను బిగించి వెట్ రన్ చేపట్టనున్నారు.

అన్నారం, సుందిళ్ల పూర్తయ్యాయి

అన్నారం, సుందిళ్ల బ్యారేజీ పనులు దాదాపు పూర్తయ్యాయి. మేడిగడ్డ పనులను ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఏప్రిల్‌కల్లా మొత్తం మూడు బ్యారేజీలు, పంపుహౌస్‌లు రెడీ చేస్తాం. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నీటిని ఎత్తిపోస్తాం. తొలి దశలో ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు నీటిని తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వానాకాలం వచ్చేనాటికి మిడ్ మానేరుకు కాళేశ్వరం నీళ్లను లిఫ్ట్ చేస్తాం.

- నల్లా వెంకటేశ్వర్లు,
సీఈ, కాళేశ్వరం ప్రాజెక్ట్

అన్నారంలో 4, సుందిళ్లలో 2 మోటార్లు రెడీ

అన్నారం పంపుహౌస్‌లో 8 మోటార్లకుగాను 4 మోటార్లు బిగించారు. మరో రెండు పంపులను ఈ నెల చివరి నాటికి బిగించనున్నారు. మిగతా రెండు మోటార్లు, పంపులు ఫిబ్రవరి చివరి నాటికి బిగించనున్నారు. గోలివాడ పంపుహౌస్‌లో 9 మోటార్లకుగాను 2 మోటార్లను బిగించారు. వచ్చేనెల పదో తేదీ నాటికి మరో రెండు మోటార్లు, పంపులు ఏర్పాటు చేయనున్నారు. మార్చి చివరికి రెండు పంపులు, ఏప్రిల్ చివరి నాటికి మొత్తం పంపులు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

లోక్ సభ ఎన్నికలకు కేజ్రీవాల్ దూరం

వారణాసి నుంచి బలమైన కేండిడేట్ ను దింపుతామన్న ఆప్

న్యూఢిల్లీ: రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పోటీ చేయరని పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వెల్లడించారు. ప్రస్తుతానికి ఆయన ఢిల్లీకే పరిమితం అవుతారని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశం నిర్ణయాలను ఆయన చెప్పారు. ఈసారి వారణాసి నుంచి బలమైన కేండిడేట్‌ను బరిలో దింపుతామన్నారు. లోక్ సభ ఎన్నికల్లో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గోవా రాష్ట్రాల్లోని అన్ని సెగ్మెంట్ల నుంచి పోటీ చేస్తామన్నారు. యూపీలో పార్టీ బలంగా ఉన్న పశ్చిమ ప్రాంతంతో పాటు మరికొన్ని ఏరియాల్లో పోటీ చేస్తామని చెప్పారు. దీనిపై ఫిబ్రవరిలోగా తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. 2014 లో వారణాసి నుంచి ప్రధాని మోడీ పై పోటీ చేసి కేజ్రీవాల్ ఓడిపోయారు.

జవాన్లకు ఐఎస్ఐ వల

- సైనిక వివరాల కోసం ఫేస్‌బుక్‌లో ఐఎస్ఐ ఏజెంట్ ఎర
- ఉచ్చులో పడి సమాచారం ఇచ్చిన జవాను
- అరెస్టు చేసిన పోలీసులు
- మరో 50 మందిని ట్రాప్ చేసే యత్నం

న్యూ ఢిల్లీ: ఆమె పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీస్ ఇంటలిజెన్స్(ఐఎస్ఐ) ఏజెంట్. అచ్చం ఇండియన్ ఉమన్‌లా చీర కట్టుతో ఫొటోలు ఫేస్‌బుక్‌లో పోస్టుచేసింది. దేశ సైనిక స్థావరాల సమాచారమే లక్ష్యంగా ఆర్మీ జవాన్లకు వల వేసింది. తనను ఆర్మీ మెడికల్ కార్ప్స్ కెప్టెన్‌గా పరిచయం చేసుకుని ఏకంగా 50 మంది జవాన్లను టార్గెట్ చేసింది. వాళ్ల దగ్గర్నుంచి తనకు కావాల్సిన ఇంటలిజెన్స్ సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించింది. ఈమె వలలో పడ్డ ఓ జవాను ఆర్మీ స్థావరాల సమాచారాన్ని అందించాడు. దీనిపై ఇంటలిజెన్స్ సమాచారంతో రాజస్థాన్ పోలీసులు అతని యాక్టివిటీస్‌పై నిఘా పెట్టారు. ఏజెంట్‌కు సమాచారం అందించినట్లు తేలడంతో జవానును అదుపులోకి తీసుకున్నారు.

సన్నిహితంగా మెలుగుతూ..

ఐఎస్ఐ ఏజెంట్ ఫేస్‌బుక్‌లో తన పేరు అనికా చోప్రా అని, మిలిటరీ నర్సింగ్ కార్ప్స్ కి కెప్టెన్‌గా పని చేస్తున్నానంటూ రాజస్థాన్‌లోని జైసల్మేర్ ఆర్మీ యూనిట్‌లో పనిచేస్తున్న సోమ్‌వీర్‌సింగ్(22)ని 2016లో పరిచయం చేసుకుంది. మాయ మాటలు చెప్పి, సోమ్‌వీర్‌తో సన్నిహితంగా మెలుగుతూ ఆర్మీ సమాచారాలు తెలుసుకుంది. సోమ్‌వీర్‌పై అనుమానం వచ్చిన ఇతర సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అతని ఫేస్‌బుక్ యాక్టివిటీస్ పరిశీలించగా ఆర్మీ స్థావరాల లొకేషన్లు, అర్జున్ ట్యాంకర్ల ఫొటోలను షేర్ చేసినట్లు గుర్తించారు. పాకిస్థాన్ ఏజెంట్ నుంచి సోమ్‌వీర్ బ్యాంక్ ఖాతాకు డబ్బు ట్రాన్స్ ఫర్ అయినట్లు కూడా తేలింది. సోమ్‌వీర్‌తోనే కాకుండా పలు యూనిట్లలో పనిచేస్తున్న మరో 50 మంది జవాన్లతోనూ అనికా చోప్రా పరిచయం చేసుకుని ఫేస్‌బుక్‌లో చాటింగ్ చేసినట్లు గుర్తించారు. ఒక్కొక్కరితో ఒక్కో సమయంలో చాటింగ్ చేస్తూ ఇన్‌ఫర్మేషన్ లాగేందుకు ప్రయత్నించిందని, దీనిపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పారు.



ఆదివారం పంతంగి టోల్ ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

వద్దన్నా టోల్ వసూల్!

పంతంగి టోల్‌ప్లాజా వద్ద గొడవలు

- ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశాలు లేవంటూ వసూలు
- చెల్లించేందుకు జనం నిరాకరణ
- నిర్వాహకులతో వాగ్వాదం..
- చివరికి టోల్ ఎత్తివేతతో సాఫీగా వెళ్లిన వాహనాలు

యాదాద్రి, వెలుగు: టోల్ వసూలు విషయంలో యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 13, 16వ తేదీల్లో టోల్‌ను ఎత్తేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. అయినా ఆదివారం ఉదయం పంతంగి టోల్‌గేట్ వద్ద టోల్ వసూలు చేయడం వివాదాస్పదమైంది. ప్రభుత్వం ఎత్తేసినా టోల్ ఎందుకు వసూలు చేస్తున్నారంటూ వాహనదారులు టోల్‌ప్లాజా నిర్వాహకులతో వాదనకు దిగారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) నుంచి తమకు ఆదేశాలు రాలేదని, టోల్ చెల్లించాల్సిందేనని నిర్వాహకులు చెప్పారు. దీంతో టోల్ ప్లాజా వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడి.. భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు వచ్చినా పరిస్థితిలో మార్పు లేదు. చౌటుప్పల్ ఆర్డీవో సూరజ్‌కుమార్ వచ్చి ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడటంతో చివరకు టోల్ వసూళ్లను నిలిపివేశారు. ఉదయం 11 గంటలకు టోల్ వసూళ్లను నిలివేయగా.. వాహనాలు క్లియర్ అయ్యేందుకు మధ్యాహ్నం ఒంటి గంట పట్టింది. ఆ తర్వాత వాహనాలన్నీ సాఫీగా వెళ్లి పోయాయి.

ఆదివారమూ రద్దీనే..

హైదరాబాద్, విజయవాడ హైవేపై ఆదివారమూ వాహనాల రద్దీ కొనసాగింది. శనివారం అర్ధరాత్రి నుంచి వాహనాలు పెరిగాయి. ఆదివారం ఉదయం వాహనదారులు పంతంగి టోల్‌గేట్ దాటేందుకు గంట పట్టింది. కిలోమీటరుకు పైగా వాహనాలు బారులు తీరాయి. హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపైనా టోల్ వసూళ్లను నిలిపివేయడంతో వాహనాలు సాఫీగా వెళ్లిపోయాయి.

చలి తగ్గుతున్నది

- పెరుగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మెదక్‌లో 14.5 డిగ్రీలు నమోదు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రవ్యాప్తంగా భారీ మంచు కురుస్తున్నా చలి తీవ్రత మాత్రం తగ్గుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగాయి. మెదక్‌లో 14.5 డిగ్రీలు, నల్లగొండలో 16.4, రామగుండం, భద్రాచలం, హన్మకొండ, హైదరాబాద్‌లలో 17.4 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. అయితే తూర్పు, ఆగ్నేయం నుంచి చలి గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరో రెండు రోజులు పొగ మంచు ఆవరించే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదివారం ఆదిలాబాద్, భద్రాచలం, హకీంపేట, హైదరాబాద్, నిజామాబాద్, రామగుండంలలో మంచు కురిసిందని పేర్కొంది.



అటు పతంగులు.. ఇటు జిలేబీలు

పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్

హైదరాబాద్, వెలుగు: పతంగుల పండుగొచ్చేసింది. చవులూరించే బయటి దేశాల మిఠాయిలూ వచ్చేశాయి. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ పతంగుల పండుగ, స్వీట్ ఫెస్టివల్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రారంభించారు. మండలి చైర్మన్ స్వామి గౌడ్, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు. 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఓ వైపు పతంగుల పండుగ, మరోవైపు స్వీట్ల పండుగ.. చూస్తుంటే సంతోషంగా ఉందని వెంకయ్యనాయుడు అన్నారు. ఊహలు, ఆశయాలు ఎగిరే గాలిపటమంత ఉన్నతంగా ఉండాలని చెప్పారు. కైట్ ఫెస్టివల్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా గొప్పగా నిర్వహిస్తున్నారన్నారు. విదేశీ వంటకాలు తిని రోగాల బారిన పడొద్దని, దేశీయ వంటకాలు తింటే ఆరోగ్యంగా ఉండడమే కాకుండా జీవిత కాలం కూడా పెరుగుతుందని అన్నారు.

ఓ వైపు పతంగులు.. ఇంకోవైపు స్వీట్లు

అమెరికా, బ్రిటన్, చైనా సహా 18 (మనతో కలిపి 19) దేశాలు కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నాయి. ఆయా దేశాలకు చెందిన 42 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్ పతంగులను ఎగరేస్తున్నారు. కైట్ ఫెస్టివల్‌తో పాటే స్వీట్ ఫెస్టివల్‌తో పరేడ్ గ్రౌండ్స్ జనంతో కిటకిటలాడిపోతోంది. 20 దేశాల ప్రతినిధులు ప్రత్యేకంగా స్వీట్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. పూతరేకులు, సున్నుండలు, సకినాలు, లడ్డూలు, పాయసాలు, బెంగాల్ స్పెషల్ స్వీట్ నరికెల్ నారు, మైదా సుజీ బిస్కెట్, గుజియా, బీహార్ పెడుకియా, హర్యానా సక్కర్పరా, మహారాష్ట్ర గుడ్ ఛండియా, జమ్మూ గుజియల్, యూపీ గాజర్ కా హల్వా, కర్ణాటక బాదంపురి, రాజస్థాన్ సత్తూ కీ కచోరి, ఎటియోపియాన్ కాఫీ, బక్లావా, బ్రెజిల్ కోకోనట్ బెలిస్, నేపాల్ నాన్ వెజ్ మోమో వంటి వెయ్యి రకాల స్వీట్లు, వంటకాలను స్వీట్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు పెట్టారు.



ఆదివారం కైట్ ఫెస్టివల్‌లో పతంగి ఎగరేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య

సార్.. మళ్లొస్తం!

టీఆర్ఎస్‌లోకి తిరిగొచ్చేందుకు కొందరు నేతల యత్నాలు



- సన్నిహితులు, కీలక నాయకుల ద్వారా రాయబారాలు
- అధినేత చెవిన వేసేందుకు జంకుతున్న నేతలు

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్‌ను వీడిన కొందరు నేతలు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సన్నిహిత నేతల ద్వారా సీఎం కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు రాయబారాలు పంపే పనిలో పడ్డారు. ఏదో ఆశతో పార్టీ వీడామని, తమను మన్నించి మరో అవకాశం ఇవ్వాలని చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై కొందరు నేతలు సరే చూద్దామని అంటున్నా, చాలా మంది కేసీఆర్ వరకు తీసుకెళ్లడానికి జంకుతున్నట్టు తెలుస్తోంది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో పార్టీకి దూరమైన వారిని తిరిగి దగ్గర చేసుకోవాలంటూ ఇటీవల కేటీఆర్ పలుమార్లు పేర్కొన్నారు. ఈ మాటల ఆధారంగానే కొందరు తిరిగి టీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇలాంటి నేతలు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.

లైన్లో చాలా మంది..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్‌ను వీడిన నలుగురు ఎమ్మెల్సీల్లో కొండా మురళి తన పదవికి రాజీనామా చేశారు. మిగతా ముగ్గురిపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో పదవి కోల్పోకుండా ఉండేందుకు ఒక ఎమ్మెల్సీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రికి దగ్గర ఉండే ఓ కీలక నేత దగ్గరికి వెళ్లి.. 'ఎన్నికలకు ముందు ఏదో ఆశ పడి పార్టీ వీడాను, సార్‌తో మాట్లాడండి మళ్లీ వస్తాను. మరోసారి ఇలాంటి తప్పుచేయను. మీకూ చెడ్డపేరు తీసుకురాను..'అని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆ కీలక నేత సరేనన్నా.. ఈ విషయాన్ని కేసీఆర్ దాకా తీసుకెళ్లే ధైర్యం చేయలేకపోయారని, ఆ ఎమ్మెల్సీ ఫోన్ లిఫ్ట్ చేయడమే మానేశారని సమాచారం.

- టీఆర్ఎస్‌లోనే ఉండుంటే కీలక హోదా దక్కేదని, అనవసరంగా పార్టీ వీడి తప్పు చేశానని మరో నేత తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు తెలుస్తోంది. పార్టీ మారి ఊరికే ఉన్నా అయిపోయేదని, ప్రెస్‌మీట్లు పెట్టి విమర్శలు చేయడంతో తనకు తెలంగాణ భవన్‌లో ఎంట్రీ దొరకడం కష్టమేనని అంటున్నట్టు సమాచారం. టీఆర్ఎస్‌లో కొనసాగుతున్న తన సహచరులతో ఈ విషయాన్ని చెప్పుకుని, తనను మన్నించాల్సిందిగా సార్‌ను కోరాలని అడిగినట్టు తెలుస్తోంది. కానీ ఈయన విషయాన్ని కూడా పార్టీ చీఫ్ వద్దకు తీసుకెళ్లేందుకు ఎవరూ సాహసం చేయడం లేదని అంటున్నారు.
- ప్రభుత్వం గుర్తించి పదవి ఇచ్చినా పార్టీని వీడిన మరో ఇద్దరు నేతలు సైతం అంతర్మథనంలో పడినట్టు తెలుస్తోంది. ఒక నేతకు తిరిగి ఎంట్రన్స్ కష్టమేనని తెలుస్తున్నా, మరోనేత పార్టీలోకి తిరిగొచ్చేందుకు స్థానిక నేతల నుంచి పెద్దగా అభ్యంతరం లేదని అంటున్నారు. కానీ ఈ విషయాన్ని అధినేత వద్ద చెప్పలేని స్థితిలో సదరు జిల్లా నేతలు ఉన్నారు.
- ఎన్నికల్లో తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేసిన నలుగురైదుగురు నేతలు సైతం తిరిగి అధికార పార్టీలోకి వచ్చేందుకు తమకున్న మార్గాల్లో ప్రయత్నిస్తున్నారు. వారిలో కొందరి విషయంగా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని అంటున్నారు. కానీ గెలిచిన ఎమ్మెల్యేలతో వారికి సఖ్యత ఏర్పడటం కష్టమేనని, పార్టీలో ప్రాధాన్యం దక్కడం అనుమానమేనని చెబుతున్నారు.

ముందు కేటీఆర్‌ను కలసి..

ఎన్నికలకు ముందు పార్టీని వీడిన వారిలో కొందరు నేతలు తొలుత కేటీఆర్‌ను కలసి లైన్ క్లియర్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ తర్వాతే కేసీఆర్‌ను కలిస్తే మంచిదని వారు భావిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా పది మంది నేతలు తిరిగి టీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు కూడా గులాబీ తీర్థం పుచ్చుకోవడానికి రంగం సిద్ధమవుతోందని, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి ఈ చేరికలు ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది.

అది అవకాశవాద కూటమి

- ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ఫైర్



న్యూఢిల్లీ : బీజేపీకి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పాటు చేయడానికి ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలపై ప్రధాని నరేంద్ర మోడీ మండిపడ్డారు. మహాకూటమిని 'అవకాశవాద కూటమి' గా విమర్శించారు. అధికారాన్ని ప్రజలకు మేలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుంటే సొంత సామ్రాజ్యాల స్థాపన కోసం ప్రతిపక్షాలు తాపత్రయపడుతున్నాయని దుయ్యబట్టారు. లోక్ సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో తమిళనాడులోని బీజేపీ కార్యకర్తలతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. " మిగతా పార్టీల్లా విభజించు , పాలించు అనే విధానాన్ని మేం పాటించడం లేదు. ప్రజలకు మంచి పనులు చేయాలనే ప్రయత్నిస్తున్నాం. అందుకే అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళుతున్నాం." అని అన్నారు. లోక్ సభ ఎన్నికలు బీజేపీతో పాటు దేశానికి ఎంతో కీలకమైనవన్నారు.

ఎన్డీయే సర్కార్ పై అబద్ధాల ప్రచారం

కేంద్ర ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయని ప్రధాని మోడీ మండిపడ్డారు. కేంద్రం సమర్థంగా పనిచేయడం లేదని పసలేని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో యువత, రైతులు, మహిళలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు లాభం చేయడానికే తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. తొలిసారి ఓటు హక్కు ఉపయోగించుకునే వారు ఈ విషయం గమనించాలన్నారు. రాజవంశాల రాజకీయాల కంటే అభివృద్ధే ముఖ్యమన్నారు. పేదలు, మధ్య తరగతి వర్గాల కోసం కేంద్రం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ కార్యకర్తలను కోరారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



తొలి దశ ఎలక్షన్ 667 చోట్ల ఏకగ్రీవాలు

- 3,813 పంచాయతీలకు ఎన్నికలు
- రెండో దశకు ముగిసిన నామినేషన్లు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో తొలివిడత ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో 667 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. అత్యధికంగా నిర్మల్ (58), నల్లగొండ (52), ఆదిలాబాద్ (50), వరంగల్ రూరల్ (41) జిల్లాల్లో ఎక్కువగా, కరీంనగర్ జిల్లా (04) పరిధిలో అతితక్కువ సంఖ్యలో పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తొలిదశలో 4,480 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటికి ఆదివారంతో నామినేషన్ల ఉప సంహరణ పూర్తయింది. అధికారులు పోటీలో ఉండే అభ్యర్థులను ఖరారు చేసి, గుర్తులను కేటాయించారు. అయితే 4,480 పంచాయతీలకుగాను ఏకగ్రీవాలు పోగా 3,813 చోట్ల ఈ నెల 21న పోలింగ్ జరుగనుంది. అయితే మొత్తంగా సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు బరిలో ఉన్నారన్న వివరాలు ఆదివారం అర్ధరాత్రి వరకు తెలియలేదు. అన్ని జిల్లాల నుంచి ఎన్నికల సంఘానికి పూర్తి వివరాలు అందకపోవడమే దీనికి కారణమని అధికారులు వెల్లడించారు.

రెండో దశకు నామినేషన్లు క్లోజ్

రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం కూడా ఆదివారంతో ముగిసింది. తుది అభ్యర్థులు ఎవరనేది 17న తేలనుంది. ఈ నెల 25న 172 మండలాల పరిధిలోని 4,137 సర్పంచులు, 36,620 వార్డులకు పోలింగ్ జరుగుతుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకే నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. అర్ధరాత్రి వరకు కూడా ఎన్నికల సంఘానికి జిల్లాల నుంచి పూర్తి వివరాలు అందలేదు. 30 జిల్లాలకుగాను 5 జిల్లాల పూర్తి సమాచారమే వచ్చిందని అధికారులు తెలిపారు.

జిల్లా	ఏకగ్రీవ పంచాయతీలు
కరీంనగర్	04
పెద్దపల్లి	04
జగిత్యాల	07
మంచిర్యాల	08
వరంగల్ అర్బన్	10
ఖమ్మం	10
వనపర్తి	13
సూర్యాపేట	13
సిరిసిల్ల	13
వికారాబాద్	13
ఆసిఫాబాద్	15
జనగామ	18
భద్రాద్రి	19
సిద్దిపేట	21
యాదాద్రి	21
భూపాలపల్లి	22
సంగారెడ్డి	23
కామారెడ్డి	28
గద్వాల	29
నాగర్‌కర్నూల్	31
మహబూబాబాద్	31
మెదక్	32
నిజామాబాద్	38
వరంగల్‌రూరల్	41
మహబూబ్‌నగర్	43
నల్లగొండ	52
ఆదిలాబాద్	50
నిర్మల్	58
మొత్తం	667

భారీగా నగదు స్వాధీనం

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భారీగా నగదు పట్టుబడుతోంది. ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా కోటీ 21లక్షల 23వేల 820 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. 24 కేసులు నమోదు చేశామని, రూ.16,735 విలువ కలిగిన మద్యాన్ని సీజ్ చేశామని వెల్లడించారు.



త్వరలో 15 కమిటీలు

'సంకల్ప్ పత్ర'గా బీజేపీ మేనిఫెస్టో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలకు సన్నద్ధం అవడంలో భాగంగా బీజేపీ మేనిఫెస్టో కమిటీ ఆదివారం ఇక్కడ సమావేశమైంది. 20 మంది సభ్యులున్న ఈ కమిటీకి కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. 'సంకల్ప్ పత్ర ' పేరుతో మేనిఫెస్టో రూపొందించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి సభ్యులతో చర్చించినట్లు మీడియాకు రాజ్ నాథ్ చెప్పారు. ఇందులో భాగంగా 15 కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు ఈ కమిటీల్లో చోటు కల్పిస్తామన్నారు. మేనిఫెస్టో కమిటీలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, నిర్మలా సీతారామన్, థావర్ చంద్ గెహ్లాట్, రవి శంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్, ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తదితరులున్నారు.



ఆదివారం ఇందిరాపార్కులోని చెన్నారెడ్డి మెమోరియల్ రాక్‌గార్డెన్‌లో నివాళులర్పిస్తున్న ఉత్తమ్ తదితరులు

సభలకెళ్తూనే సంతకాలు చేసేవారు

- మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాల్లో నేతలు

హైదరాబాద్, వెలుగు: మర్రి చెన్నారెడ్డి సీఎంగా ఉన్నపుడు సెక్రటేరియట్‌లో చేయాల్సిన సంతకాలు.. సభలు, సమావేశాలకు వెళ్లేప్పుడు చేసేవారని రాజకీయ ప్రముఖులు గుర్తు చేసుకున్నారు. తనతో విభేదించే వారినీ అనుకూలంగా మలుచుకున్న విలక్షణ వ్యక్తి అని ప్రశంసించారు. ఆదివారం ఇందిరాపార్కులోని చెన్నారెడ్డి మెమోరియల్ రాక్‌గార్డెన్‌లో ఆయన శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ గవర్నర్ రోశయ్య, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరై ఆయనకు నివాళులర్పించారు. ప్రతిపక్షాల దాడిని హుందాగా స్వీకరించిన సీఎంలలో చెన్నారెడ్డి ఒకరని జైపాల్‌రెడ్డి కొనియాడారు. మర్రి అందరివాడని రోశయ్య అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఆయన చేసిన పోరాటం ఎనలేనిదని ఉత్తమ్ పొగిడారు. ఎమ్మెల్యేలను గౌరవించే గొప్ప వ్యక్తిత్వం తనదని మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రశంసించారు. ఆయన బయోగ్రఫీ రాస్తున్నామని మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. చెన్నారెడ్డి నేటి తరానికి ఆదర్శమని, ఆయన సిద్ధాంతాలు, ఆశయాలకు కట్టుబడి పని చేయాలని తన సందేశంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు.



సీవీసీ కేవీ చౌదరిని తొలగించండి

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి డిమాండ్

న్యూఢిల్లీ: సీబీఐ వివాదంపై కాంగ్రెస్ మరోసారి స్పందించింది. చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) కేవీ చౌదరిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. కేంద్రం చేతిలో చౌదరి కీలుబొమ్మగా పనిచేశారని ఆదివారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి ఆరోపించారు. కేంద్రం తొలగించకపోతే చౌదరే రాజీనామా చేయాలన్నారు. " సీబీఐ పంజరంలో చిలకలా మారిందన్న కామెంట్లు విన్నాం. ఇప్పుడు సీవీసీ కూడా అదే జాబితాలో చేరిపోయింది " అని ఆయన అన్నారు. రాఫెల్ డీల్ పై దర్యాప్తును నివారించడానికి సీవీసీని మోడీ సర్కార్ కీలుబొమ్మగా మార్చిందన్నారు. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా కు అనుకూలంగా కేవీ చౌదరి పనిచేశారని సింఘ్వి విమర్శించారు.

స్పీకర్ సీటెవరికో?

పరిశీలనలో రెడ్యానాయక్ , ఈటల, పోచారం, పద్మ పేర్లు

- తాజాగా తెరపైకి ఇంద్రకరణ్‌రెడ్డి పేరు
- అసెంబ్లీ సమావేశాల షెడ్యూలుతో జోరుగా చర్చ
- ఆ పదవిని తీసుకునేందుకు ఎమ్మెల్యేల నిరాకరణ
- 'ఓటమి' సెంటిమెంటే కారణమా?

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో ఈసారి అసెంబ్లీ స్పీకర్ పదవి ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తిగా మారింది. సమావేశాలు ప్రారంభమయ్యే తొలిరోజు (ఈ నెల 17)న 119 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ముగియగానే స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలవుతుంది. తర్వాత రోజు స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. అయితే స్పీకర్‌గా ఎవరు ఉంటారన్నదానిపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, రెడ్యానాయక్, పద్మా దేవేందర్‌రెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేరు కూడా జాబితాలో చేరింది.

ఆసక్తి తక్కువే..

పోచారం గతేడాది గుండెకు సంబంధించిన సర్జరీ చేయించుకోవడంతో పెద్దగా యాక్టివ్‌గా ఉండటం లేదు. అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడల్లా స్పీకర్ ఎక్కువగా మాట్లాడాల్సి ఉంటుందని, తనకు ఆరోగ్యం సహకరించదని ఆయన చెప్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈటల రాజేందర్‌కు స్పీకర్ పదవి ఇస్తారని ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచే నేతల్లో చర్చ జరుగుతున్నా.. ఆయన మాత్రం మంత్రి పదవినే కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ ఎస్టీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పేరు కూడా పరిశీలనలో ఉన్నా.. ఆయనను మంత్రిగా తీసుకొని గిరిజనశాఖ అప్పగిస్తారని కొందరు నేతలు అంటున్నారు. గత ప్రభుత్వంలో గిరిజనశాఖ మంత్రిగా పనిచేసిన చందూలాల్ తాజా ఎన్నికల్లో ఓటమి పాలవటం, ఎస్టీ సామాజిక వర్గంలో సీనియర్ ఎమ్మెల్యేలు ఎవరు లేకపోవటంతో రెడ్యానాయక్‌కు మంత్రి పదవి దక్కుతుందని వారు చెప్తున్నారు. ఇక మొన్నటివరకు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన పద్మా దేవేందర్‌రెడ్డికి ఈ సారి స్పీకర్‌గా ప్రమోషన్ వస్తుందని ప్రచారంలో ఉన్నా.. ఆమె కూడా మంత్రి పదవినే ఆశిస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజులుగా నిర్మల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేరు స్పీకర్ పదవి కోసం తెరమీదికి వచ్చింది. ఆయనను ఎంపిక చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై టీఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

స్పీకర్‌గా చేస్తే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొన్నటి వరకు అసెంబ్లీ స్పీకర్లెవరూ తర్వాతి ఎన్నికల్లో గెలిచిన దాఖలాలు లేవు. గతంలో ఒక్క యనమల రామకృష్ణుడు మాత్రమే తిరిగి గెలిచారు. శ్రీపాదరావు, ప్రతిభా భారతి, సురేశ్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, మధుసూదనా చారి వంటివారు స్పీకర్‌గా పనిచేసి తర్వాతి ఎన్నికల్లో ఓడిపోయారు. స్పీకర్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి 2014 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. ఇలాంటి సెంటిమెంట్ దృష్ట్యా స్పీకర్ పదవి అంటేనే ఎమ్మెల్యేలు జంకుతున్నారు. తర్వాతి రాజకీయ భవిష్యత్ అయోమయంగా మారుతుందేమోనని కలవరపడుతున్నారు. కొందరైతే మంత్రి పదవి దక్కకపోయినా సరేగానీ స్పీకర్ పదవి మాత్రం వద్దని భావిస్తున్నట్టు చెబుతున్నారు.

ఏప్రిల్ 16న పాలిసెట్

హైదరాబాద్, వెలుగు: టెక్నికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే రాష్ట్ర పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్ 2019) పరీక్షను ఏప్రిల్ 16న నిర్వహించనున్నట్లు రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులు కాగా వీరి నుంచి ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటివారంలో దరఖాస్తులు స్వీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు.

‘నిఘా వైఫల్యం వల్లే కార్గిల్ చొరబాటు’

భోపాల్ : మిలటరీ ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్ వల్లే 1999లో కార్గిల్ ప్రాంతంలో పాకిస్థాన్ సైనికులు చొరబడ్డారని లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) మోహిందర్ పూరీ చెప్పారు. కాశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయం చేయడమే అప్పట్లో పాక్ ప్రభుత్వ టార్గెట్ అని ఆయన అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన పాత విషయాలను గుర్తు చేసుకున్నారు. వాస్తవాధీన రేఖ రూపు రేఖలు మార్చాలన్నది పాకిస్థాన్ సైన్యం ఆలోచన అని ఆయన చెప్పారు. అయితే ఇండియన్ ఆర్మీ వీరోచితంగా పోరాడి పాక్ ఆశలను వమ్ము చేసిందని మోహిందర్ పూరీ చెప్పారు.

18 నుంచి పీజీటీ సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర గురుకులాల్లో పీజీటీ బయాలజీ, ఫిజిక్స్ పోటీ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 18నుంచి నిర్వహిస్తామని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. వెరిఫికేషన్ జరిగే స్థలం, తేదీలను ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా పంపించామని, అభ్యర్థుల వివరాలు, ర్యాంకుల సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచామని బోర్డు కన్వీనర్ తెలిపారు.

నేటి నుంచి ఏకలవ్య గురుకుల క్రీడలు

హైదరాబాద్, వెలుగు: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాతీయ క్రీడలు సోమవారం నుంచి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో మూడ్రోజులు జరిగే ఈ పోటీలు కేంద్ర ప్రభుత్వం, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరం, సహాయ మంత్రులు సుమన్‌బాయి బాబుర్, సుదర్శన్ భగత్, రాష్ట్ర సీఎస్ ఎస్‌కే జోషి హాజరవుతారని చెప్పారు.



విదేశీ రంగవల్లులు

ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలోని బాల వికాస్ స్వచ్ఛంద సంస్థలో ముగ్గులు వేస్తూ సంక్రాంతి సంబురాలు జరుపుకుంటున్న విదేశీయులు

రాజకీయాల్లో గంగిరెద్దులు

ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు

హైదరాబాద్, వెలుగు: గతంలో గంగిరెద్దులను ఎక్కువగా గ్రామాల్లో చూసేవాళ్లమని, ఇప్పుడు రాజకీయాల్లో చూస్తున్నామని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహించిన ట్రస్ట్ రెండో వార్షికోత్సవం, సంక్రాంతి సంబరాల్లో ఆయన మాట్లాడారు. గంగిరెద్దుల ఆటలో ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయని, యజమాని ఆదేశం ప్రకారం నడుచుకోవడమనే విషయం అందులో దాగి ఉందని వివరించారు. యువత వ్యవసాయం వైపు రావాలని, వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. కళలు, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సంస్కృతికి, భాషకు పెద్దపీట వేస్తున్న సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు. స్వర్ణభారత్ ట్రస్ట్ గ్రామీణాభివృద్ధికి మోడల్‌గా నిలిచిందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. సేవతో పాటు సంస్కృతి పరిరక్షణ కోసం వారు చేస్తున్న కార్యక్రమాలు ఉన్నతమైనవని ప్రశంసించారు. గ్రామీణ భారత్ నైపుణ్య భారత్‌గా మారాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.రాధాకృష్ణన్ అన్నారు. సంస్కృతి పరిరక్షణలో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, కళాకారులకు ప్రోత్సాహం అందించే ట్రస్ట్ ఆలోచన అభినందనీయమన్నారు.

మోడీ సర్కారు ఆఫర్‌కు సిక్రీ ‘నో’



- సీశాట్ ప్రెసిడెంట్ పదవికి నామినేట్ చేసిన ప్రభుత్వం
- తొలుత అంగీకరించిన సుప్రీంకోర్టు జడ్జి
- ప్రతిపక్షాల ఆరోపణలతో వెనక్కి!

న్యూఢిల్లీ: కామన్‌వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ (సీశాట్)కు ప్రెసిడెంట్/ మెంబర్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ పేరును కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తొలుత ఈ ఆఫర్‌ను అంగీకరించిన జస్టిస్ సిక్రీ.. తర్వాత దీనిపై వెనక్కి తగ్గారు. సీశాట్ కోసం జస్టిస్ సిక్రీ పేరును గత నెలలోనే నామినేట్ చేశారని, ఆయన సరేనన డంతో విదేశాంగ శాఖ సీశాట్‌కు వివరాలు కూడా పంపిందని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. కానీ ఆయన సీశాట్‌కు వెళ్లబోనంటూ కేంద్ర న్యాయశాఖకు లేఖ రాసినట్టు తెలిసింది.

ప్రతిపక్షాల ఆరోపణలతో..

సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మను పదవిలోంచి తొలగించిన కమిటీలో ప్రధాని మోడీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు జస్టిస్ సిక్రీ కూడా సభ్యుడు. మార్చి 6వ తేదీన రిటైర్ కానున్న ఆయన సుప్రీంకోర్టులో రెండో అత్యంత సీనియర్ జడ్జి కూడా. అలోక్ వర్మను తొలగించే ప్రతిపాదనను ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించగా.. ప్రధాని మోడీ, జస్టిస్ సిక్రీ అనుకూలంగా ఓటేశారు. సీబీఐ డైరెక్టర్ తొలగింపుపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆగ్రహంగా ఉన్నాయి.

‘రాఫెల్’ను కప్పిపుచ్చుతున్నారు: రాహుల్

రాఫెల్ కుంభకోణాన్ని కప్పిపుచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ భయమే మోడీని అవినీతి పరుడిని చేస్తోందని, కీలకమైన సంస్థలన్నింటినీ నాశనం చేయిస్తోందని మండిపడ్డారు. ఆలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా తప్పించడాన్ని సమర్థించిన జస్టిస్ ఏకే సిక్రీకి కేంద్రం ఆఫరిచ్చిందని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ‘‘ఈ ప్రధాని దేన్నీ వదలరు. అన్నింటినీ నాశనం చేసేస్తారు. రాఫెల్ డీల్‌ను కప్పిపుచ్చేందుకు ఏమైనా చేస్తారు’’ అని ట్వీట్ చేశారు. సీశాట్‌లో అధ్యక్షుడిగా లేదంటే సభ్యుడిగా చేస్తామంటూ సిక్రీకి కేంద్రం ఆఫరిచ్చిందన్న వార్తా కథనాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

బిల్లు రాదాయె.. అప్పు తెగదాయె

ఈఎస్ఐ రీయింబర్స్‌మెంట్ కోసం చిన్న ఉద్యోగులు, కార్మికుల అవస్థలు

పైసల్ యాడికీ పోవులే అన్న నమ్మకంతో అప్పులు తెచ్చి ప్రైవేటు వైద్యం చేయించుకున్న ఈఎస్ఐ కార్డుదారులంతా ఇప్పుడు లబోదిబోమంటున్నరు. రెండు మూడేండ్లైనా రీయింబర్స్‌మెంట్ పైసలు రాక గోస పడుతున్నరు. ఇంకెప్పుడు వస్తయంటూ ఈఎస్ఐ ఆఫీసు చుట్టూ తిరుగుతూ ఆగమైతున్నరు.



- అత్యవసరంగా ప్రైవేటు డాక్టర్ దగ్గరికి వెళితే అంతే..
- రెండు, మూడేళ్లు పడుతున్న బిల్లుల చెల్లింపులు
- చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆవేదన
- కార్పొరేషన్ తీరుపై విమర్శలు

హైదరాబాద్, వెలుగు:

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) కార్డు లబ్ధిదారులకు రెండున్నరేళ్లుగా రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించడం లేదు. ఇలాంటి వారు ఒకరిద్దరు కాదు.. రాష్ట్రంలో 9 వేల మందికిపైనే ఉన్నారు. 2016 మార్చి నుంచి వీరికి పైసలివ్వడం లేదు. జబ్బుతో ఈఎస్ఐ దవాఖానాలో చేరినా అక్కడ వైద్య సదుపాయాలు లేక ఇతర ప్రైవేట్ హాస్పిటల్‌కు మారి చాలామంది చికిత్స పొందారు. ఎలాగూ రీయింబర్స్ మెంట్ వస్తుంది కదా అనే ధీమాతో అప్పు చేసి ట్రీట్‌మెంట్ చేయించుకున్నారు. బిల్లులు రాకపోవడంతో వారంతా దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది ఈఎస్ఐ కార్డుదారులున్నారు. వీరంతా రూ. 25 వేలలోపు వేతన జీవులే. ఈఎస్ఐ పేరుతో వారి జీతం నుంచి నెలకు రూ.200 నుంచి రూ.250 వరకు కట్ చేస్తారు. ఇలా ఈఎస్ఐ సంస్థకు ఏటా కోట్లాది రూపాయలు జమవుతాయి. కానీ రీయింబర్స్‌మెంట్‌కు మాత్రం చిల్లిగవ్వ రాల్చకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మరో రెండేళ్లు దాటుతయ్

దాదాపు మూడేళ్లుగా బిల్లుల కోసం నిరీక్షిస్తున్న వారికి మరో రెండేళ్ల దాకా ఎదురుచూపులు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పుడున్న బిల్లులన్నీ క్లియర్ చేయడానికే దాదాపు రూ.39 కోట్లు అవసరం. ప్రస్తుత లెక్క ప్రకారం మూడు నెలలకోసారి రూ.5 కోట్ల చొప్పున ఇచ్చినా, వచ్చే ఏడాదిలో పూర్తి బకాయిలు తీరే అవకాశం లేదు. వచ్చే ఏడాది చివరినాటికి బకాయిలు కొలిక్కి రానున్నాయి. ప్రస్తుతం రీయింబర్స్‌మెంట్ కోసం మూడేళ్ల నుంచి వచ్చిన అప్లికేషన్లు పరిశీలనలో ఉన్నాయి.

కార్పొరేషన్‌తో కాస్త రిలీఫ్

వాస్తవానికి 2016 మార్చికి ముందు మూడు నెలలకోసారి రూ.కోటి మాత్రమే మంజూరు చేసేవారు. వాటిని 50 మంది లబ్ధిదారులకు చెల్లించేవారు. దాంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఈఎస్ఐ రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులు తగ్గించటం, పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం 2015లో కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ దేవికారాణి చొరవతో ప్రతి మూడు నెలలకు రూ.5 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించేలా నిర్ణయం జరిగింది. ప్రస్తుతం 2016 నుంచి ఉన్న ఈఎస్ఐ రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులను చాలావరకు పరిష్కరించారు. 2016 కు ముందు వరకు ఏటా 6,500కు పైగా దరఖాస్తులు రాగా రెండేళ్లుగా ఈ సంఖ్య 3 వేలకు తగ్గింది. ఈఎస్ఐ బిల్లుల చెల్లింపు పరిమితిని రూ.2 లక్షలకు కుదించారు. అత్యవసరమైతేనే ప్రైవేటు హాస్పిటళ్లకు వెళ్లాలని రోగులకు చెబుతున్నారు.

ఏడాదిన్నర అయినా రాలే..

మా ఆయన ప్రైవేటు ఉద్యోగి. కిడ్నీ పాడవటంతో డయాలసిస్ చేయిస్తున్న. అప్పులు చేసి ప్రైవేట్ హాస్పిటల్‌లో రూ.2 లక్షలకుపైగా ఖర్చు పెట్టినం. రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకొని ఏడాదిన్నర గడిచింది. వడ్డీలు చెల్లించలేకపోతున్నం. ఇప్పటికీ బిల్లులు రాలేదు. మా పరిస్థితేంది?

- శిరీష, బాధితురాలు

త్వరగా చెల్లించేలా చూస్తం

ఈఎస్ఐలో మూడు నెలలకు రూ.5 కోట్లు విడుదలవుతున్నాయి. ఇంకా తొందరగా బిల్లులు చెల్లించేలా చూస్తాం. రీయింబర్స్‌మెంట్ పేరుతో చాలా మంది ఈఎస్ఐ హాస్పిటల్‌ను కాదని ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్తున్నారు. ఇలాంటివి నియంత్రిస్తాం.

- దేవికారాణి, ఈఎస్ఐ కార్పొరేషన్ డైరెక్టర్



రాజకీయాలు కలుషితమయ్యాయి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, వెలుగు: నేటితరం నాయకుల వ్యవహార శైలితో రాజకీయాలు కలుషితమయ్యాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలున్న వ్యక్తి అని కొనియాడారు. నిస్వార్థ సేవలందించి ప్రజల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆదివారం కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌లో మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నారాయణతో పాటు పలువురు సీపీఐ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేస్ట్‌నూ వదలకుండా..

రాకెట్ తుది దశను తిరిగి వాడనున్న ఇస్రో



- పీఎస్ఎల్వీ సీ44తోనే మొదలు
- స్టూడెంట్లు, సైంటిస్టుల చిన్న పరిశోధనల కోసం

శ్రీహరికోట: ఇప్పటికే ఎన్నో మైలురాళ్లు దాటిన ఇస్రో.. మరో అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలాక అంతరిక్షంలో వ్యర్థంగా మిగిలే రాకెట్ తుది దశ పరికరాన్ని మళ్లీ వాడుకునేలా కొత్త ప్రయోగాన్ని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని షార్ కేంద్రం నుంచి ఈ నెల 24న ప్రయోగించే పీఎస్ఎల్వీ సీ44 రాకెట్‌నే ఈ పరీక్షకు వేదికగా చేసుకుంది. రాకెట్ మోసుకెళ్తున్న మైక్రోశాట్ ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక మిగిలే చివరి దశ పరికరం శాటిలైట్ కక్ష్యలోనే 6 నెలలు ఉండేలా సైంటిస్టులు నియంత్రిస్తారు. దాని ద్వారా స్టూడెంట్లు, సైంటిస్టులు చిన్న చిన్న పరిశోధనలు చేసుకునేలా వీలు కల్పిస్తారు.

4 దశల్లో రాకెట్

పీఎస్ఎల్వీ రాకెట్ 4 దశల్లో పని చేస్తుంది. ఒకటి, మూడు దశల్లో ఘన ఇంధనం.. రెండు, నాలుగు దశల్లో ద్రవ ఇంధనం వాడుతారు. రాకెట్ పైకెళ్తున్న కొద్దీ ఒక్కో దశ తన పని పూర్తి చేసుకుని విడిపోతూ ఉంటుంది. మూడో దశ వరకు పరికరాలు విడిపోయి భూ వాతావరణంలోకి వచ్చి దగ్ధమవుతాయి. రాకెట్‌లో కీలకమైన చివరి దశ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చి విడిపోతుంది. ఆ తర్వాత ఆ పరికరం కక్ష్యలోనే తిరుగుతూ శక్తి తగ్గినా కొద్దికొద్దిగా కిందకు జారి చివరకు భూ వాతావరణంలోకి వచ్చి దగ్ధమవుతుంది.

నాలుగో దశలో మార్పు

తాజా ప్రణాళికలో భాగంగా పీఎస్ఎల్వీ సీ44 రాకెట్ నాలుగో దశలో ఇస్రో చిన్న మార్పు చేసింది. విద్యుదుత్పత్తి చేసే ఓ సోలార్ ప్యానల్‌తో పాటు బ్యాటరీలను అందులో అమర్చింది. ఫలితంగా ఉపగ్రహాన్ని విడిచాక కూడా ఈ 4వ దశ పరికరం భూ కేంద్రంతో అనుసంధానమై 6 నెలలు కక్ష్యలోనే ఉంటుంది. ఖగోళ పరిశోధనలు చేసే స్టూడెంట్లతో పాటు సైంటిస్టులు ఈ నాలుగో దశ పరికరంతో రోదసీలోని వాతావరణం, భూ గురుత్వాకర్షణ శక్తిపై ప్రయోగాలు చేసే వీలు కల్పిస్తారు. అమెరికాలోని ప్రైవేట్ స్పేస్ ఏజెన్సీ స్పేస్ ఎక్స్‌కు ప్రస్తుతం ఇలాంటి సాంకేతిక ఉంది.

రగులుతున్న హెచ్‌సీయూ

హైదరాబాద్, వెలుగు:



- వారం కింద ‘వెలివాడ’ నిర్మాణాన్ని తొలగించిన అధికారులు
- ఆందోళనలు చేస్తున్న స్టూడెంట్స్
- వీసీ అప్పారావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హెచ్‌సీయూలో వెలివాడ నిర్మాణాన్ని తొలగించిన ప్రదేశం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) మళ్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. మూడేండ్ల కింద దళిత విద్యార్థులు ఏర్పాటు చేసిన ‘వెలివాడ’ నిర్మాణాన్ని యూనివర్సిటీ అధికారులు తొలగించడంతో వివాదం మొదలైంది. దానిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వర్సిటీలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

రోహిత్ వేముల ఘటనతో..

హెచ్‌సీయూ అధికారులు 2016 జనవరి 4న రోహిత్ వేముల, మరో నలుగురు విద్యార్థులను పలు కారణాలతో వర్సిటీ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. దాంతో విద్యార్థులు వర్సిటీలోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ‘యూ’ ఆకారంలో చిన్న నిర్మాణం (డేరా) ఏర్పాటు చేసి, దాంట్లో మహనీయుల ఫొటోలు పెట్టుకుని నిరసనలకు దిగారు. ఈ క్రమంలో రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోవడం, దేశవ్యాప్తంగా ఆందోళనలు, విద్యార్థుల పోరాటానికి సంఘాలు, రాజకీయ నాయకుల మద్దతు వంటి ఘటనలు జరిగాయి. అప్పటి నుంచి ‘వెలివాడ’ నిర్మాణాన్ని రోహిత్ వేముల గుర్తుగా ఉంచేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రోహిత్ వేముల మూడో వర్ధంతి నిర్వహించేందుకు విద్యార్థులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. నాలుగో తేదీన వెలివాడలో ఉన్న మహనీయుల పాత ఫొటోలను తీసేసి, కొత్తవి పెట్టారు. దీన్ని గమనించిన వర్సిటీ అధికారులు.. అనుమతి లేకుండా గుంతలు తవ్వారని, వెంటనే వెలివాడ నిర్మాణాన్ని తొలగించాలని ఐదో తేదీ సాయంత్రం నోటీసులిచ్చారు. ఒక్కరోజు కూడా గడువు ఇవ్వకుండానే 6న ఉదయమే నిర్మాణాన్ని తొలగించారు. దీంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. విద్యార్థులు, వర్సిటీ అధికారులు పరస్పరం గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే పోలీసులు విద్యార్థుల ఫిర్యాదును పట్టించుకోకుండా.. వర్సిటీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో కొందరు విద్యార్థులపై కేసులు పెట్టారంటూ విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

కోర్టులో ఉండగా ఎలా?

రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనకు సంబంధించి వర్సిటీ వీసీ అప్పారావు, మరికొందరిపై విద్యార్థులు కేసు పెట్టారు. ఆ కేసు న్యాయస్థానంలో విచారణలో ఉంది. రోహిత్ ఆత్మహత్య, అనంతర పరిణామాలకు ‘వెలివాడ’ సాక్ష్యంగా ఉందని, అలాంటప్పుడు దానికి కూల్చివేయడం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలోని నిజ నిర్ధారణ కమిటీ కూడా ఈ ఘటనను పరిశీలించి.. వీసీ అప్పారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల ఆందోళనకు వర్సిటీ ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్లు మద్దతు పలుకుతున్నాయి.

దళితులే వీసీకి టార్గెట్

హెచ్‌సీయూ వీసీ అప్పారావు దళిత విద్యార్థులనే టార్గెట్‌గా పెట్టుకున్నారు. నిత్యం ఏదో రకంగా వేధిస్తున్నారు. రోహిత్ వేముల ఆత్మహత్య విషయంలో వెలివాడ నిర్మాణం సాక్ష్యంగా ఉంది. దాన్ని తొలగించడం చట్టవిరుద్ధం. పోలీసులు వీసీకే మద్దతు తెలుపుతూ విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టారు. దీనిపై జాతీయస్థాయి అధికారులను కలుస్తాం. న్యాయపోరాటం చేస్తాం.

- మున్నా, హెచ్‌సీయూ విద్యార్థి నేత



నేనేమీ దాయట్లేదు

పుతిన్‌తో చర్చలపై ట్రంప్

వాషింగ్టన్: ‘మీరు రష్యా కోసం పని చేస్తున్నారా?’ అంటూ ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్న అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌కు కోపం తెప్పించింది. ట్రంప్ తనకు అమెరికా సీనియర్ ఆఫీసర్లు చేసిన పలు సూచనల్ని రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్‌తో షేర్ చేసుకున్నారంటూ వాషింగ్టన్ పోస్టు రాసిన కథనం ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై స్పష్టత కోసం అమెరికన్ మీడియా ఆదివారం ట్రంప్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. దీంతో చిరాకుపడ్డ ట్రంప్, పుతిన్‌తో తానేం మాట్లాడానో బయటపెడతానంటే, తనకెలాంటి అభ్యంతరం లేదన్నారు. తానేం దాచి పెట్టడం లేదని చెప్పారు. రష్యా కోసం పని చేస్తున్నారా అని ఎలా అడుగుతారని నిలదీశారు. తాను ఇప్పటివరకూ ఎదుర్కొన్న ప్రశ్నల్లో ఇదే అత్యంత అవమానకరమైనదని అన్నారు.



తిరుపతి రైల్వేస్టేషన్‌లో ‘అతిథి’

ప్రీమియం లాంజ్ ఫొటోలు ట్వీట్ చేసిన రైల్వే మంత్రి

తిరుమల, వెలుగు: 'ఇది రైల్వేస్టేషనా లేదా ఫైవ్ స్టార్ హోటలా? తిరుమలకు వచ్చే భక్తుల కోసం తిరుపతి రైల్వేస్టేషన్‌లో సర్ ప్రైజ్ వేచి ఉంది' అని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ట్వీట్ చేశారు. త్వరలో తిరుపతి రైల్వేస్టేషన్‌లో 'అతిథి' ప్రీమియం లాంజ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. 'అతిథి'కి సంబంధించిన ఫొటోలను ఆయన పోస్ట్ చేశారు. సౌకర్యవంతమైన రీక్లయినర్ సీట్లు, లగ్జరీగా ఉండే రెస్ట్ రూములు ఆకట్టుకుంటున్నాయి. త్వరలో ఇదే స్టేషన్‌లో ఓ మల్టీప్లెక్స్ కూడా రానున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు.

సోమవారం | హైదరాబాద్
14.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

కోట్లాదిమంది వచ్చే కుంభమేళా





రేపటి నుంచి మార్చి 4 వరకు | 49 రోజుల పాటు కొనసాగే వేడుక | లైట్ల వెలుగుల్లో త్రివేణీ సంగమం

న్యూఢిల్లీ, ప్రయాగ్‌రాజ్(అలహాబాద్):
అర్ధ కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) సర్వం సిద్ధమైంది. త్రివేణి సంగమ ప్రాంతంలో తాత్కాలిక నగరం వెలిసింది. కరెంట్ దీపాల కాంతుల్లో, గుడారాలు, టెంట్లతో వెలిగిపోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా పేరొందిన కుంభమేళా ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుంది. 49 రోజులపాటు కొనసాగే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశవిదేశాల నుంచి భక్తులు తరలిరానున్నారు. సాధుసన్యాసులు ఇప్పటికే చేరుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు తొలి షాహి స్నానంతో కుంభమేళా ప్రారంభమవుతుంది. తొలిరోజు నాగ సాధువులు, పీఠాధిపతుల తర్వాత భక్తులు స్నానాలు ఆచరిస్తారు. ఈసారి కుంభమేళాలో పాల్గొనే భక్తులకు 'అక్షయ్ వట్', 'సరస్వతి కూప్' వద్ద ప్రార్థనలు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. కుంభమేళ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం. కుంభమేళాకు 12 కోట్ల మంది భక్తులు హాజరవుతారని, తొలి రోజు 30 లక్షల మంది పుణ్యస్నానం చేస్తారని అధికారుల అంచనా. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు కూడా చేశారు. గంగా నది తీరాన్ని మొత్తాన్ని లైట్లతో అలంకరించారు. 3200 హెక్టార్లలో టెంట్లతో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేశారు. రోడ్లు, వీధి దీపాలు, వాటర్ ఏటీఎంలు, ఎకో ఫ్రెండ్లీ టాయిలెట్లు నిర్మించారు. ప్రయాగ్ రాజ్ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నగరంలోని గోడలపై ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు కొలువుదీరాయి. ప్రధాన కూడలిలో పలు విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇక దేశంలోని వివిధ నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్ కు రైల్వే శాఖ, ఎయిర్ లైన్స్ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాయి.

7000 కోట్ల సర్కారీ నిధులు
కుంభమేళా నిర్వహణ కోసం యోగి సర్కారు 7000 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో 3200 హెక్టార్ల విస్తీర్ణంలో 1.22 లక్షల తాత్కాలిక టాయిలెట్లు, 20 వేల డస్ట్‌బిన్లు, 42 డ్రైనేజీ కాలువలను అధికారులు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ప్రత్యేకంగా ఫుడ్ హబ్ ఏర్పాటు చేశారు. ఇందులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆహార పదార్థాలను వేడివేడిగా వండి వడ్డిస్తారు. ప్రయాగ్‌రాజ్ ను అందంగా ముస్తాబు చేయడానికి ఉద్దేశించిన సర్కారీ పథకమే 'పెయింట్ మై సిటీ'. ఈ పథకంతో రోడ్లు, కూడళ్లు, ఫ్లైఓవర్లు, బిల్డింగులు, గోడలు రంగులద్దుకుని మెరిసిపోతున్నాయి. దీనికోసం ఐదు ఏజెన్సీల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యికి పైగా ఆర్టిస్టులు పగలూరాత్రి కష్టపడ్డారు. కుంభమేళా ప్రాశస్త్యాన్ని వివరించేలా ప్రభుత్వం ఓ లేజర్‌షోను ఏర్పాటు చేసింది. సాధువుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో 5 వేల క్యాంపులు ఏర్పాటయ్యాయి. ఫిబ్రవరిలో దాదాపు 192 దేశాల ప్రతినిధులు కుంభమేళాకు హాజరవుతారని అధికారుల అంచనా.

కొత్త ఎయిర్‌రూట్లు
కుంభమేళా సందర్భంగా వివిధ ఎయిర్ లైన్స్ కంపెనీలు పలు కొత్త మార్గాల్లో తమ సర్వీసులను ప్రారంభించాయి. ఎయిర్‌ఇండియా ప్రయాగ్‌రాజ్ ఢిల్లీ, అహ్మదాబాద్ కోల్ కతా మార్గాల్లో సర్వీసులను నడుపుతోంది. ప్రయాగ్ రాజ్ ఢిల్లీ రూట్‌లో ప్రత్యేక విమానాలు నడపనున్నట్లు స్పైస్ జెట్ ప్రకటించింది. కుంభమేళా సందర్భంగా వారణాసి, ప్రయాగ్ రాజ్ మధ్య రాకపోకలను సులభతరం చేసేలా 'ఎయిర్ బోట్' సర్వీసు ప్రవేశపెడుతున్నట్లు యోగి ప్రభుత్వం ప్రకటించింది.

షెడ్యూల్ ఇదే..

జనవరి 15(మంగళవారం) మకర సంక్రాంతి (మొదటి షాహి స్నానం)
జనవరి 21(సోమవారం) పౌష్యపూర్ణిమ
ఫిబ్రవరి 4(సోమవారం) మౌని అమవాస్య (ప్రధాన రాజయోగ స్నానం, రెండో షాహి స్నానం)
ఫిబ్రవరి 10(ఆదివారం) వసంత పంచమి (మూడో షాహి స్నానం)
ఫిబ్రవరి 19(మంగళవారం) మాఘి పూర్ణిమ
మార్చి 4(సోమవారం) మహా శివరాత్రి

ఎప్పుడు? జనవరి 15 నుంచి మార్చి 4 వరకు
ఎక్కడ? అలహాబాద్‌లోని త్రివేణి సంగమం
విశేషం? ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే ఉత్సవం

ఎన్ని రకాలు

పూర్ణ కుంభమేళా: పన్నెండేళ్లకు ఒకసారి
మహా కుంభమేళా: ప్రతీ పన్నెండు కుంభమేళాల తర్వాత (144 ఏళ్లకు ఓసారి)
అర్ధ కుంభమేళా: రెండు కుంభమేళాల మధ్య



వర్చువల్ రియాలిటీ కియోస్క్

మేలా, హారతి, షాహి స్నానం తదితర ముఖ్యఘట్టాల వీడియోలను చూపించేందుకు వర్చువల్ రియాలిటీ కియోస్క్ లనూ ఏర్పాటు చేశారు. ఇందులో ఆయా సన్నివేశాలను త్రీడీలో చూసే అవకాశం ఉంటుంది.



కుంభమేళా కోసం గంగానదిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడారాలు

మేళాలో ఏర్పాట్లు

- 1.20 లక్షల పర్యావరణహిత టాయిలెట్లు
- 50 వాటర్ ఏటీఎంలు, 40 వేల వీధి దీపాలు
- పర్యవేక్షణ, భక్తులకు సేవల కోసం 1500 మంది నియామకం
- 6 వేల మందికి నీడనిచ్చేలా 3 వేల టెంట్లు
- మేళా ఆవరణలో 250 కి.మి.పొడవైన రోడ్లు
- ప్రపంచంలోనే అతి పెద్ద తాత్కాలిక నగరం
- శాంతిభద్రతల కోసం పోలీసు బలగాలతో పాటు 1400 సీసీటీవీ కెమెరాలు

కుంభమేళా.. కొన్ని నిజాలు

- ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్), నాసిక్, హరిద్వార్, ఉజ్జయిని లలో జరిగే కుంభమేళాల్లో అలహాబాద్‌లో జరిగేదే ప్రాచీన కుంభమేళా.
- కుంభమేళాలో నదీ స్నానంతో పాటు ప్రవచనం, కీర్తన, మహా ప్రసాదం తదితర కార్యక్రమాలు కూడా జరుగుతాయి.
- తాత్కాలికంగా వేల మందికి ఉపాధి దొరుకుతుంది.
- కుంభమేళాలో మొట్టమొదటిగా సాధులు, సంతులు, పీఠాధిపతులు చేసే స్నానాన్ని షాహి స్నానం అని పిలుస్తారు. తర్వాత రాజయోగ స్నానం, తర్వాత భక్తుల పుణ్యస్నానం.
- కుంభమేళాలో స్నానం చేస్తే పాపాలన్నీ తొలిగి, ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.
- 'ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యూమానిటీ' పేరుతో కుంభమేళాకు యునెస్కో గుర్తింపు దక్కింది.
- కుంభమేళా కోసం 'రైల్ కుంభ సేవా' పేరుతో రైల్వే ఓ యాప్‌ఆవిష్కరించింది.

కాంగ్రెస్ వల్లే కర్తార్‌పూర్ దక్కలే

ప్రధాని మోడీ కామెంట్స్

న్యూఢిల్లీ:
కాంగ్రెస్‌పై దాడికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ, ఏ వేదికనూ ప్రధాని నరేంద్ర మోడీ వదులుకోవడం లేదు. తాజాగా సిక్కు పదో గురువు గురు గోవింద్ సింగ్ జయంతి రోజున కూడా ఆయన కాంగ్రెస్‌ను టార్గెట్ చేశారు. గురు గోవింద్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆయన స్మారక నాణేన్ని తన అధికార నివాసంలో ఆదివారం మోడీ విడుదల చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ... కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్, 1984 నాటి సిక్కు అల్లర్లను ప్రస్తావించారు. 1984 నాటి సిక్కు అల్లర్ల బాధితులకు ప్రభుత్వం న్యాయం చేసేందుకు కృషిచేస్తోందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హాజరైన ఈ కార్యక్రమంలోనే మోడీ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విశేషం. దేశ విభజన సమయంలో కర్తార్‌పూర్ సాహిబ్‌ను ఇండియాలో కలపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మోడీ ఆరోపించారు. ఈ తప్పిదాన్ని సరిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. కర్తార్‌పూర్ లోని పవిత్ర గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు నేరుగా కర్తార్‌పూర్‌కు రోడ్డు వేసేందుకు కేంద్రం సాయపడుతోందన్నారు. గురుగోవింద్ సింగ్ ధైర్యసాహసాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు.



గురు గోవింద్ సింగ్ స్మారక నాణేన్ని విడుదల చేస్తున్న ప్రధాని మోడీ, మాజీ పీఎం మన్మోహన్ సింగ్

యూపీలో ఒంటరి పోరే

మొత్తం 80 లోక్‌సభ సీట్లకు పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేయాలని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. మొత్తం 80 సెగ్మెంట్లలో పొత్తులేకుండానే వెళ్తామని స్పష్టం చేసింది. కలిసి పోటీచేస్తామని ఎస్పీ, బీఎస్పీలు శనివారం ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆదివారం ఇక్కడ అత్యవసరంగా సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కాంగ్రెస్ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్, యూపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జ్ రాజ్ బబ్బర్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. మీటింగ్ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆజాద్ ..బీజేపీని వ్యతిరేకించే ఏ సెక్యులర్ పార్టీ అయినా తమతో కలిసి వస్తే స్వాగతం పలుకుతామన్నారు. గ్రాండ్ అలయన్స్ లో చోటు దక్కకపోవడాన్ని ప్రస్తావిస్తూ " కూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉండాలని మేము కోరుకున్నాం. అయితే మమ్మల్ని దూరంగా పెట్టాలని ఎవరైనా అనుకుంటే దానికి మేమేం చేయలేం " అని ఆయన అన్నారు. దేశంలోని సెక్యులర్ పార్టీలు అన్నీ ఒక వేదిక మీదకు రావాలని తాము కోరుకుంటున్నట్లు ఆజాద్ చెప్పారు. ఎస్పీ, బీఎస్పీ కూటమిలో లేనందుకు కాంగ్రెస్ కార్యకర్తల్లో ఎలాంటి నిరాశ లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. ప్రజల్లో ఉన్న ఆదరణతోనే ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు.



లక్నోలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ఆజాద్, రాజ్ బబ్బర్

బీజేపీని ఓడించడమే తమ ఏకైక అజెండా అని ఆజాద్ స్పష్టం చేశారు. బరిలో ఎవరున్నా ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉంటుందన్నారు. 2009 లోక్ సభ ఎన్నికల్లో యూపీఏ కూటమి 21 సీట్లు గెలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈసారి దానికి రెట్టింపు సీట్లు గెలుచుకుంటామన్న ధీమా వ్యక్తం చేశారు.

13 ర్యాలీల్లో రాహుల్ గాంధీ
ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఎన్నికలకు కేడర్ ను సన్నద్ధం చేయడానికి రాష్ట్రంలో మొత్తం 13 ర్యాలీలను ఏర్పాటు చేసింది. వీటిలో కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ పాల్గొంటారు. ఫిబ్రవరిలో ఈ ఎన్నికల ర్యాలీలను నిర్వహించాలని పార్టీ భావిస్తోంది. దీని కోసం యూపీని మొత్తం 13 జోన్లు గా విభజించారు. ఒక్కో జోన్ లో ఆరు లోక్ సభ సెగ్మెంట్లు ఉంటాయి. ఒక్కో జోన్ లోని ఒక్కో ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తారు. పశ్చిమ ఉత్తర ప్రదేశ్ నుంచి ర్యాలీలు మొదలవుతాయి. హాపూర్, మొరాదాబాద్, సహరాన్ పూర్ లో తొలి దశ ర్యాలీలు ఉంటాయి.

'వాళ్లను తక్కువ అంచనా వేయొద్దు'

బాలియా (యూపీ) : ఉత్తరప్రదేశ్ లో కొత్తగా ఏర్పడ్డ కూటమితో లోక్ సభ ఎన్నికల్లో తీవ్ర పోటీ తప్పదని బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న 'సుహేల్ దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్బీఎస్పీ) అభిప్రాయపడింది. ఎస్పీ, బీఎస్పీ కూటమిని ఎవరూ తక్కువగా అంచనా వేయొద్దని ఎస్బీఎస్పీ చీఫ్, యూపీ మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్ అన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ప్రత్యర్థుల నుంచి బీజేపీకి గట్టి పోటీ తప్పదన్నారు. దేశవ్యాప్తంగా అనుకూల వాతావరణంఉందన్న భ్రమల నుంచి బీజేపీ బయటపడాలని రాజ్‌భర్ సూచించారు.

మమ్మల్ని తొక్కేసేవాడు ఇంకా పుట్టలే: ఠాక్రే

ముంబై: మిత్రపక్షాలు ఎదురుతిరిగితే అణిచేస్తామంటూ బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా ఈమధ్య చేసిన కామెంట్‌పై శివసేన మండిపడింది. శివసేనను అణచివేసే నాయకుడు ఇంకా పుట్టలేదని ఆ పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ముంబైలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా వ్యవహార శైలి ని దుయ్యబట్టారు. 2014 లోక్ సభ ఎన్నిలకు ముందు అయోధ్యలో గుడి కడతామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్సే గుడికి అడ్డు అంటున్న బీజేపీ దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హనుమంతుడికి కులం ఆపాదించడం సరి కాదన్నారు.

అస్సాంలో ఆగమాగం

గువాహటి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద సిటిజన్‌షిప్ (సవరణ) బిల్లు అస్సాం రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తోంది. ఓ వైపు ఆందోళనలు కొనసాగుతుండగా, మరోవైపు పాలిటిక్స్ కీలక మలుపులు తిరుగుతున్నాయి. బీజేపీ కూటమి నుంచి పార్టీలు వైదొలుగుతుండగా, కొత్త కూటములు ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి బయటికి రావాలని, తాము మద్దతిస్తామని ఏకంగా సీఎం సోనోవాల్‌కు కాంగ్రెస్ ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికలు ఇక్కడ రసవత్తరం కానున్నాయి.

బయటికి రండి మేం మద్దతిస్తాం..
బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిటిజన్‌షిప్ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్డీయే కూటమి నుంచి బయటికి వస్తామని మిత్ర పక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే అసోమ్ గణ పరిషద్ (ఏజీపీ) తన మద్దతు ఉపసంహరించుకుని, కూటమి నుంచి బయటికి వచ్చింది. ఈ క్రమంలో ప్రజలకు మద్దతుగా తన వర్గ ఎమ్మెల్యేలతో కలిసి అస్సాం సీఎం సోనోవాల్.. కాషాయ పార్టీ నుంచి బయటికి రావాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం డిమాండ్ చేసింది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, తాము మద్దతు ఇస్తామని సోనావాల్‌కు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది.

ఇరకాటంలో బీజేపీ
126 సీట్లు ఉన్న అస్సాం అసెంబ్లీలో బీజేపీకి 61 సీట్లు, కూటమి భాగస్వామి బోడో పీపుల్స్ ఫ్రంట్‌కు 12 సీట్లు ఉన్నాయి. ఏజీపీకి 14, కాంగ్రెస్‌కు 25, ఏఐయూడీఎఫ్ పార్టీకి 13 సీట్లు ఉన్నాయి. ఏజీపీ మద్దతు ఉపసంహరణతో ఇరకాటంలో పడ్డ బీజేపీకి, మరో భాగస్వామి బోడో పీపుల్స్ ఫ్రంట్ కూడా బయటికొస్తే పెద్ద ఇబ్బందే. మరోవైపు కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్ పార్టీలతో కలిసి ఏజీపీ కూటమి ఏర్పాడే అవకాశాలపైనా చర్చలు జరుగుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తారా, కూటమిగానా అనే దానిపై ఏజీపీ చీఫ్ అతుల్ బోరా స్పందించలేదు.

- రాజకీయ దుమారం రేపుతున్న సిటిజెన్‌షిప్ బిల్లు
- బీజేపీ నుంచి సీఎం సోనావాల్ బయటికి రావాలి:కాంగ్రెస్



"కాంగ్రెస్ నేత సైకియా ఇచ్చిన ఆఫర్ పూర్తిగా ఒట్టిదే. సోనోవాల్ ఓ మాస్ లీడర్. అస్సాం ప్రజలకు సిటిజన్‌షిప్ బిల్లు మేలు చేస్తుందని ఆయనకు తెలుసు. అధికార వ్యామోహం లేని వ్యక్తి సోనోవాల్. ఆయన బీజేపీని వీడి, కాంగ్రెస్‌లో చేరే అవకాశమే లేదు"
- అస్సాం బీజేపీ చీఫ్ రంజిత్ దాస్

గూండాల కూటమి

ఎస్పీ, బీఎస్పీ పొత్తుపై యోగి

లక్నో: ఎస్పీ, బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పడ్డ కూటమిపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మండిపడ్డారు. 'అదొక గూండాల కూటమి' అని కామెంట్ చేశారు. అయితే ఈ కూటమి వల్ల బీజేపీకి నష్టం కంటే లాభమే ఎక్కువన్నారు. కూటమిని చిత్తుగా ఓడిస్తామన్నారు. పొత్తుకాకుండా రెండు పార్టీలు కలిసిపోతే ఇంకా బావుంటుందని ఎస్పీ, బీఎస్పీలను ఉద్దేశించి ఆదిత్యనాథ్ ఎగతాళి చేశారు. కొత్త కూటమికి ప్రజల్లో ఆదరణ లేదన్నారు. గతంలో రెండు పార్టీలు రాష్ట్రంలో సర్కార్ లను నడిపిన విషయాన్ని గుర్తుచేస్తూ 'అప్పట్లో వారి అరాచకత్వం ఏ స్థాయిలో ఉండేదో ప్రజలు ఇంకా మరచిపోలేదు' అని అన్నారు. మాయావతి సర్కార్, అఖిలేశ్ ప్రభుత్వం రెండూ పాలనను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రధాని పదవికి తన తండ్రి ములాయం పేరును ప్రతిపాదిస్తారా లేక మాయావతి పేరును బలపరుస్తారా అనే విషయమై అఖిలేశ్ యాదవ్ క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూపీలో బీజేపీ సర్కార్ వచ్చాకే అభివృద్ధి జరుగుతోందని ఆదిత్యనాథ్ చెప్పారు.

బీజేపీ సైబర్ వార్ షురూ

లక్నో : యూపీ పరిణామాలపై బీజేపీ సైబర్ వార్ మొదలెట్టింది. అఖిలేశ్, మాయావతి నాయకత్వంలో ఏర్పడ్డ కూటమిపై సోషల్ మీడియా వేదికగా ఎదురుదాడి ప్రారంభించింది. కూటమి ఏర్పడ్డ కొన్ని గంటల్లోనే 56 సెకన్ల నిడివి ఉండే ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతి గతంలో ఒకరిపై మరొకరు చేసుకున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు ఈ వీడియో లో ఉన్నాయి. కేవలం బీజేపీని అధికారం నుంచి దించేయడానికే వేర్వేరు ఐడియాలున్న రెండు పార్టీలు జట్టుకట్టాయని ప్రజలకు వివరించడానికి ' ఠక్ బంధన్ రిటర్న్స్ (మరోసారి బూటకపు పొత్తు) ' పేరుతో బీజేపీ ఈ వీడియోను రూపొందించింది. ఇప్పటికే అనేక వాట్సప్ గ్రూపుల్లో ఈ వీడియో సర్క్యులేట్ అయింది.

సోషల్ మీడియాల్లో యూపీ బీజేపీ ముందంజ
సోషల్ మీడియాల్లో యూపీ బీజేపీ ముందంజలో ఉంది. ఫేస్ బుక్ లో దానికి 34 లక్షల మందికి పైగా ఫాలోయర్లు ఉన్నారు. ట్విట్టర్ లో 10 లక్షల మందికి పైగా ఫాలో అవుతుంటారు. వీటికితోడు బీజేపీ కార్యకర్తలకు 25 వేలకు పైగా వాట్సప్ గ్రూపులున్నాయి. మరికొన్ని నెలల్లో వీటి సంఖ్య ను 50 వేలకు పెంచాలని బీజేపీ భావిస్తోంది. ఈ వాట్సప్ గ్రూపుల సాయంతో కొత్త కూటమిని ఎదుర్కోవాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.



కూటమిని తక్కువగా చూడొద్దు
కూటమిని తక్కువగా చూడకూడదని కొంతమంది బీజేపీ నాయకులు అంతర్గత సమావేశాల్లో అభిప్రాయపడ్డారు. కొన్ని కులాలపై ఆ రెండు పార్టీలకు ఉన్న పట్టు ఎవరూ కాదనలేరని వీరు చెప్పినట్లు తెలిసింది. యోగి ఆదిత్యనాథ్ అమలు చేసిన అభివృద్ధి పథకాలే కుల రాజకీయాలకు చెక్ పెడతాయన్నారు. వీటన్నిటికి తోడు ప్రధాని నరేంద్ర మోడీకి ఉన్న మిస్టర్ క్లీన్ ఇమేజే పార్టీని గెలుపు తీరాలకు చేరుస్తుందని బీజేపీ లీడర్లు భావిస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 42.6 శాతం ఓట్ షేర్ తో బీజేపీ 71 సీట్లను గెలుచుకుంది. ఈసారి 51 శాతం ఓట్ షేర్ తమకు దక్కుతుందని అమిత్ షా ఆశిస్తున్నారు. దీంతో గతం కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటామని స్థానిక బీజేపీ లీడర్లు భావిస్తున్నారు.

చైనా బొగ్గుగనిలో ప్రమాదం

పైకప్పు కూలి 21 మంది మృతి

బీజింగ్: చైనా బొగ్గు గనిలో ఘోర ప్రమాదం జరిగింది. నార్త్‌వెస్ట్ చైనా ప్రాంతంలోని గనిలో పైకప్పు కూలిపోవడంతో 21 మంది కూలీలు చనిపోయినట్టు ప్రభుత్వ మీడియా ఆదివారం ప్రకటించింది. షాంగ్జి ప్రావిన్స్‌లోని లిజియాగావ్ బొగ్గు గనిలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. దీంతో 19 మంది అక్కడికక్కడే చనిపోయారు. మరో 66 మందిని హెలికాప్టర్ సాయంతో బయటకు తీశారు. అయితే రెస్క్యూ టీమ్ మరో రెండు మృత దేహాలను వెలికితీయడంతో చనిపోయినవారి సంఖ్య 21కి చేరింది. ప్రమాదం జరిగిన సమయంలో 87 మంది కూలీలు లోపల పనిచేస్తున్నారు.




ఏడుపాయల వనదుర్గాభవాని మాత ఆలయం



జాతరో.. జాతర

వచ్చే మూడు నెలలు రాష్ట్రమంతటా సందడి

తెలంగాణ సంస్కృతిలో జాతరలకు విశిష్ట స్థానం ఉంది. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రముఖ దేవాలయాల సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా తరతరాలుగా వైభవంగా జాతరలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జాతర్ల సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో వచ్చే మూడు నెలల్లో రాష్ట్రంలో నిర్వహించే ప్రధాన జాతర్లపై 'వెలుగు' ప్రత్యేక కథనం...

ఏడుపాయల

మెదక్, వెలుగు: రంగురంగుల పటాలు... బోనాలు, బండ్ల ఊరేగింపులు... డప్పుల దరువులు... శివసత్తుల సిగాలు... పోతరాజుల ఈరగోళ్ల చప్పుళ్లు... గొల్లసుద్దులు.. జానపద నృత్యాలు... విందులు వినోదాలు... ఇవి ఏడుపాయల జాతర ప్రత్యేకతలు. మెదక్ జిల్లా పాన్నపేట మండల పరిధి నాగ్సాన్‌పల్లి గ్రామ శివార్లలో మంజీరా నది ఒడ్డున వెలసిన వనదుర్గా భవాని మాత ఆలయ సన్నిధిలో ప్రతి ఏటా మహాశివరాత్రికి పెద్దఎత్తున జాతర జరుగుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారు. ఈ ఏడాది మార్చి 4,5,6 తేదీల్లో ఏడుపాయల జాతర జరగనుంది. ఏడుపాయల జాతరను రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ టూరిజం ఫెస్టివల్‌గా నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ప్రభుత్వం ప్రతి ఏటా జాతర నిర్వహణకు రూ.1.50 కోట్లు మంజూరు చేస్తోంది. జాతర ప్రారంభం రోజు ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి లేదా జిల్లా మంత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

భక్తుల కొంగుబంగారం ఐలోని మల్లన్న

వరంగల్ అర్బన్, వెలుగు: వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు (ఐలోని) మల్లన్న జాతర ఆదివారం మొదలైంది. ఈ జాతరకు వివిధ జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. పట్నాలు వేసి, బోనాలు తయారు చేసి స్వామివారికి, అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. 15న బండ్లు తిరుగుట, 17న మహా సంప్రోక్ష సమారాధన నిర్వహిస్తారు. 1968కి ముందు జాతరలో షిడిరథం, కుక్కల కొట్లాట, చల్లకుండలను ఎత్తుట వంటి వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇవి హింసాత్మకమని భావించిన ప్రభుత్వం రద్దు చేసింది.



పుల్లూరు జాతర

సిద్దిపేట, వెలుగు సిద్దిపేట జిల్లా పుల్లూరు గ్రామంలో లక్ష్మీనరసింహ్మాస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. ప్రతి ఏటా మాఘ అమావాస్య నుంచి మూడు రోజుల పాటు పుల్లూరు జాతర జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు జాతరలో భాగంగా మూడు రోజుల పాటు అనేక కార్యక్రమాలను నిర్వహించి చక్రతీర్థం నిర్వహిస్తారు. సిద్దిపేట జిల్లాతో పాటు సమీప జిల్లాల నుంచి లక్ష మంది భక్తులు జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు.

కొమురవెల్లి మల్లన్న



సిద్దిపేట, వెలుగు: 11వ శతాబ్దంలో ఒక ముని ఘోర తపస్సుకు మెచ్చి శివుడు లింగాకారంలో కొమురవెల్లిలో వెలిశాడని, లింగంపై పెరిగిన పుట్టమన్నుతో మూలవిరాట్‌ను రూపొందించి స్వామివారి నాభిలో శివలింగాన్ని ప్రతిష్ఠించారని స్థల పురాణం చెబుతోంది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో స్వామి పశ్చిమాభిముఖంగా ఉండటంతో దీన్ని పడమటి శివాలయంగా భక్తులు పిలుచుకుంటారు. వీరశైవ ఆగమ, యాదవ సంప్రదాయం ప్రకారం కొమురవెల్లి మల్లన్న పూజలను అందుకుంటాడు. ప్రతియేటా సంక్రాంతి తరువాత వచ్చే మొదటి ఆదివారం నుంచి ఈ జాతర ప్రారంభమై పాల్గుణ మాసం చివరి ఆదివారం వరకు మూడు మాసాలపాటు జరుగుతుంది. సంక్రాంతి తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నం వారంగా పిలుస్తారు. రెండో రోజు సోమవారం పట్నం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రెండో ఆదివారాన్ని లష్కర్ వారంగా పిలుస్తారు. జాతరకు దాదాపు పది లక్షల మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి రోజున ఒగ్గుపూజారులు పెద్ద పట్నం, చివరి ఆదివారం అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఉమామహేశ్వరం

అచ్చంపేట, వెలుగు : దట్టమైన నల్లమల అభయారణ్యంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఉమామహేశ్వర క్షేత్రంలో మకర సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏడాదికోసారి నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీశైల ఉత్తర ద్వారంగా ప్రసిద్ధిచెందిన ఉమామహేశ్వర క్షేత్రానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. మహబూబ్‌నగర్ శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారిలో అచ్చంపేట తర్వాత రంగాపూర్ గ్రామం ఉంటుంది. అక్కడ నుంచి ఉమామహేశ్వర క్షేత్రానికి వెళ్లాలి. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలానికి వెళ్లే భక్తులందరూ ఉమామహేశ్వరం దర్శించుకుని వెళ్తుంటారు. ప్రతి ఏటా మకర సంక్రాంతి రోజు ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతుంటారు.



పెద్ద గట్టు జాతర

సూర్యాపేట, వెలుగు : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్ పల్లిలో యాదవుల కులదైవమైన లింగమంతుల స్వామి కొలువు దీరారు. రెండేండ్లకు ఒకసారి జరిగే ఈ జాతర ఐదురోజుల పాటు నడుస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 24 నుంచి నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయం తీసుకుంది. సుమారు 15 లక్షలకు పైగా భక్తులు ఈ జాతరకు వస్తుంటారు.

సింగరాయ జాతర

సిద్దిపేట, వెలుగు: కోహెడ మండలం కూరెల్లలోని లక్ష్మీనరసింహస్వామి జాతర మాఘఅమావాస్య ఒక రోజే (ఫిబ్రవరి 4న) జరుగుతుంది. లక్షకు పైగా భక్తులు వస్తారు.

- దుబ్బాక మండలం కూడవెల్లి వాగు పక్కన ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి జాతర మాఘ అమావాస్య నుంచి మూడు రోజుల పాటు (ఫిబ్రవరి 4 నుంచి) జరుగుతుంది. లక్షకు పైగా భక్తులు హాజరవుతారు.

కోరమీసాల స్వామి.. కొత్తకొండ వీరన్న

ఎల్కతుర్తి, వెలుగు : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని వీరభద్రస్వామి దేవాలయం ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి. మకర సంక్రాంతి పండుగకు జరిగే జాతరల్లో అతిపెద్దది కొత్తకొండ జాతర. భక్తులు భోగి రోజున మొక్కులు చెల్లించి, సంక్రాంతి రోజున తెల్లవారుజామున ఉత్తరాయణ పుణ్యకాలంలో భారీ సంఖ్యలో కోర మీసాల వీరభద్రస్వామి వారిని దర్శించుకుంటారు. సంక్రాంతి రోజున వందలాది ఎడ్లబండ్లలో భక్తులు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. జాతర ముగింపు రోజున అగ్నిగుండాలు నిర్వహిస్తుంటారు. ఈ జాతర ఈ నెల 10వ తేదీన స్వామివారి కల్యాణోత్సవంతో ప్రారంభమైంది. 18వ తేదీన అగ్నిగుండాలు, స్వామివారికి అన్నాభిషేకం, సాయంత్రం స్వామివారి గ్రామ పర్యటనతో జాతర ముగుస్తుంది. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వచ్చి మొక్కులు సమర్పిస్తారు.

రెండోరోజు బాగా ఆడిండ్రు

సిద్దిపేట, వెలుగు: సిద్దిపేట డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్ 17 బాలబాలికల జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజు ఆదివారం మొత్తం 20 మ్యాచ్‌లు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్, నవోదయ విద్యా సమితి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను సిద్దిపేట పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ ప్రారంభించి ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. రెండోరోజు పోటీల్లో 40 జట్ల మధ్య 20 పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో గోవాపై హర్యానా జట్టు, ఎన్‌వీఎస్‌పై రాజస్థాన్, కర్నాటకపై మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌పై జమ్మూకాశ్మీర్, తమిళనాడుపై పాండిచ్చేరి, పశ్చిమ బెంగాల్‌పై ఒడిశా, సీబీఎస్‌డబ్ల్యూ జట్టుపై జార్ఖండ్, చండీఘడ్‌పై పంజాబ్, కర్నాటకపై గుజరాత్, ఐపీఎస్ఎస్ జట్టుపై మధ్యప్రదేశ్, గోవాపై చండీఘడ్, బీహార్‌పై కేరళ జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌పై మహారాష్ట్ర జట్టు, గోవాపై బీహార్, ఉత్తరాఖండ్‌పై కర్నాటక, జమ్మూకాశ్మీర్‌పై ఒడిశా, త్రిపురపై రాజస్థాన్, ఎన్‌వీఎస్‌పై వెస్ట్ బెంగాల్ జట్టు విజయం సాధించాయి. ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు సాగాయి. ఆటలాడేటప్పుడు త్రిపుర, మణిపూర్ క్రీడాకారులకు గాయమవగా వారికి ట్రీట్‌మెంట్ చేసి దవాఖానాకి తరలించారు. ఆదివారం జరిగిన క్రీడలను అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, రాష్ట్ర పరిశీలకులు జగన్మోహన్‌గౌడ్, ఎస్‌జీఎఫ్ పరిశీలకులు వికేష్ కొశ్వ తిలకించారు. సెలవు దినం కావడంతో ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి పోటీలను చూశారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు




అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కృప

సర్పంచ్ అభ్యర్థిగా హిజ్రా నామినేషన్

పాలకుర్తి, వెలుగు: నియోజక వర్గంలోని కొడకండ్ల మండలం జీ.కే తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తండాకు చెందిన థర్డ్ జెండర్ (హిజ్రా) గుగులోతు కృప ఆది వారం నామినేషన్‌ను దాఖలు చేశారు. తండాలోని గుగులోతు సాలమ్మ, సీతా రాం సంతానమైన కృప 2008లో ఇంటర్ మీడియట్ కొడకండ్లలో పూర్తి చేసింది. 2010 లో బతుకుదెరువు కోసం ఢిల్లీకి వెళ్లింది. కొంతకాలం తర్వాత వరంగల్‌కు వచ్చి స్థిర పడ్డారు. తండాలు నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కావడంతో పుట్టిన ఊరికి సేవ చేయాలని సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు కృప తెలిపారు.



బరిలో ముసలవ్వ..

కాటారం, వెలుగు : ఓ అరవై ఎనిమిదేళ్ల ముసలవ్వ సర్పంచ్ పదవీ కోసం నామినేషన్ వేసింది. మహాముత్తారం మండలం మాదారం గ్రామానికి చెందిన బచ్చల పోశక్క అనే వృద్ధురాలు ఆదివారం జనరల్ కేటగిరిలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. పోశక్కను మీడియా మాట్లాడించేందుకు ప్రయత్నించగా చెవులు వినబడవు అని చెప్పడం కొసమెరుపు.



విజేతగా నిలిచిన వరంగల్ జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న వివేక్ వెంకటస్వామి తదితరులు

ప్రోత్సహిస్తే సత్తా చాటుతరు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్ వెంకటస్వామి
- ముగిసిన అండర్ 14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

మంచిర్యాల, వెలుగు: క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తే వారి ప్రతిభ వెలుగులోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు రైల్వే, ఇండియన్ ఎయిర్‌లైన్స్ వంటి సంస్థల్లో ఉద్యోగావకాశాలుంటాయన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో అనేక టోర్నమెంట్లు నిర్వహించామన్నారు. గత ఏడాది కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ పోటీలు నిర్వహించినప్పుడు కోటి 25లక్షల మంది క్రీడాభిమానులు వీక్షించారని వివరించారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి అండర్ 14 వాలీబాల్ ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో హైదరాబాద్ ప్రథమ, వరంగల్ ద్వితీయ స్థానంలో నిలవగా.. బాలికల విభాగంలో వరంగల్ ప్రథమ, నల్గొండ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి.

ఎన్నికల ఏర్పాట్లు బాగున్నాయ్

సూర్యాపేట, వెలుగు: జిల్లాలో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు బాగున్నాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ గెస్ట్‌హౌజ్‌లో జిల్లా జనరల్ అబ్జర్వర్ టి.చిరంజీవులు, కలెక్టర్ డి.అమయ్ కుమార్, ఎస్పీ ఆర్.వెంకటేశ్వర్లుతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత అధికారులదేనన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కొన్ని పంచాయతీల్లో కౌంటింగ్ పూర్తయ్యే వరకు రాత్రి అయ్యే అవకాశం ఉన్నందున లైటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ఉండి, ప్రతి పైసాను శాడో రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. సూర్యాపేటలో అధికారులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు సరిగ్గా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ఖర్చు చేస్తే ఎన్నికను రద్దు చేయడంతో పాటు, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఏకగ్రీవాలకోసం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే ఆ ఎన్నికను రద్దు చేయడమే కాకుండా పోలీస్ కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం చివ్వెంల మండల కేంద్రంలో పోలింగ్ అధికారుల రెండో విడత శిక్షణ శిబిరాన్ని సందర్శించారు.



ఇటుక బట్టీల్లో ఛత్తీస్‌గఢ్ అధికారుల తనిఖీ

యాదాద్రి, వెలుగు: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు శివారులోని ఇటుక బట్టీల్లో ఆదివారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ రాష్ట్రంలోని గరీమాబాద్, మైనాపూర్, ఇందాగామ్ గ్రామాలకు చెందిన పలువురు ఇక్కడి ఇటుక బట్టీల్లో నిర్బంధంగా పనులు చేస్తున్నారని ఇందాగామ్ సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మైనాపూర్ తహసీల్దార్ పీడీ లక్రాతో పాటు పలువురు అధికారులు ఇక్కడికి వచ్చారు. స్థానిక అధికారులు హరిశ్చంద్రారెడ్డి, సైదాసాహెబ్, ఆదిత్య, ఎస్ఐ సాయిలుతో కలిసి కలిసి తనిఖీలు చేశారు. దీంతో 32 మంది కార్మికులు ఇక్కడ ఉండలేమని, తమను స్వగ్రామాలకు పంపించాలని అధికారులను కోరారు. అధికారులు వీరి వివరాలను సేకరించి, వారిని గ్రామాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

టోల్ కట్టి వెళ్లుండ్రి

మహబూబ్‌నగర్, వెలుగు: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేవారికి ట్రాఫిక్ ఇబ్బందులుండొద్దని టోల్‌గేట్ల వద్ద వసూళ్లను ప్రభుత్వం నిలిపివేసింది. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని టోల్‌గేట్లలో వసూళ్లు చేశారు. ప్రభుత్వం రద్దు చేసిందని ప్రయాణికులు అడిగితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలందలేదని సమాధానమిస్తున్నారు. మహబూబ్‌నగర్ జేసీ వెంకట్రావ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలను టోల్ ప్లాజాలకు పంపారు. అయినా వసూళ్లు ఆపకపోవడంతో పోలీసులను, రెవెన్యూ సిబ్బందిని టోల్‌ప్లాజాలకు పంపించారు. హైదరాబాద్ నుంచి వస్తున్న వాహనాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చి, హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలకు చార్జీలు వేశారు.



రైల్వే లైన్ కోసం..

భద్రాచలం, వెలుగు : భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న సారపాక వరకు రైల్వే లైన్ పొడిగించాలని కోరుతూ అంతర్జాతీ య గాంధీపథం ఆధ్వర్యంలో ఆదివారం సంతకాలు సేకరించారు. భద్రాచలం పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రైల్వే లైన్‌కోసం ఏళ్ల తరబడి కోరుతున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని గాంధీపథం కన్వీనర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం-మణుగూరు రైలు మార్గంలో పాండురంగాపురం రైల్వే స్టేషన్‌నుంచి 12 కిలోమీటర్ల లైన్‌వేస్తే సారపాక వరకు రైలు వస్తుందని ఆయన అన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నపుడు కేంద్రం పాండురంగాపురం వరకు రైలును తీసుకొచ్చిందని గుర్తు చేశారు. తర్వాత ప్రతీ ఏటా రైల్వే బడ్జెట్ సమయంలో పాండురంగాపురం-సారపాక రైల్వే లైన్‌కోసం ఈ ప్రాంత వాసులు నిరీక్షిస్తున్నారని, వారిని కేంద్రం నిరాశ పరుస్తోందని అన్నారు. ఈసారి ఎలాగైనా రైల్వే లైన్‌మంజూరు చేసి బడ్జెట్‌కేటాయించాలని కోరారు. సంతకాల సేకరణ పూర్తయ్యాక ప్రధాని మోడీకి పంపుతామని ఆయన తెలిపారు.



గంగిరెద్దుల విన్యాసాలు (ఫైల్)



హరిదాసు (ఫైల్)

పండుగొచ్చింది.. వాళ్లే రాలె!

కానరాని హరిదాసులు | బయటికి రాని బసవన్నలు | పండుగలో పాత 'ధనం' మాయం

ప్రతీ సంక్రాంతి పండుగకు ముందే తప్పకుండా వచ్చే వాళ్లు.. ఈ సారి పండుగొచ్చింది.. ఎందుకో వాళ్లు రాలేదు.. వాళ్లొస్తే ఆ సందడే వేరుండేది.. ఊరికే కళ వచ్చేది.. నిజంగా చెప్పాలంటే పండుగ పండుగ లెక్క ఉండేది. వాళ్లు లేకపోయేసరికి పండుగ కళ తప్పినట్లయితంది.. హరిదాసులు, గంగిరెద్దుల వారితోనే సంక్రాంతికి శోభ.. హరిదాసు, గంగిరెద్దుల వారి కొత్త జనరేషన్ ఆ వృత్తికి దూరమై ప్రపంచంతో పోటీ పడుతుండడం ఆనందించదగినదే అయినా.. పండుగకు ఆ సందడి తగ్గడం ఓ వెలితే.

ఖమ్మం, వెలుగు:

పిల్లలకు సెలవులు, పతంగుల అమ్మకాలతో సంక్రాంతి పండుగ సందడి ప్రారంభమైంది. గతంలో హరిదాసులు పండుగకు వారం, పది రోజుల ముందు నుంచే కీర్తనలు పాడుకుంటూ భిక్షాటన చేసేవారు. సంక్రాంతికి ముందే పొలం నుంచి ధాన్యం ఇంటికి చేరేవి. భిక్షాటనకు వచ్చే హరిదాసులకు, గంగిరెద్దులను ఆడించే వారికి ధాన్యం, బియ్యాన్ని భిక్షగా పెట్టేవారు. కానీ ఇప్పుడు రూపాయో, రెండు రూపాయలో చిల్లర వేస్తున్నారు తప్ప, బియ్యం గానీ, ధాన్యం గానీ వేయడం లేదు. ఇప్పుడు ఆదాయం అంతంత మాత్రమే కావడంతో గతం నుంచి హరిదాసులుగా ఉన్న వారు తప్ప, కొత్తగా ఆ కుటుంబాల్లోని యువకులు ఎవరూ హరిదాసులుగా మారడం లేదు. చదువుకొని ఉద్యోగాలు చేయడమో, లేదంటే కూలికి వెళ్లడమో చేస్తున్నారు తప్ప హరిదాసుల వారసత్వ వృత్తిని ఎంచుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు.

హరిదాసుల్లో కుంకుమ దాసులు, మాల దాసులు, మాదిగ దాసులు, తెలగ దాసులు, తడిక దాసులు, సాతాణి వైష్ణవ దాసులు.. ఇలా చాలా వర్గాలవారున్నారు. తులసి మాలలు వేసుకొని తెల్లవారు జామునే కౌశిక రాగంతో కీర్తనలు ఆలపిస్తూ, పల్లెలను మేల్కొలుపుతూ భిక్షాటన చేస్తుంటారు. సంక్రాంతి పండుగకు నెల రోజుల ముందే ధనుర్మాస దీక్షను హరిదాసులు స్వీకరిస్తారు. హరినామ స్మరణ చేస్తూ పీఠం ఏర్పాటు చేసుకొని పూజలు చేస్తారు. ఇంట్లోని పెరట్లో పూల మొక్కలు పెంచుకొని ఆ మొక్కల నుంచి వచ్చిన పూలనే దండగా వేసుకొని భిక్షాటన చేస్తారు. తిరిగి ఇంటికి చేరిన తర్వాత ఇంట్లోని మహిళలు పాద ప్రక్షాళన చేసి హరిదాసుల నెత్తి మీద ఉండే కళశంలో ఉన్న వడ్లు, బియ్యాన్ని తీసుకొని పీఠం దగ్గర పెడతారు. వాటినే తర్వాత వండుకొని తింటారు.

వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి చెందిన కొన్ని హరిదాసుల కుటుంబాలు చాలా ఏళ్ల క్రితమే సత్తుపల్లి రాజీవ్ నగర్ లో స్థిరపడ్డారు. అక్కడే దాదాపు



ప్రస్తుతం 20 కుటుంబాలు జీవిస్తున్నాయి. పెనుబల్లి మండలం లంకపల్లిలో మరో 20 కుటుంబాలు, అశ్వారావుపేటలో మరికొన్ని కుటుంబాలున్నాయి. వీరందరి కుటుంబాల్లో పెద్ద వాళ్లు, వృద్ధులు తప్ప యువకులు ఎవరూ హరిదాసులుగా మారడం లేదు. గంగిరెద్దుల వారిదీ అదే పరిస్థితి.

ఫుడ్, కైట్ ఫెస్టివల్‌ప్రారంభించిన మేయర్

ఖమ్మంటౌన్ : అవనిపై హరివిల్లు విరిసింది.. గగనతలంపై పతంగులు గంతులేశాయి.. ఘుమఘుమలాడే వంటకాలు నోరూరించాయి.. రాక్ క్లైంబింగ్ విన్యాసాలు అదరగొట్టాయి.. ఈ దృశ్యాలన్నీ ఖమ్మంలోని టకారం ట్యాంక్‌బండ్ పై ఆదివారం కనిపించాయి. సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఇక్కడ ఫుడ్, కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. ముగ్గుల పోటీలు, రాక్ క్లైంబింగ్ ఆకట్టుకున్నాయి. జిల్లా యంత్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంబురాల్లో అన్ని వయసుల వారు పాల్గొన్నారు. సంక్రాంతి ఉత్సవాలు లకారం ట్యాంక్ బండపై ఘనంగా ప్రారంభమయ్యాయి. నోరురూంచే వంట లతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. అనంతర ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వీటితో పాటు గంగిరెద్దుల విన్యాసాలతో కోలాహలం నెలకొంది. ప్రజల కోసం ట్యాంక్ బండ్‌లో అధికారులు బోటింగ్ ఏర్పాటు చేశారు. ఆటపా ట నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ పాపాలాల్, మున్సిపల్ కమిషనర్ జే శ్రీనివాసరావు, పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, కార్పొరేటర్లు , తదితరులు పాల్గొన్నారు.

అప్పటి లెక్క లేదు

గతంలో ఐదు కళశాలు ఒకదానిపై ఒకటి తలపై పెట్టుకొని భిక్షాటనకు వెళ్లేవాళ్లం. చాకలి, కుమ్మరి, మంగళి వారు బ్యాండు మేలం, సన్నాయిలతో మా వెనుక కావిడిలతో తిరిగేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ధాన్యం గానీ, బియ్యం గానీ రావడం లేదు. అంతో ఇంతో చిల్లర డబ్బులు మాత్రమే వస్తున్నాయి. గతంలో చాలా దేవాలయాల్లో హరిదాసులే అర్చకత్వం చేసేవారు. పశ్చిమగోదావరి జిల్లా ఉప్పునూరులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఇప్పటికీ అలా అర్చకత్వం కొనసాగుతోంది.

చప్పిడి వెంకటరమణ, సత్తుపల్లి

ఆదాయం అంతంతమాత్రమే

మా పెద్దల కాలం నుంచి గంగిరెద్దులు ఆడిస్తూనే బతుకుతున్నాం. పండుగలప్పుడు, ఎవరైనా చనిపోయినప్పుడు కర్మల సమయంలో గంగిరెద్దులు ఆడిస్తుంటాం. అంతో ఇంతో భూమి సంపాదించుకున్నాం. ఇతర ఆదాయం లేని సమయంలో భూమిలో పంటలు పండించుకుంటున్నాం. గంగిరెద్దులను ఆడించినా ఆదాయం అంతంతమాత్రమే వస్తోంది.

మాదాసు కృష్ణ, లింగగూడెం



టకారం ట్యాంక్‌బండ్‌పై ఫుడ్‌స్టాల్స్



పతంగులు ఎగురవేస్తున్న ఖమ్మం మేయర్, తదితరులు



ఖిల్లా ఎక్కుతున్న శ్రీనిధి

ఫిబ్రవరిలో ఫిజికల్ ఈవెంట్స్

కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు నిర్వహణ ■ ఏర్పాట్లు చేస్తున్న పీఆర్‌బీ

హైదరాబాద్, వెలుగు:

- మారనున్న ఎస్సై మెరిట్ జాబితా
- మరో 12 వేల మందికి లిస్టులో చోటు
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే నియామకాలు పూర్తి?

రాష్ట్రంలో 16,925 కానిస్టేబుల్, 1,217 ఎస్సై పోస్టుల భర్తీకి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు గతేడాది మే 31న నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు నెలల కిందటే తొలిదశ పరీక్షలు పూర్తయ్యాయి. డిసెంబర్‌లోనే ఫిజికల్ టెస్టులు జరగాల్సి ఉంది. కానీ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఫిబ్రవరిలో రెండో వారంలో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నా, అందులోనూ స్పష్టత లేదు.

లోక్‌సభ ఎన్నికలు అయ్యాకే..?

కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు ఫిబ్రవరి రెండో వారం లేదా మూడో వారంలో ఫిజికల్ టెస్టులు నిర్వహించేందుకు పోలీసు నియామక మండలి ఏర్పాట్లు చేస్తోంది. ఆ ప్రకారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే లోపే ఫిజికల్ ఈవెంట్స్ పూర్తి చేయాలి. కానీ ఈవెంట్స్ కు కనీసం 40 రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. ఆ మేరకు ఏప్రిల్ చివరి నాటికి ఈవెంట్స్ పూర్తయితే తుది పరీక్షలు నిర్వహించే లోపే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో లోక్‌సభ ఎన్నికలు అయ్యాకే పోలీసు నియామకాలు పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

3 నెలల కిందటే ప్రాథమిక పరీక్ష

ప్రాథమిక పరీక్ష ఫలితాలు ప్రకటించి 3 నెలలైంది. ఫిజికల్ టెస్టుల ప్రక్రియ మాత్రం మొదలుకాలేదు. ప్రాథమిక పరీక్ష ఫలితాలను సకాలంలోనే వెల్లడించిన పోలీసు శాఖ, ఫిజికల్ పరీక్షలను డిసెంబరులో నిర్వహించేందుకు తేదీలను కూడా ప్రకటించింది. అయితే కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఎస్సై ప్రాథమిక పరీక్ష పేపర్‌లో ఇచ్చిన ప్రశ్నలపై సందేహాలున్నాయంటూ పిటిషన్ వేయడంతో ఫలితాలపై కోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. అస్పష్టంగా ఉన్న 6 ప్రశ్నలను తొలగించి తిరిగి ఫిజికల్ పరీక్షలకు మెరిట్ జాబితా తయారు చేయాలని తాజాగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో దాదాపుగా మరో 12 వేల మంది అభ్యర్థులు మెరిట్ జాబితాలో చేరనున్నారు.

కోచింగ్ ఖర్చులు మోపెడు

కోచింగ్ కోసం వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, నల్లకుంట, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, రాంనగర్, యూసఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో ఉంటున్న యువకుల పరిస్థితి దారుణంగా ఉంది. ఇటు రూమ్ అద్దె, అటు కోచింగ్ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. కోచింగ్ సెంటర్లలో సిలబస్ కూడా ఇప్పటికే పూర్తయింది. రివిజన్ పేరిట నామినల్ ఫీజులు వసూలు చేస్తూ కోచింగ్ సెంటర్లు క్లాసులు కంటిన్యూ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇంకా ఎన్నాళ్లు పడుతుందో తెలియక అభ్యర్థులు తంటాలు పడుతున్నారు.

మూడు వారాలు

ఇప్పటికే ప్రకటించిన ఎస్సై మెరిట్ జాబితాలో హైకోర్టు ఆదేశాల మేరకు సవరణ చేయాల్సి ఉంటుందని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారి ఒకరు చెప్పారు. ఫిజికల్ టెస్ట్ లకు కొత్త జాబితా తయారు చేయాల్సి ఉందని, దానికి ఎంతలేదన్నా రెండు, మూడు వారాల టైం పడుతుందని చెప్పారు. అధికారుల ఆమోదానికి మరో 10 రోజులు సమయం అవసరం అవుతుందన్నారు.



అమ్మొద్దంటె సరిపోతదా?

వెలుగు నెట్‌వర్క్ :



- ప్రకటనలకే పరిమితమైన ఆఫీసర్లు
- జోరుగా చైనా మాంజా అమ్మకాలు

'చైనా మాంజాను నిషేధించాం. దాని కారణంగా పక్షుల ప్రాణాలకు హాని కలుగుతోంది. అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం'. ఇవన్నీ అటవీ శాఖ ప్రకటనలు. ఆ ఆఫీసర్ల మాటలు నీటి మూటలయ్యాయి. చైనా మంజా అమ్మకాలపై దాడులు తూతూ మంత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంతో పాటు ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, టేకులపల్లి ప్రాంతాల్లో జోరుగా చైనా మాంజా అమ్మకాలు సాగుతున్నాయి. చైనా మాంజాతో లాభాలు ఎక్కువగా వస్తుండడంతో చిరువ్యాపారులు అమ్మకాలు చేపడుతున్నారు. టాంగూస్‌తో కూడిన చైనా మాంజాతో ప్రధానంగా పక్షుల ప్రాణాలకు హాని జరుగుతుందని ప్రభుత్వం దీన్ని నిషేధించింది. ఆఫీసర్ల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. సంక్రాంతి పండుగ వచ్చిందంటే వారం రోజుల ముందు నుంచే సోడా సీసా, సున్నం, కలబంద, గుడ్లు, రంగులు, అన్నంతో పాటు పలు రకాల పదార్థాలతో యువకులు, పెద్దలు పెద్ద ఎత్తున మాంజాలు తయారు చేసేవారు. ఇప్పుడంతా టాంగూస్‌తో కూడిన చైనా మాంజాకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. బిల్డింగ్‌లు, బ్రిడ్జిలపై నుంచి పతంగులను ఎగరేసేటపుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలుస్తాయి. జిల్లాలోని ఇల్లెందు సబ్‌జైల్ బస్తీలో గతేడాది కైట్ ఎగరేస్తూ బిల్డింగ్ పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇదే పట్టణంలోని నెంబర్ 2 బస్తీ, కాకతీయనగర్ ప్రాంతాల్లోనూ భవనాల పైనుంచి పడి యువకులు, పిల్లలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలున్నాయి. తెగిన గాలి పటాన్ని పట్టుకునేందుకు ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా చూడకుండా రోడ్డుపై పరుగెత్తుతుండడంతో ప్రమాదాలు తప్పడం లేదు. ఇక చైనా మాంజాను సరిగా ఉపయోగించటం రాకపోతే చేతి వేళ్లు తెగే అవకాశం ఉంది.



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్

ఇట్లయితే ఎట్లా?

- పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం తగదు
- అధికారులపై నిజామాబాద్ కలెక్టర్ ఫైర్

నిజామాబాద్, వెలుగు: 'గ్రామాల్లో అపరిశుభ్రత ఇలా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఎలా ఉంటారు? వ్యాధులు ప్రబలి రోగాల బారిన పడితే బాధ్యులెవరు?' అని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఎం.రామ్మోహన్ రావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండలం రాజరాజేశ్వర్ నగర్‌లో ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పరిశీలించేందుకు ఆయన వచ్చారు. కానీ మార్గమధ్యలో లింబాద్రి గుట్ట పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉండటాన్ని చూసిన కలెక్టర్ తన వాహనాన్ని ఆపారు. అపరిశుభ్రతను ఎంపీడీఓ లింగంకు చూపించారు. లింబాద్రి గుట్ట మున్సిపల్ పరిధిలోకి వస్తుందనడంతో అక్కడే ఉన్న ఎమార్వో తారాసింగ్‌ను సత్వరమే ఇక్కడంతా శుభ్రం చేయించాలని ఆదేశించారు. 'భక్తులు విశేషంగా వచ్చిపోయే పుణ్యక్షేత్రం ఇంత అపరిశుభ్రంగా ఉంటే ఎలా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతా శుభ్రం చేయించి ఫొటోలు తీసి తనకు పంపించాలని వారిని ఆదేశించారు. ఈ నెల 21న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న ఆర్మూర్ డివిజన్‌లో ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పీఓ, ఏపీఓల శిక్షణపై అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం భీమ్‌గల్ మండలం రహత్ నగర్ ప్రాథమిక పాఠశాలలో పర్యటించారు. ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కమ్మర్‌పల్లిలోని నర్సరీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎన్ని రకాల మొక్కలున్నాయి? నిర్వహణ ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ, ఉపాధి హామీ పట్టేదారు పాస్ పుస్తకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట భీమ్‌గల్, కమ్మర్‌పల్లి ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, లింగంతోపాటు ఆయా కార్యదర్శులున్నారు.

ఒక ఫ్యామిలీ.. ముగ్గురు సర్పంచులు



చెన్నంనేనిపల్లి గ్రామం


దేవరకొండ, వెలుగు :

- అందరూ ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు
- 27 ఏళ్ల కింద తండ్రి, పోయినసారి కోడలు
- ఈ ఎన్నికల్లో కొడుకుకు పట్టం
- చెన్నంనేనిపల్లిలో రికార్డు

ఒకే పంచాయతీ. 27 ఏళ్ళ క్రితం తండ్రి, ఇప్పుడు కొడుకు, 2014లో కోడలు ముగ్గురూ సర్పంచులు అయ్యారు. అదీ ఏకగ్రీవంగా గెలవడం ఒక రికార్డే. ఇదీ నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చెన్నంనేనిపల్లి గ్రామం ఘనత. ఈ పంచాయతీ ఏర్పడిన తర్వాత ఆరుసార్లు ఎన్నికలు జరగగా నాలుగు సార్లు ఏకగ్రీవమయ్యింది. ఇందులో ముగ్గురు ఒకే ఫ్యామిలీకి చెందిన వారు కావడం విశేషం. ఊర్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకున్న ఘనత కూడా ఈ పంచాయతీకి దక్కింది.

తండ్రి.. కోడలు.. కొడుకు

చెన్నంనేనిపల్లి 27 ఏళ్ళ కింద ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. అంతకు ముందు ఇది పెద్ద అడిశర్లపల్లి మండలం పేర్వాల పంచాయతీ పరిధిలో ఉంది. మొదటిసారి మైనంపాటి నర్సింహారెడ్డిని గ్రామస్తులు సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత రెండు సార్లు ఎన్నికలు జరిగాయి. 2008లో ఎస్సీ మహిళకు సర్పంచు పదవి రిజర్వ్ కాగా, మద్దిమడుగు నీలమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2014లో జనరల్ మహిళకు రిజర్వుడ్ కావడంతో నర్సింహారెడ్డి కుమారుడు వెంకట్‌రెడ్డి భార్య శాంతారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసారి జనరల్ కావడంతో నర్సింహారెడ్డి కుమారుడు వెంకట్‌రెడ్డి బరిలోకి దిగారు. గ్రామస్తులు అతన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆదర్శగ్రామంగా నిలబెడతా

గ్రామస్తులు మా కుటుంబం మీద ఉంచిన నమ్మకం నా బాధ్యతను పెంచింది. జిల్లాలోనే చెన్నంనేనిపల్లిని ఆదర్శగ్రామంగా నిలిపేందుకు ఐదేళ్ళు పనిచేస్తా. గతంలో జరిగిన అభివృద్ధికి రెట్టింపు అభివృద్ధి జరగాలన్నదే నా లక్ష్యం.

– మైనంపాటి వెంకట్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిత

చట్టాలపై అవగాహనుండాలి

న్యాయమూర్తి అనిత

లింగంపేట, వెలుగు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి అనిత అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి మండలంలోని సోమార్‌పేటలో నిర్వహించిన న్యాయ చైతన్యసదస్సులో ఆమె మాట్లాడారు. చిన్న విషయాలను పెద్దగా చేసుకుని పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగొద్దన్నారు. ఏవైనా కేసులుంటే రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. చట్టాలు, వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. ఎల్లారెడ్డి బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గోపాల్‌రావు, న్యాయవాదులు సతీష్, పండరి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆదివాసీల కోసం 'అక్షరాలా' పోరాటం

అడవి బిడ్డల హక్కుల కోసం 'అక్షరాలా' పోరాడిన సామాజిక ఉద్యమ కారిణి మహా శ్వేతాదేవి. ఆదివాసీలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కలం పట్టారు. గిరిజనుల స్థితిగతులపై లోతైన పరిశోధన చేసి, రాసిన నవలలు, కథలు వాళ్ల జీవితాలకు అద్దం పడతాయి. తన రచనలకు కేంద్ర సాహిత్య అకాడెమీ, జ్ఞానపీఠ్, రామన్ మెగసెసె, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత అవార్డులు అందుకున్న మహాశ్వేతాదేవి 1926 జనవరి 14న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో పుట్టారు. విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్‌లో చదివారు. కుటుంబ సామాజిక, ఉద్యమ నేపథ్యానికి సాహిత్య వారసత్వం అందించారు.

దేశ విభజన తర్వాత కలకత్తాలో స్థిరపడి, ఒక కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా చేస్తూ గ్రామీణ పరిస్థితులపై పత్రికల్లో ఆర్టికల్స్ రాసేవారు. భూముల్లేని పల్లె ప్రజలు, కూలీలు, సిటీల్లో ఫుట్ పాత్‌లపై కాలం వెళ్లదీసే బడుగు జీవుల పక్షాన స్పందించారు. పశ్చిమ బెంగాల్‌తోపాటు బీహార్, ఒడిశాల్లోని మారుమూల ప్రాంతాల ఆదివాసుల జీవితాలను స్టడీ చేశారు. మానవీయ విలువల కోసం కలలు కనాలని పిలుపునిచ్చారు. కలలకు, రచయితల కలాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలని అభిప్రాయపడేవారు.

సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చిన 'అరణ్యేర్ అధికార్ (ఎవరిదీ అడవి)' అనే నవల బ్రిటిష్ పాలనపై ఆదివాసీల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన బిర్సాముండా జీవితాన్ని, పోరాటాన్ని వివరిస్తుంది. దేశంలోని గిరిజనోద్యమాల ఆత్మ ఘోష అంతా ఈ బుక్ చదివితే తెలుస్తుందనటం అతిశయోక్తి కాదు. ఆమె రాసిన ఒక్కో కథ ఒక్కో గిరిజనుడి జీవితంలోని విషాదాలను వెల్లడిస్తుంది. 'శనిచరి' అనే కథ అందులో ఒకటి. 'జీవిత ఖైదీ' కథలోని 'మకర సవర'.. ఎమర్జెన్సీ టైంలో బలవంతంగా జరిగిన ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు అడవి బిడ్డల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపాయో చెబుతుంది.


ఆదివాసీలపై స్టడీలో భాగంగా మహాశ్వేతాదేవి తెలంగాణ గిరిజన పోరాటాలపై విస్తృతంగా సమాచారం సేకరించారు. అనేక అణచివేతలపై తిరగబడ్డ కొమరం భీం వంటి పోరాట యోధుల్లో ఉద్యమ వారసత్వం ఉందని చెప్పారు. అటవీ ప్రాంతాల పరిరక్షణ, గిరిజన తెగల హక్కుల సాధనకు ఈ తరం తమ వంతుగా కృషి చేస్తే అదే మహా శ్వేతాదేవికి మహా నివాళి.



– గుమ్మడి లక్ష్మీనారాయణ
ఆదివాసీ రచయితల సంఘం (ఆరసం)

ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న ఫేక్ ఎన్‌కౌంటర్లపై ఐక్యరాజ్యసమితి (యూఎన్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. యోగి ఆదిత్యనాథ్ సీఎం అయిన తర్వాత ఎన్‌కౌంటర్లు పెరగడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నకిలీ ఎదురు కాల్పులకు సంబంధించిన సమాచారాన్ని యూఎన్ఓ మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం (ఓహెచ్‌సీహెచ్‌ఆర్) సేకరించింది. గత రెండేళ్లలో ఆ రాష్ట్రంలో చట్టవిరుద్ధమైన ఎన్‌కౌంటర్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని సమితి ఒక లేఖలో సూచించింది.

10 నెలలు 1000 ఎన్‌కౌంటర్లు ఎందుకని?



పది నెలల కాలం, వెయ్యికి పైగా ఎన్‌కౌంటర్లు, 32 మంది హతం, 265 మందికి గాయాలు., 2,744 మంది రౌడీ షీటర్ల అరెస్టు. ఈ అంకెలు చూస్తుంటే ఎన్‌కౌంటర్ స్పెషలిస్టయిన పోలీసాఫీసర్ సర్వీసు రికార్డులా అనిపిస్తుంది. కానీ, ఇది యోగి ఆదిత్యనాథ్ మొదటి ఏడాది పాలనలో చోటు చేసుకున్న ఘటనలు! యోగి 2017 మార్చిలో అధికారంలోకి రాగానే పొలిటికల్ గూండాయిజాన్ని అరికడతానన్నారు. దానికి 'ఆపరేషన్ క్లీన్' అని పేరుకూడా పెట్టారు. తేడా వస్తే కాల్చి పారేయండని పోలీసులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడంతో తుపాకులకు పనిచెప్పడం మొదలైంది. మొదటి ఆరు నెలల్లోనే 420 ఎదురుకాల్పులు జరగ్గా 15 మంది చనిపోయారు. తర్వాత నాలుగు నెలల్లో 700 ఎన్‌కౌంటర్లు జరిగాయంటే సీఎం ఆర్డర్స్ ఎంత వేగంగా అమలయ్యాయో అర్థమవుతోంది. యోగి దెబ్బకి చాలామంది రౌడీలు, క్రైం రికార్డుగల చోటామోటా రాజకీయ నాయకులు, గూండాలు, సెటిల్‌మెంట్లు చేసే గల్లీ లీడర్లు తమంతట తామే పోలీసులకు సరెండరయ్యారు. కొందరు ఇరుగుపొరుగు రాష్ట్రాలకు పారిపోయి తలదాచుకున్నారు. ఇదంతా పాజిటివ్ సైడ్ అనుకుంటే, దీనిలో నెగెటివ్ కథనంకూడా ఉంది. పోలీసులు అత్యుత్సాహంతో అమాయకులపైకూడా ప్రతాపం చూపించసాగారు. యోగి హిందూత్వ రాజకీయాల్లో భాగంగా మైనారిటీలపై గురి పెట్టారు. ప్రీ ప్లాన్డ్ మర్డర్లుగా జరిగిపోవడాన్ని మృతుల కుటుంబాలు, ముఖ్యంగా మైనారిటీ వర్గాలు గగ్గోలు పెట్టాయి. యోగి పాలనలో సాగుతున్న ఈ ఎన్‌కౌంటర్ల పరంపరపై బాధిత కుటుంబాలు కోర్టుకెక్కాయి. యూపీ ఎదురుకాల్పులపై కోర్టు పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ చేయాలన్న కేసు సుప్రీం కోర్టులో ఈ నెలలో విచారణకు రానుంది.

ఐక్య రాజ్య సమితికూడా ఈ ఎన్‌కౌంటర్ల తంతుపై సీరియస్‌గా స్పందించింది. మోడీ సర్కారుకి లెటర్ రాయగా, ఇంకా రిప్లై ఇవ్వలేదు. దీంతో ఈ హత్యలపై మరింత డేటాని సేకరిస్తామని యూఎన్ఓ హెచ్చరించింది. సమితి పట్టిచూపిన కేసుల్లో బాధితులు ఎక్కువ మంది ముస్లింలే ఉన్నారు. ఈ ఘటనలు జరుగుతున్న తీరుని ఆ సంస్థ తీవ్రంగా ఖండించింది. వ్యక్తులను కిడ్నాప్ చేయటం (లేదా) అరెస్ట్ చేయటం, టార్చర్ పెట్టడాన్ని నిరసించింది. కాగా, ఇవి ప్రీప్లాన్డ్ మర్డర్లు కాదని పోలీసులు అంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లోనే ఆయా ఫ్యామిలీ మెంబర్స్ ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొస్తున్నారు. డెత్‌లు జరిగిన విధానం, సాక్ష్యాలను బట్టి చూస్తే అవన్నీ పోలీసు కస్టడీలో చట్టవిరుద్ధంగా జరిగినట్లు అర్థమవుతోంది. పోలీసులు మాత్రం 'ఆత్మరక్షణకు జరిపిన ఎదురుకాల్పుల'ని బుకాయిస్తున్నారు. పౌరుల పట్ల మానవీయ కోణంతో ఉండాలని సుప్రీంకోర్టు భద్రతా దళాలను ఆదేశిస్తున్నా వాటిని పాటిస్తున్న దాఖలాల్లేవు. పైగా ఆ ఆర్డర్‌కి విరుద్ధంగా రక్షణ బలగాలు సాధారణ జనాన్ని సెక్యూరిటీ పేరుతో అమానవీయంగా కాల్చిచంపుతున్నారు. ఒక్క మీరట్ జోన్‌లోనే 500 ఎన్‌కౌంటర్లు జరగడంతో మైనారిటీలు ప్రాణభయంతో ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో ఆగ్రా జోన్ 210 ఎన్‌కౌంటర్లతో, బరేలీ జోన్ 196 ఎన్‌కౌంటర్లతో, కాన్పూర్ జోన్ 91 ఎన్‌కౌంటర్లతో ఉన్నాయి. అతి తక్కువ ఎన్‌కౌంటర్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నియోజకవర్గమైన గోరఖ్‌పూర్ జోన్‌లోనే జరగడం గమనార్హం.

అరెస్ట్, కిడ్నాప్ చేసినవాళ్లను విడుదల చేయటానికి పోలీసులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకపోతే కాల్చిచంపుతున్నారు. బాధితుల కుటుంబ సభ్యులను, మానవ హక్కుల కార్యకర్తలను వేధిస్తున్నారు. చంపేస్తామని, తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారు. ఇవన్నీ తక్షణం దృష్టి పెట్టాల్సిన సీరియస్ ఆరోపణలని సమితి ఎక్స్‌పర్ట్‌లు అభిప్రాయపడ్డారు.

ఎదురుకాల్పులను సమర్థించేలా ప్రభుత్వం, పోలీసులు చేసిన స్టేట్‌మెంట్లనూ సమితి పరిగణనలోకి తీసుకుంది. ఈ ఎన్‌కౌంటర్ కిల్లింగ్‌లపై అర్జెంట్‌గా రివ్యూ జరగాల్సిన అవసరం ఉంది. అసలు ఎలాంటి పరిస్థితుల్లో ఎదురుకాల్పులు జరిగాయో తేలాలి. ఈ డెత్ కేసుల్లో ఇమ్మిడియెట్‌గా, ఇండిపెండెంట్‌గా, అన్ని కోణాల్లో ఇన్వెస్టిగేషన్ చేయాలి. అప్పుడే అసలు దోషులు బయటికొస్తారు. బాధిత కుటుంబ సభ్యులకు, మానవ హక్కుల కార్యకర్తలకు బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలి.



సుప్రీం గైడ్‌లైన్స్‌కి విరుద్ధంగా..

పోలీసులు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనటానికి 'పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' (2014) కేసును యూఎన్ఓ ఎగ్జాంపుల్‌గా చూపింది. కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తి ఎదురుకాల్పుల్లో చనిపోతే ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపాలి. పోస్ట్ మార్టం రిపోర్ట్‌లను వారికి ఇవ్వాలి. ఆ కేసులను స్వతంత్ర దర్యాప్తు ఏజెన్సీలకు అప్పగించాలి. కానీ, అలా జరగట్లేదు.

మణిపూర్ ఎన్‌కౌంటర్లపై సర్కారు మౌనం

మణిపూర్‌లో ఫేక్ ఎన్‌కౌంటర్లపైనా యూఎన్ఓ ఆరు నెలల కిందట లెటర్ రాసింది. వాటిపై సమగ్ర విచారణ జరపాలన్న సుప్రీంకోర్టు ఆర్డర్స్‌నీ సెంట్రల్ గవర్నమెంట్ అమలుచేయలేదు. దీంతో సమితి సీరియస్‌గా రియాక్ట్ అయింది. దర్యాప్తులు నత్తనడకన సాగటాన్ని తప్పుపట్టింది. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న జాప్యమని మండిపడింది.



మానును మంచు ముద్దాడితే..

ఆకు రాలు కాలమిది. ఆకులు లేక బోసిపోయిన ఓ చెట్టుకు మంచు ముద్దలే ఆకులయ్యాయి, పువ్వులయ్యాయి. మానును మంచు ముద్దాడిన ఈ చిత్రం సిమ్లాలో ఆదివారం కనిపించింది.

ఏమన్నారంటే



క్యూ కడుతున్నారు

బీజేపీ నాయకులు, కార్యకర్తలు మా కూటమిలోకి క్యూ కడుతున్నారు. వాళ్లు తమ పార్టీపై ఆశలు వదిలేసుకున్నారు. బీజేపీ పని అయిపోయిందని వాళ్లే స్వయంగా చెబుతున్నారు.


- అఖిలేశ్ యాదవ్, ఎస్పీ నేత



చెప్పినా వినలేదు!

అలోక్ వర్మపై వేటు వేయడాన్ని మళ్లీ సమీక్షించాలని సుప్రీం కోర్టు చెప్పింది. ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ నిర్ణయం తీసుకోవడం తొందరపాటు.

- జస్టిస్ ఏకే పట్నాయక్, సుప్రీం కోర్టు మాజీ జడ్జి



ట్రంప్‌ని పట్టించుకోవద్దు

ఆఫ్ఘన్ విషయంలో ట్రంప్ మాటలు పట్టించుకోవద్దు. మా దేశానికి ఇండియా సాయం కొనసాగించాలి. అమెరికా సైన్యాన్ని విత్ డ్రా చేసుకున్నా ఓకే.

- హమీద్ కర్జాయ్, ఆఫ్ఘన్ మాజీ ప్రెసిడెంట్

ప్రభుత్వాల తప్పులకు బడి పిల్లల్ని బలిపెడతారా!

విద్యా హక్కు చట్టం సవరణ బిల్లును లోక్‌సభ గతేడాది జూలైలో ఆమోదించగా రాజ్యసభ ఈ నెల మూడో తేదీన ఓకే చెప్పింది. ఫలితంగా పాఠశాలల్లో డిటెన్షన్ విధానం అమల్లోకి రానుంది. చట్టంలోని ఆయువుపట్టు లాంటి 'నో డిటెన్షన్'కి మంగళం పాడబోతోంది. దీనివల్ల గవర్నమెంట్ స్కూళ్లలోని విద్యార్థులకు ఎయిత్ క్లాస్‌తోనే చదువు ముగిసిపోవడం ఖాయం. ప్రైమరీ స్కూళ్లు సగటున సగం మంది టీచర్లతోనే పనిచేస్తున్నాయి. దేశంలో లక్షా పది వేల బడులు సింగిల్ టీచర్‌తో నెట్టుకొస్తున్నాయి. టీచింగ్ సిలబస్ సగమే పూర్తవుతోంది. లోపాలు సరిచేయకుండా 'నో డిటెన్షన్' ఎత్తివేయాలనుకోవడం అన్యాయం.



విద్యా హక్కు చట్టంలోని ఆయువుపట్టు లాంటి 'నో డిటెన్షన్' విధానాన్ని కేంద్రం తొలగిస్తోంది. ఈ విధానం చట్టంతోనే వచ్చిందని చెప్పటం అన్యాయం. విద్యార్థుల్లో చదువుకొనే సామర్థ్యం తగ్గిపోతోందన్న వంకతో 'నో డిటెన్షన్' విధానం ఎత్తివేతకు సిద్ధపడుతోంది. కేంద్ర ప్రభుత్వం కోరిక మేరకు ప్రథమ్ సంస్థ 2006 నుంచి 2016 వరకు ఏటా వార్షిక విద్యా స్థాయి నివేదికలను ప్రకటించింది. అభ్యసన సామర్థ్యం తగ్గడానికి 'నో డిటెన్షన్' విధానమే కారణమన్నట్లుగా పేర్కొంది. అయితే, విద్యా హక్కు చట్టం అమల్లోకి రావడానికి ముందునాటి ఐదేళ్ల నివేదికల్లో కూడా విద్యా స్థాయి అరకొరగానే ఉన్నట్లు ఐఐఎం(అహ్మదాబాద్) స్టడీ తెలిపింది. 8వ తరగతి నుంచి 10వ తరగతికి ఎంత రిటెన్షన్ ఉందో, 12వ తరగతికీ దాదాపు అంతే రిటెన్షన్ ఉన్నట్లు 'ది బెటరిండియా.కాం' పేర్కొంది. కాబట్టి నో డిటెన్షన్ పాలసీ విద్యా హక్కు చట్టంతోనే వచ్చిందనటం మరీ అన్యాయం. 20 రాష్ట్రాల్లో 2010 ముందు నుంచే నో డిటెన్షన్ ఏదో ఒక స్థాయి వరకు అమల్లో ఉంది. ఉమ్మడి ఏపీలో 1968(కొఠారి కమిషన్ నేపథ్యం) నుంచే ఏడో తరగతి వరకు నో డిటెన్షన్ అమలవుతుండటం తెలిసిందే.

ఇంతకీ ఫెయిలయ్యేదెవరు?

దేశంలోని అన్ని స్కూళ్లలోని విద్యార్థులు ఏడాదికో క్లాస్ చొప్పున ఎలిమెంటరీ విద్య వరకు బ్రేక్ లేకుండా చదువుకుంటున్నారు. 9 వ తరగతిలో 20% మంది, 10వ తరగతిలో 20% మంది ఫెయిల్ అవుతున్నట్లు కేంద్రం చెబుతోంది. ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తే ఐదు, ఎనిమిది తరగతుల్లోనూ డిటెయిన్(ఫెయిల్) అవుతారు. వారిని డిటెయిన్ చేయాలని ఫెయిలయ్యేదెవరనేదే అసలు విషయం.

గవర్నమెంట్ స్కూల్స్‌లోనే ఫెయిలవుతారా?

ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాల్లో అకడమిక్ ఇయర్‌లో 220 రోజులుంటే వెయ్యి గంటలను సిలబస్ పాఠాలకు కేటాయిస్తారు. సెలవులు, సమావేశాలు, శిక్షణా తరగతులు, ఎన్నికల విధుల వల్ల 180 రోజులే పాఠాలు నడుస్తాయి. ప్రాథమిక పాఠశాలల స్టాఫ్‌లో సగం మంది టీచర్లే (ఇద్దరు లేక ముగ్గురు) పనిచేస్తున్నారు. లక్షా పది వేల పాఠశాలలు సింగిల్ టీచర్‌తో నెట్టుకొస్తున్నాయి. రోజుకి ఏడు పీరియడ్స్‌లో ఐదు క్లాసుల్లో టీచింగ్ జరగాలి. అందులో సగమే జరుగుతోంది. అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు, పుస్తకాల కొరత, సరైన పర్యవేక్షణ లేకపోవడం చదువును దెబ్బతీస్తాయి. ఆ నష్టాన్ని నివారించడానికి కొంతమంది పేరెంట్స్ పిల్లలను ట్యూషన్లకు పంపిస్తున్నారు. చదువుకున్న పేరెంట్స్ ఇంటిలో హోమ్ వర్క్ చేయించడం, చదివించడం చేస్తున్నారు.

చేతులెత్తేసిన కేంద్రం

6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఎనిమిదో తరగతి వరకు ఉచితంగా చదువు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. విద్యా హక్కు చట్టం వచ్చి పదేళ్లు అయినా ఆ బాధ్యత నెరవేర్చనే లేదు. జిడిపిలో ఆరు శాతం నిధులను వెచ్చిస్తే అందరికీ నాణ్యమైన విద్యను అందించవచ్చనే కొఠారి కమిషన్; ఏడాదికి రు. 43 వేల కోట్లు చొప్పున ఐదేళ్లపాటు ఖర్చుచేస్తే విద్యా హక్కు చట్టాన్ని 100% అమలు చేయవచ్చనే మజుందార్ కమిటీ సిఫార్సులను పాటించలేదు. పైగా గడిచిన నాలుగేళ్లలో విద్యారంగానికి కేంద్రం కేటాయింపులు 15 శాతం తగ్గిపోయాయి. మోడల్ స్కూళ్లు, కంప్యూటర్ ఎడ్యుకేషన్ వంటి స్పాన్సర్డ్ పథకాలకు కేంద్రం నిధులు బంద్ చేసింది. దేశవ్యాప్తంగా 11 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాస్-ఫెయిల్‌తో నిమిత్తం లేకుండా పాఠశాల విద్యలో లెర్నింగ్ అవుట్‌కమ్‌కి తోడ్పడే విషయంలో చేతులెత్తేశారు.

తెలుగు రాష్ట్రాల నిబద్ధత కొనసాగాలి

డిటెన్షన్ అమలు విషయాన్ని రాష్ట్రాలే నిర్ణయించుకోవచ్చని సవరణ బిల్లులో వుంది. విద్య అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నందున ఆపాటి వెసులుబాటు ఇవ్వడమైంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు అమలు చేయడానికి సిద్ధమయ్యాయి. రాష్ట్రాల కోరిక మేరకే సవరణ బిల్లును ప్రతిపాదించినట్లు ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఈ విషయంలో కేంద్రం ప్రతిపాదనను తెలుగు రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ.... 'నో డిటెన్షన్' పాలసీకే కట్టుబడి వుంటామని ప్రకటించాయి. ఉమ్మడి రాష్ట్రం నుంచే యాభై ఏళ్లుగా అమల్లో వుండటం, రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ విద్యార్థి సంఘాల సూచనలు పాటించడం మూలాన తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి స్థిరంగా ఉంది.

– నాగటి నారాయణ,
విద్యారంగ విశ్లేషకుడు

ప్రభాత వెలుగు
సోమవారం | హైదరాబాద్
14.01.2019
www.v6velugu.com

టాకీస్

కాస్త భయం కాస్త హాస్యం

వైష్ణవి ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రవిప్రకాష్ కృష్ణంశెట్టి నిర్మించిన హారర్, థ్రిల్లర్, కామెడీ చిత్రం ‘అదృశ్యం’. సెన్సార్ పూర్తి చేసుకుని ఫిబ్రవరిలో విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ సినిమా ట్రైలర్‌ను హీరో జాన్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ ఆల్డ్రిన్ మాట్లాడుతూ.. “తెలుగులో ఇది నా మొదటి చిత్రం. నేను తెలుగువాడినే. చెన్నైలో మ్యూజిక్ కోర్సు చేసి అక్కడే సెటిలయ్యాను. తమిళంలో ఏడు చిత్రాలకు సంగీతాన్ని అందించాను. ఈ చిత్రంతో తెలుగులో కూడా బిజీ అవ్వాలని కోరుకుంటున్నాను” అన్నారు. హీరో జాన్ మాట్లాడుతూ.. "తెలుగులో ఇది నా మూడో చిత్రం. దర్శకులు కె. విశ్వనాథ్ గారిని కలిసి మా ఆడియోని రిలీజ్ చేశాం. ఆయన నన్ను చూసి ప్రభాస్‌లా ఉన్నావన్నారు. చాలా ఆనందమేసింది” అన్నారు. రవిప్రకాష్ మాట్లాడుతూ.. “కె.విశ్వనాథ్ గారి దగ్గర, సింగీతం శ్రీనివాస్ గారి దగ్గర కో డైరెక్టర్‌గా పని చేశాను. నేను చేసిన ‘బంటీ ద బ్యాడ్ బాయ్’కి ఎన్నో అవార్డులొచ్చాయి. రివార్డు వచ్చే సినిమా చెయ్యాలని ఇది చేస్తున్నాను” అన్నారు. ఇందులో అంగనారాయ్, ప్రియాంక, హర్షద, తేజారెడ్డి హీరోయిన్లు. జయవాణి మాంత్రికురాలి పాత్రలో నటించారు.





నేడు జంధ్యాల, రావుగోపాలరావుల జయంతి

జంధ్యాల గోపాల్రావు

స్వర్గంలో ఓ సందులో...

తెల్లటి గ్లాస్కో పంచె, లాల్చీ వేసుకుని... హిట్లర్ మీసకట్టుతో.. ‘ముత్యాలముగ్గు’లో కాంట్రాక్టరులాగ వడివడిగా వచ్చారు రావు గోపాల్రావు. అక్కడ ఓ చిన్న చాంబరు. హంస తూలికా తల్పం లాంటి దీవాను, దాని ముందొక టీపాయి. చుట్టూరా సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు, ఏవీఎస్సూ, ఎమ్మెస్ నారాయణ తదితరులంతా కూర్చుని జోకులేస్తుంటే... ముసిముసిగా నవ్వుకుంటూ, దేవతలు భోజనానికి ముందు సూపులా ఇచ్చిన సురాపానాన్ని ఆరారగా ఆస్వాదిస్తున్నారు జంధ్యాల.

అల్లు రామలింగయ్య లేకుండా రావు గోపాల్రావు ఒక్కడే వచ్చాడేంటని ఆశ్చర్యపోతూ... ‘అలో అలో అలో రావు గోపాల్రావుగారా... ఏటి తమరి గాలిలా మళ్లింది” అన్నారు జంధ్యాల. దానికి గోపాల్రావు... “అయ్యా మన్నించండయ్యా. తమరితో ‘సుత్తి’ వేయించుకోడానికి రాలేదండయ్యా. మిమ్మల్ని, ఈ సొర్గాన్ని బాగుచేయడం నావల్ల కాదండి. కాదంటే కాదంతే” అన్నారు.

“అయ్యయ్యయ్యో.. అల్లా అంటే ఎల్లా గోపాల్రావూ. శ్రీవారసలే ఘటనాఘటన సమర్థులు” అన్నారు జంధ్యాల వ్యంగ్యంగా నవ్వుతూ.

“లాభం లేదు మహాప్రభో. అమీరు పేట, పంజాగుట్ట, ఖైరతాబాదు, లక్డీకాపూలు, ఆబిడ్సు, కోఠి, సుల్తాను బజారు, నాగోలు, మలక్ పేట, దిల్సుఖ్ నగరు, కొత్తపేట, ఎల్బీ నగరు, వనస్థలిపురం... ఎక్కడో అక్కడ మనం ఒక ప్రసూతి వార్డులో ప్రసవానికి రెడీగా ఉన్న రెండు గర్భాలు చూసుకుని, దొరక్కపోతే కవలల్లా ఒకే గర్భం చూసుకుని మళ్లీ పుట్టెయ్యాల్సిందే. డిమాండెక్కువై పోతోంది” అన్నారు గోపాల్రావు.

“సూడు గోపాల్రావూ... ఈ ముక్క ఇంకోసారి నా దగ్గర అనకు. నేను అవుననేత్తానని, వద్దనే అననని నీ ఎదవనుమానం. కర్సైపోగలవు. నరకంలో తొంగోపెట్టేత్తాను జాగర్త.”

అప్పం అప్పం ఊ అనుకుంటూ.. కిలకిలా నవ్వుకుంటూ గోపాల్రావు వెనక చేరారు అల్లు రామలింగయ్య. గోపాల్రావునెవరైనా తిడితే ఆయనకి ఆనందం మరి.

“తమరా సుత్తాపండి మహాప్రభో. ఈ జనవరి పద్నాలుగుకైనా మనం ఓ తల్లి లేక రెండు తల్లుల కడుపున పడాల్సిందే. కళామతల్లి కన్నీళ్లెట్టేసుకుంటోంది... ఓ మాటకారి, ఇంకో మాటకారి ఒకే రోజున పుట్టారని ఆనందించేలోపే కన్నీళ్లెట్టించేసి ఆట్టే ఎళ్లిపోయారని. నా మాట వినండి మహాప్రభో. వీళ్లందరితో కూర్చుని ఇక్కడేసే సుత్తేదో కిందకెళ్లి భూలోకంలో వేద్దాం. కనక వర్షం కురుస్తుంది” అన్నారు గోపాల్రావు. “సూడు సెగట్రీ. మడిసన్నాక కూసింత కళాపోసణుండాలి. భూమ్మీద జయమాలిని, జ్యోతిలక్ష్మి అలవాటైపోయి... స్వర్గానికొచ్చాక రంభ, ఊర్వశి, మేనకల నృత్య సల్లాపాలతో కాలం గడిపేస్తున్న నీకు, రామలింగయ్యకీ ఏం తెలుస్తది, ఈ సుత్తి ఇక్కడేయడంలో ఉన్న సుఖం? నువ్వు ప్రతి యేడూ జనవరొచ్చేసరికి పరిగెత్తుకునొస్తావ్, ఈ ప్రపోజల్ పెడతావ్. నాతో వద్దనిపించుకుని వెళ్లిపోతావ్. నీ సిగదరగ... ఎన్నిసార్లు చెప్పినా అర్థం కావడం లేదేంటయ్యా” అన్నారు జంధ్యాల చనువుగా మందలిస్తూ.

“అదే ఎందుకనుకుంటున్నారండయ్యా. నన్నో నాలుగు దశాబ్దాలు, మిమ్మల్నో మూడు దశాబ్దాలు నెత్తినెట్టుకుని ఆదరించిన ప్రేక్షక దేవుళ్లని వదిలేసి, ఈ దేవతలతో ఇక్కడ సెటిలైపోవడం ఏవన్నా బావుందా అని అడుగుతున్నానండయ్యా. తమరిక నా మాటిని వచ్చేస్తే మళ్లీ ఫ్రెష్షుగా ఓ ముప్పై నలభయ్యేళ్లు వెండతెరనేలేసి వచ్చేద్దాం. అలెగ్జాండరులా దండయాత్ర చేసి, టిప్పు సుల్తానులా కప్పు కాఫీ తాగి, బంగాళా భౌ భౌలో అరటిపండు లంబా లంబా నంజుకు తిని, మీరు రచయిత కాదన్న వాళ్లని రాయెట్టి కొట్టేసి వచ్చేద్దాం” అని బతిమాలుడు ధోరణికి దిగేశారు గోపాల్రావు. పక్కనే చిరునవ్వులు చిందిస్తున్న అల్లు రామలింగయ్య కిసుక్కున నవ్వి, “ఈయనెందుకు కిందకెళ్లడానికి ఇంత తహతహలాడిపోతున్నాడో నాకర్థమైంది జంధ్యాలగారూ” అన్నారు. “నాకర్థమైతే కొత్త బాటా చెప్పెట్టి కొట్టండి రామలింగయ్యగారూ. నేనసలే నిరక్షర కుక్షిని, అక్కు పక్షిని. మీకర్థమైంది అఘోరించండి” అన్నారు జంధ్యాల వెటకారంగా.

“మా రోజుల్లో హీరోయిన్లంతా హీరోలతో పాటు డ్యాన్సులు చేసేవారు. మా ఇద్దరికీ మాత్రం జయమాలిని, జ్యోతిలక్ష్మి, అనూరాధ, సిల్క్ స్మితల్ని తగిలించేవారు. ఇప్పుడలా కాదు. హీరోయిన్లే ఐటమ్ సాంగులు చేస్తున్నారు. తమన్నాలు, అనుష్కలు, కాజల్లు, శృతీహాసన్లు... అబ్బబ్బబా. ఇప్పుడు విలన్లుగా ఉంటే ఆ అదృష్టమే వేరని తెగ బాధపడిపోతున్నారు ఈ విలన్‌గారు” అన్నారు అల్లుగారు.

అవుననుకోండి అన్నట్టు సాలోచనగా తలూపారు జంధ్యాల. కాసేపు ఆలోచించారు. ఆయన ఎస్ అంటారేమోనని ఒకింత ఆశపడ్డారు గోపాల్రావు. కాసేపు నిశ్శబ్దం తర్వాత జంధ్యాల తల పంకిస్తూ... “మీరెన్నన్నా సెప్పండి గోపాల్రావుగారూ. పుట్టుకకి ఓ రేటుంటది. చావుకో రేటుంటది. పుట్టుక్కి, చావుకి ఓలు మొత్తం ఓ రేటుంటది. పుట్టి మామూలుగా గిడితే ఒక రేటు, పుట్టి మళ్లీ స్టార్లుగా ఎదిగి బోల్లంత సాధించి గిడితే ఓ రేటు.. ఓలు మొత్తం కన్సిసను లేకుండా ఉంటుంది” అన్నారు.

గోపాల్రావు డీలా పడిపోయారు. “మీరిలా మొండికెయ్యడం బాగోలేదండయ్య. అసలీ సొర్గంలో ఇంతమందుండగా మిమ్మల్నే ఎందుకిన్నిసార్లు బతిమాలుతున్నాను? ఏదో పోయిన జన్మలో ఇద్దరం ఒకేరోజు పుట్టాం అన్న అభిమానంతో. మళ్లీ అలాగే పుడితే కలిసొస్తుందన్న ఆశతో. హాస్యబ్రహ్మగా మీరు, నటవిరాట్‌గా నేను ఒకే జయంతిని పంచుకుంటే బావుంటుందనీ. అకితాబ్ బచ్చన్లు, రెండు రెళ్లు ఆరని చెప్పే లెక్కల మాస్టర్లు, జయమ్ము నిశ్చయమ్మురా అని స్ఫూర్తినిచ్చేవాళ్లు, అహనా పెళ్లంట అంటూ ఆనందపడే ప్రేమికులు, వెరైటీ వంటలక్కలు, అంతకన్నా విచిత్రమైన కవయిత్రులు, శంకర శాస్త్రులూ.. అందరూ మీ మాటతో మళ్లీ కొత్తగా జీవాలు పోసుకుంటారని” అన్నారు నిరుత్సాహంగా.

“ఇదిగో సెగట్రీ. నాకవతల వేరే పార్టీతో మీటింగుంది. నీకిదే చెప్తున్నాను. ఆట్టే విసిగించకు. నువ్వెన్నిసార్లడిగినా నేనెందుకు వద్దంటున్నానో తెల్సా? మనమింకా చావలేదయ్యా. కళామతల్లి ఆశీస్సులతో, ప్రేక్షక దేవుళ్ల అభిమానంతో తెలుగువారి గుండెల్లో బతికే ఉన్నాం. అమరులైన మనకి పునర్జన్మేంటయ్యా నీ బండబడ. తెలుగు సినిమా వెండితెర మీదే కాదు... బుల్లితెరకి, కంప్యూటర్‌కి, దాని ద్వారా యూట్యూబ్‌కి, మొబైల్ ఫోన్‌కి, వాట్సాపులకి, ఫేస్ బుక్కులకి, ట్విటర్లకి, ఇన్స్టాలకి, షేర్ చాట్లకి విస్తరించి విశ్వవ్యాప్తమైపోయింది. అన్నింట్లోనూ మనం బతికే ఉన్నాం. సింగీతం శ్రీనివాసరావుగారు ఏ ముహూర్తాన నా దర్శకత్వంలో నువ్వు హీరోగా ‘రావూ గోపాల్రావూ’ అనే కథ ఇచ్చారో... అప్పట్నుంచి నాలో నువ్వు, నీలో నేను పరకాయ ప్రవేశం చేశాం. అది నన్ను నీలా, నిన్ను నేను సృష్టించిన పాత్రల్లా మాట్లాడిస్తోంది. ఇదింక మనలో ఇలాగే ఉండిపోవాలి. నాకిది బావుంది. మళ్లీ వేరే కాయాల్లోకి ప్రవేశించి మన ఉనికిని మనం పోగొట్టుకోవద్దు” అంటూ అలో అలో అలో అంటూ ఎటో వెళ్లిపోయారు జంధ్యాల.

కన్విన్స్ అయినట్టుగా అల్లుగారికేసి చూసి “ఆయనేం చెప్పినా ఆనంద భైరవి రాగంలా హాయిగా ఉంటుందయ్యా” అన్నారు గోపాల్రావు. అప్పం అప్పం అన్నారు అల్లుగారు అంగీకారంగా.

నిజమే... నటుడు కాబట్టి రావు గోపాల్రావుగారికి తృష్ణ ఎక్కువ. రచయిత, దర్శకుడు కాబట్టి జంధ్యాల గారికి ముందు చూపెక్కువ. మనకి వాళ్లిద్దరంటే ప్రేమ ఎక్కువ. వాళ్లిద్దరూ చేసిన సినిమాలంటే అమిత మక్కువ. వాళ్లిద్దరికీ ‘జయం’తే తప్ప వర్ధంతి లేదు. వారివురినీ ప్రేమించే ప్రతి తెలుగువాడికీ ఈ వ్యాసం అంకితం.



– వి.ఎన్.ఆదిత్య, సినీ దర్శకుడు

నన్నో నాలుగు దశాబ్దాలు, మిమ్మల్నో మూడు దశాబ్దాలు నెత్తినెట్టుకుని ఆదరించిన ప్రేక్షక దేవుళ్లని వదిలేసి, ఈ దేవతలతో ఇక్కడ సెటిలైపోవడం ఏవన్నా బావుందా అని అడుగుతున్నానండయ్య. మిమ్మల్ని, ఈ స్వర్గాన్ని బాగు చేయడం నావల్ల కాదంటే నమ్మండి మహాప్రభో. తమరిక నా మాటిని వచ్చేస్తే మళ్లీ ఫ్రెష్షు గా ఓ ముప్పై నలభయ్యేళ్లు వెండతెరనేలేసి వచ్చేద్దాం.



ఇంకాస్త కొత్తగా

రొటీన్ గ్లామర్ పాత్రలతో నెట్టుకొచ్చేయకుండా చాలెంజింగ్‌గా ఉండే పాత్రలకు ఓటేస్తున్నారు హీరోయిన్లు. స మంత వరుసగా డిఫరెంట్ రోల్స్ చేసుకుంటూ వస్తోంది. తాప్సీ బా లీవుడ్ వెళ్లి మరీ చాలెంజింగ్ రోల్స్ చేస్తోంది. కాజల్ కూడా వెరైటీయే కోరుకుంటోంది. ఆ లేడీ ‘సీత’ చిత్రంలో నెగిటివ్ రోల్ చేస్తోందని తెలిసింది. ఇప్పుడు భారతీయుడు సీక్వెల్‌లో రెండు రకాల గెటప్స్‌లో కనిపించనుందని తెలుస్తోంది. ఒకటి వయసులో ఉన్న అమ్మాయి, రెండోది వయసైన మహిళ. మొదటి భాగంలో సుకన్య పెద్ద కమల్ హాసన్ పక్కన వృద్ధురాలిగా కనిపిస్తుంది. మరి రెండో భాగంలో కాజల్ అలానే కనిపించనుందా? లేక ఇద్దరు కాజల్‌లు ఉంటారా? ఇంకా అన్ని వివరాలైతే తెలియలేదు కానీ... ఆమెకు మేకప్ చేయడం కోసం హాలీవుడ్ నుంచి మేకప్ టీమ్‌ను రప్పిస్తున్నారని మాత్రం వినికిడి. ‘మిస్ గ్రానీ’ రీమేక్‌లో సమంత వృద్ధురాలిగా కనిపిస్తుందన్నారు. అది నిజం కాదని ఈ మధ్యనే తెలిసింది. మరి కాజల్ వార్త అయినా నిజమో కాదో. ఒకవేళ నిజమే అయితే ఈ కొత్త గెటప్‌లో కాజల్ ఎలా ఉంటుందో!

దీనికి సీక్వెల్ తీస్తా

::: అనిల్ రావిపూడి

సుప్రీమ్, పటాస్, రాజా ది గ్రేట్ వంటి సినిమాలతో తనకంటూ ఒక మార్క్ సృష్టించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేశ్, వరుణ్ తేజ్‌లతో అతడు తెరకెక్కించిన కామెడీ ఎంటర్‌టైనర్ ‘ఎఫ్ 2’ ఇటీవలే విడుదలైంది. ఆ సినిమా విశేషాలు అనిల్ మాటల్లో...




- జంధ్యాల, ఈవీవీ, కృష్ణారెడ్డి గార్ల సినిమాలకు హాలు హాలంతా ఘొల్లుమని నవ్వుతుండేవారు. అలా ఒక పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం తియ్యాలన్నది నాకెప్పటినుంచో ఉన్న కోరిక. ఆ ప్రయత్నమే ఈ సినిమా. ఆ దర్శకుల స్థాయిని నేను చేరుకోలేను గాని, నాదయిన పద్ధతిలో వారిని అనుసరిస్తాను.
- రాజా ది గ్రేట్ చేస్తున్నప్పుడే యాక్షన్ లేకుండా, ఫైట్స్ లేకుండా క్షేమంగా వెళ్లి లాభంగా రండి, పెళ్లాం చెబితే వినాలి లాంటి ఫ్యామిలీ సినిమా చేద్దామని అనుకున్నా. అలా ఈ కథ మొదలయ్యింది.
- వెంకీ చాలా బాగా చేశారు. యంగ్‌గా కూడా కనిపించారు. ఆయన పాత్ర ఆడియెన్స్‌కి బాగా కనెక్ట్ అయ్యింది. వరుణ్ కూడా బోరబండ యాదవ్‌గా బాగా చేశాడు. వెంకీ గారితో కలిసి తన ఫ్రస్టేషన్‌ని పంచుకోవడంలో చక్కగా నటించాడు.
- వెంకటేష్ గారు డబ్బింగ్ రోజే సినిమా చూశారు. బయటికొచ్చి... ‘ఏంటి నేను అలా చేసేశాను’ అన్నారు. ‘దీనికి మామూలుగా డబ్బింగ్ చెబితే చాలదు, చాలా ఎనర్జిటిక్ గా చెప్పాలి’ అని ఆ రోజు క్యాన్సిల్ చేసేసుకుని... మర్నాటినుంచి చాలా కాన్సన్‌ట్రేట్ చేసి చెప్పారు.
- సూర్యకాంతం క్యారెక్టర్ మోడ్రన్‌గా, సాఫ్ట్‌గా ఉంటే ఎలా ఉంటుంది అన్న ఆలోచనలోంచి ప్రగతి గారి పాత్ర పుట్టింది. అలాగే మా అమ్మమ్మ, నానమ్మలను చూసి విజయగారు, అన్నపూర్ణ గార్ల పాత్రలు డిజైన్ చేశాను. సినిమాలో ప్రతి పాత్రకీ ఒక ప్రత్యేక మార్క్ ఖచ్చితంగా ఉంటుంది.
- గుండమ్మ కథ సినిమా నాకు చాలా ఇష్టం. అలాంటి సినిమా తీయాలని నాకెప్పుడూ ఉండేది. ఈ సినిమాలో అక్కాచెల్లెళ్ల క్యారెక్టర్స్ ఇంచుమించు అలాగే ఉంటాయి. అందుకే ఏదోలా ఆ సినిమాను చూపించాలని ప్రకాష్ రాజ్ గారి ఎపిసోడ్ లో చూపించా.
- ఒక కథకి సుమారు నాలుగైదు నెలలు కూర్చుంటా. నిజానికి ఎంత ఎక్కువ సమయం కేటాయిస్తే కథ అంత బాగా వస్తుంది. కాకపోతే సంవత్సరానికి ఒక సినిమా అయినా చెయ్యాలి కాబట్టి ఆ సమయం మాత్రమే కేటయిస్తా.
- ప్రస్తుతానికయితే ఏ సినిమానీ ఒప్పుకోలేదు. కొన్ని రోజులు రిలాక్సయ్యి, మళ్ళీ ఏ జానర్‌లో సినిమా చెయ్యాలో నిర్ణయించుకుంటా. ‘ఎఫ్ 2’ కి సీక్వెల్ తీస్తాను. బాలీవుడ్‌లో కామెడీ సినిమాలకి సిరీస్‌లు చేసి హిట్ కొడుతున్నారు. నేను కూడా ఈ సిరీస్ చేద్దామనుకుంటున్నాను. వెంకీ గారికి, వరుణ్‌కి చెప్పాను. వాళ్లు కూడా ఓకే అన్నారు.



లిమిట్స్ దాటితే..

సినీ పరిశ్రమలో పుకార్లు మామూలే. సెలెబ్రిటీలు కూడా వినీ వినీ అలవాటు పడిపోతారు. కానీ అవి హద్దులు దాటితే మాత్రం బాధగా ఉంటుంది అంటుంది నర్గీస్ ఫక్రీ. రీసెంట్‌గా ఆమె విషయంలో ఒక రూమర్ వచ్చింది. ఎప్పుడూ చాలా స్టైలిష్‌గా ఉండే ఆమె... ఈ మధ్య రెండు మూడు సందర్భాల్లో వదులుగా ఉన్న దుస్తులు వేసుకుని కనిపించింది. దాంతో అపార్థం చేసుకున్న కొందరు... నర్గీస్ గర్భవతి అని, అది కవర్ చేయడానికే అలా రెడీ అవుతోందని వార్తలు రాశారు. అది చాలా కోపం తెప్పించింది నర్గీస్‌కి. ‘నేనొక స్కిన్ ప్రాబ్లెమ్‌తో బాధ పడుతున్నాను. టైట్ డ్రెస్సులు వేసుకుంటే ఇబ్బందిగా ఉంటోందని లూజుగా ఉండేవి వేసుకున్నాను. అది తెలుసుకోకుండా ఏది పడితే అది రాసేస్తారా’ అంటూ సీరియస్‌గా రియాక్టయ్యింది. మీడియాని చాలా నమ్ముతాం, అలాంటి మీడియా ఇలా లిమిట్స్ దాటి బాధపెట్టడం బాలేదు అంటూ వాపోతోంది పాపం.



విజయ్.. ప్లే బోయ్

విజయ్ దేవరకొండ సినిమా అనగానే అందరికీ యమా ఆసక్తి. ఏం సినిమా... ఏం క్యారెక్టర్... ఏం గెటప్ అంటూ ప్రశ్నలే ప్రశ్నలు. ఎందుకంటే అతడు కచ్చితంగా డిఫరెంట్‌గా ఉండే సినిమాలే చేస్తాడు. ఏదో ఒక వెరైటీ ఉండే పాత్రలే ఎంచుకుంటాడు. ఈసారీ అదే చేస్తున్నాడు. ఓనమాలు, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు చిత్రాల దర్శకుడు క్రాంతిమాధవ్ సినిమాకి ఎస్ చెప్పాడు. విజయ్‌లా అతడూ వైవిధ్యభరిత చిత్రాలే చేస్తాడు కాబట్టి ఈ కాంబినేషన్ కచ్చితంగా ఏదో డిఫరెంట్‌గానే ప్లాన్ చేసివుంటుందనే అంచనా వేస్తారంతా. అది నిజమే. ఈ సినిమాలో గత సినిమాలను మించి కొత్తగా కనిపించబోతున్నాడు విజయ్. ఒక ప్లే బోయ్‌గా నటిస్తున్నాడట. ఏకంగా ముగ్గురు హీరోయిన్లతో రొమాన్స్ చేస్తాడట. ముగ్గురు హీరోయిన్లుగా రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్ త్రెసాలు చేస్తున్నారట. ‘అర్జున్ రెడ్డి’తో తెలుగు సినిమాల్లో రొమాన్సును ఒక గీత దాటించాడన్న పేరు తెచ్చుకున్నాడు. మరి ముగ్గురు హీరోయిన్లంటే ఎలా ఉంటుందో. ఎలాగూ రెండు నెలల్లో సెట్స్ మీదికి తీసుకెళ్లి, వీలైనంత వేగంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారు కాబట్టి నేరుగా వెండితెర మీదే చూద్దాం.

ట్విటర్ టాక్



“ప్రతి ఒక్కరం జీవితంలో దేని కోసమో ఆరాటపడుతూనే ఉంటాం. కానీ మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. మనం అందరినీ ప్రేమిస్తున్నామా? పద్ధతిగానే జీవిస్తున్నామా? ఎవరినైనా క్షమించగలుగుతున్నామా? ఏ స్వలాభం ఆశించకుండా ఇతరులకు సాయపడుతున్నామా? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలను బట్టి మనం ఎలాంటివారం, ఎలా జీవిస్తున్నాం అన్నది తెలుస్తుంది.

– ఫరా ఖాన్, బాలీవుడ్ డైరెక్టర్

ఈవెంట్




ఎక్సోడస్ మీడియా నిర్మిస్తున్న ‘అసలేం జరిగింది?’ చిత్ర పోస్టర్‌ను ఎంపీ సంతోష్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. శ్రీరామ్ హీరోగా రూపొందుతున్న ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారాయన. తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకూ ఎవరూ తీయని కొత్త ప్రాంతాల్లో షూటింగ్ జరపాలనుకోవడం, ఇందుకోసం యూనిట్ ఆరు నెలల పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం అభినందనీయమన్నారు. దర్శకుడిగా పరిచయమవుతున్న కెమెరామేన్ ఎన్‌వీఆర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి షూటింగ్ ప్రారంభమవుతుందని, రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తి చేస్తామని నిర్మాత నీలిమ తెలిపారు.

గప్‌చుప్

సీరియస్ పాత్రలతో ఇంప్రెస్ చేసే జూనియర్ ఎన్టీయార్... కామెడీ కూడా అదరగొట్టేయగలడని ప్రూవ్ చేసిన చిత్రం ‘అదుర్స్’. అందులోని చారి పాత్ర గుర్తొస్తేనే అందరికీ నవ్వొస్తుంది. అలాంటి పాత్రను తారక్ మళ్లీ పోషిస్తున్నాడా? అవుననే అంటున్నారు కొందరు. ‘అదుర్స్’ సీక్వెల్ స్క్రిప్టును కోన వెంకట్ రెడీ చేశారని, త్వరలో ప్రాజెక్టును పట్టాలెక్కిస్తారనే వార్తలు టాలీవుడ్‌లో షికార్లు చేస్తున్నాయి. అయితే అఫీషియల్‌గా ఇంతవరకూ ఎవరూ ప్రకటించలేదు. ఒకవేళ నిజమైతే మాత్రం ఎన్టీయార్ ఫ్యాన్స్‌కి, కామెడీ ప్రియులకి పండగే.



ఫొటో ఫీస్ట్



సాయంకాలం... సాగర తీరం... మెల్లగా వచ్చి అలలు పాదాలను ముద్దాడుతున్నాయి. కృతీ సనన్ మాత్రం అస్తమిస్తోన్న సూర్యుడిని ఒడిసిపట్టి ముద్దాడాలని చూస్తోంది. ఎంత అందంగా ఉందో కదా ఈ దృశ్యం!



ఫుడ్ ఇప్పుడో పెద్ద బిజినెస్

మహా నగరాలతోపాటు చిన్న పట్టణాల్లోనూ రెస్టారెంట్ల నుంచి బిర్యానీనో, ప్లేట్ మీల్సో, శ్నాక్సో తెప్పించుకుని తినే అలవాటు పెరిగిందన్న విషయం తెలిసిందే కదా! ఇది ఇక్కడితో ఆగిపోవడం లేదు. ఫుడ్ అయిటమ్స్ తయారీ, డెలివరీలలో చాలా మార్పులు వస్తున్నాయి.

బిజినెస్ డెస్క్, వెలుగు:

ఎన్నో కొత్త యంత్రాలు, బ్లాక్ చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి టెక్నాలజీలు పాకశాస్త్రంలో విప్లవాత్మక మార్పులను తెస్తున్నాయి. సంప్రదాయ వంటశాలల స్థానంలో క్లౌడ్ కిచెన్లు, ఫుడ్ రోబోలు, ఐఓటీలు, డీప్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్స్ వంటగది స్వరూపాన్నే మార్చేస్తున్నాయి. ఆహార నాణ్యతను మరింత పెంచుతున్నాయి.

క్లౌడ్ కిచెన్స్

సాధారణంగా రెస్టారెంట్లలో, కార్పొరేట్ కంపెనీల్లో భారీ కిచెన్లు ఉంటాయి. నిత్యం ఇందులోని షెఫ్‌లు ఆహారాన్ని వండివడ్డిస్తారు. క్లౌడ్ కిచెన్లు మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. వీటికి రెస్టారెంట్లు, కంపెనీలతో సంబంధం ఉండదు. ఇందులోని తయారైన వంటలను స్విగ్గీ, జొమాటో మాదిరే ఇంటికి డెలివరీ చేస్తారు. వీటి ధరలు తక్కువగా ఉంటాయి. బిగ్‌బజార్, హెరిటేజ్ ఫ్రెష్ వంటి రిటైల్ స్టోర్లు నిర్వహించే ఫ్యూచర్‌గ్రూప్ క్లౌడ్ కిచెన్లను త్వరలోనే ప్రారంభించబోతోంది. ''మా క్లౌడ్ కిచెన్ల ద్వారా కేవలం రూ.40కి తాజాగా ఆహారం అందిస్తాం. బియ్యం ఆధారిత వంటకాలను ఎక్కువగా తయారు చేస్తాం. రూ.10 చెల్లిస్తే రెండు సమోసాలు ఇస్తాం. ఈ మేరకు కిచెన్లను ఏర్పాట్లు చేసుకుంటున్నాం. దాదాపు అన్ని నగరాల్లో రెడీ టు ఈట్ వ్యాపారాన్ని ప్రారంభిస్తాం. ఈ రంగంపై మాకు ఎన్నో ఆశలు ఉన్నాయి'' అని వివరించారు. క్లౌడ్ కిచెన్ వ్యాపారం చేసే కంపెనీకి ప్రత్యేకంగా రెస్టారెంట్లు ఉండవు. వంటశాలలు మాత్రమే ఉంటాయి. అక్కడ వండిన పదర్థాలను ప్యాక్ చేసి హోం డెలివరీ ఇస్తారు. తనకు ఉన్న విస్తృతమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుకొని ఫుడ్‌ను డెలివరీ చేస్తుంది కాబట్టి తక్కువ మార్జిన్లు వచ్చినా నష్టాలు ఉండవని ఫ్యూచర్‌గ్రూప్ భావిస్తోంది.

రేటింగులు, ర్యాంకింగులు

ఇది వరకు అయితే మనం వెళ్లే రెస్టారెంటు ఆహారం గురించి తప్ప మరే ఇతర వివరాలు తెలిసేవి కావు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వచ్చాక అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. రెస్టారెంట్లకు రేటింగులు, ర్యాంకింగులు ఇచ్చే పద్ధతి రావడంతో దాని నాణ్యత గురించి స్పష్టమైన సమాచారం తెలుస్తోంది. ఏదైనా లోపం ఉన్నట్టు వినియోగదారులు చెబితే దానిని సరిదిద్దుకోవడానికి యాజమాన్యాలకు అవకాశం ఉంటున్నది. ఇక నుంచి ఆఫీసు క్యాంటీన్ల గురించి కంపెనీలు ఉద్యోగుల అభిప్రాయాలు స్వీకరిస్తున్నాయి. దీని వల్ల అక్కడ ఎంత మంది పనిచేస్తున్నారు ? ఎలా వండుతున్నారు ? శుభ్రత ఎలా ఉంది ? తదితర వివరాలు కంపెనీకి తెలుస్తాయి.

ఎంటర్‌ప్రైజ్ హెల్త్ రిపోర్ట్

''నువ్వు తినే ఆహారం నువ్వేంటో చెబుతుంది'' అనేది పాశ్చాత్య దేశాల సామెత. చాలా కంపెనీల్లో ఉద్యోగులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడానికి బదులు ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసే పోకడ పెరుగుతోంది. ఉద్యోగుల ఆహార అలవాట్లను విశ్లేషించడం ద్వారా 'ఎంటర్‌ప్రైజ్ హెల్త్ రిపోర్ట్' తయారు చేయాలని కంపెనీలు భావిస్తున్నాయి. ఈ నివేదికలతో వేరే కంపెనీల నివేదికలను పోల్చిచూడటం ద్వారా ఉద్యోగుల ఆరోగ్యం ఎలా ఉంటుందో తెలుస్తుంది. ఒకవేళ ఉద్యోగులు తరచూ అనారోగ్యం పడుతున్నారని గుర్తిస్తే మంచి ఆహారం తీసుకోవాల్సిందిగా వారికి సూచించవచ్చు. ఫలితంగా కంపెనీ కూడా బాగుపడుతుంది. ఎందుకంటే ఉద్యోగులు తక్కువ సెలవులు తీసుకుంటారు. ఆరోగ్యబీమా ఖర్చులు తగ్గుతాయి.

ఆహార వ్యర్థాల నిర్వహణ

టెక్నాలజీ సాయం ద్వారా ఆఫీసులో ఆహారం మిగులును కచ్చితంగా అంచనా వేస్తారు. అనాథలు, నిరాశ్రయుల వంటి వారికి దీనిని వెంటనే అందజేసే ఏర్పాట్లు చేస్తారు.

ఆహారం మూలాలు తెలుసుకోవడం

మనం తిన్న అరటిపండో, మామిడిపండో ఎంత దూరం ప్రయాణించి మన సమీపంలోని దుకాణానికి వచ్చిందనే విషయాన్ని ఎప్పుడైనా ఆలోచించారా ? మనం తినే ఆహారం పండించిన చోటు గురించి తెలుసుకోవడం మన ఆరోగ్య సంరక్షణలో కీలకమైన అంశం. ఇప్పుడు చాలా మంది అది ఎక్కడ పండింది ? ఎలా సాగు చేశారు? స్థానిక దుకాణానికి రావడానికి ఎంత సమయం పట్టింది ? తదితర విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు దొరుకుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమాచారం రావడం వల్ల ఏది తినాలో ఏది తినొద్దో నిర్ణయించుకోవడం సులువు అవుతుంది.

ఇండియాలో ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ మార్కెట్... 50 వేల కోట్లు	ఒక్కో క్వార్టర్‌కు వృద్ధి రేటు అంచనా 15%-20%
	ఒక్కో నెలకు టాప్ బ్రాండ్ల ఆర్డర్ రేటు 2.1 కోట్ల నుంచి 2.2 కోట్ల వరకు



టెక్నాలజీ

రెస్టారెంటో, ఆఫీసు క్యాంటినో మనకు భోజనం వడ్డించే సమయంలోనే దానిని నాణ్యత గురించి తెలుసుకునే రోజులు వచ్చాయి. ఉదాహరణకు చికెన్ వడ్డిస్తుండగా దానిని ఫొటో తీస్తే చాలు. డీప్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ ద్వారా దాని నాణ్యత గురించి పూర్తి సమాచారం వస్తుంది. అందులో ఎన్ని క్యాలరీలు, ఎన్ని పోషక పదార్థాలు ఉన్నాయో తక్షణం తెలుస్తోంది. ఫలితంగా మనకు సరిపోయే ఆహారాన్నే ఎంచుకునేందుకు వీలు కలుగుతుంది.

బిర్యానీ మెషీన్

బిర్యానీ అంటే చాలా మంది చెవి కోసుకుంటారు. ఘుమఘుమలాడే ఈ వంటకాన్ని లొట్టలేసుకుతింటారు. కాఫీ వెండింగ్ మెషీన్, దోసామేటిక్, రోటీ మేకర్ మాదిరే బిర్యానీ వండే మెషీన్లు కూడా వస్తున్నాయి. దీనివల్ల ఒక మనిషికి ఎంత అవసరమో అంతే వడ్డించవచ్చు. వృథా సమస్య ఉండదు. కొలత కచ్చితంగా ఉంటుంది. అపరిశుభ్రత సమస్యే ఉండదు. అయితే ఇలాంటి మెషీన్ల వల్ల ఉద్యోగాలు తగ్గుతాయనేది అపోహేనని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. అమెరికా, చైనా, యూరప్‌లో వీటిని ప్రయోగాత్మకంగా వాడి మంచి ఫలితాలను సాధించారు. వినియోగదారుడికి మరింత నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించగలుగుతున్నారు.

ఫుడ్ రోబోలు

రెస్టారెట్లు మొదలుకొని గ్రాసరీ స్టోర్ల వరకు ఫుడ్ రోబోలు కీలకపాత్ర పోషించనున్నాయి. ఇవి నిత్యం 24 గంటలూ ఆహారాన్ని వండివడ్డిస్తాయి. కూరగాయలను తరగడం, ఉడకబెట్టడం, పొట్టుతీయడం వంటి పనులు చేస్తాయి. కస్టమర్ల అవసరాలను బట్టి వారికి ఏ ఆహారం నప్పుతుందో చెబుతాయి. విదేశాల్లోని స్పైస్, కాలిబర్గర్, క్రియేటర్, కేఫ్ ఎక్స్ వంటి ఇది వరకే వీటిని ఉపయోగిస్తున్నాయి. త్వరలో ఇవి ఆఫీస్ కిచెన్లు, రెస్టారెంట్లలోకి ప్రవేశిస్తాయని తయారీదారులు చెబుతున్నారు. ఎక్కువ రద్దీ ఉండే రెస్టారెంట్లకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని అంటున్నారు.





ఇంట్లో వండుకోవాలని లేదు. బయటి ఫుడ్ తినాలనిపించింది. అయినా బయట కాలు పెట్టనక్కర్లేదు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఒకటి ఉంటే చాలు



బిర్యానీనో, మంచురియానో ఏదైనా సరే మీకు నచ్చిన డిష్ నచ్చిన రెస్టారెంట్ నుంచి తేవాలని ఫోన్లో ఆర్డర్ ఇస్తే చాలు



మీ కాల్ అందిన వెంటనే రెస్టారెంట్ వాళ్లు రెడీ అయిపోతారు. మీ ఆర్డర్ వండి రెడీ చేస్తారు. స్విగ్గీ నుంచో, జొమాటో నుంచో వచ్చే వాళ్ల కోసం చూస్తారు



వ్యాన్‌లోనో, టూ వీలర్ మీదనో మీ ఆర్డర్ మీరు చెప్పిన చోటికి వచ్చేస్తది. డెలివరీ బాయ్‌కి పే చేయడం, పార్సిల్ తీసుకోవడం. అంతే వేడి వేడి డిష్ తినడానికి రెడీ

మీరు ఫోన్లో ఆర్డర్ చేసినప్పటి నుంచి మీ నోటికి అందించే లోపల ఎంతో మంది శ్రమ దాగి ఉంటుంది. అటు రెస్టారెంట్లకు ఇటు డెలివరీ చేసే కంపెనీలకు కూడా లాభమే. ఈ వ్యాపార చక్రంలో కొన్ని వేల కోట్ల రూపాయల బిజినెస్ కూడా దాగి ఉంది. ఫుడ్ ఇండస్ట్రీ ఇప్పుడు నిజంగానే ఇండస్ట్రీ.

క్యూ3 ఫలితాలు కీలకం

న్యూఢిల్లీ: స్థూల ఆర్థిక వ్యవస్థ డేటా పాయింట్లు, కంపెనీల క్యూ3 ఫలితాలు, ద్రవ్యోల్బణం డేటా ఈ వారం మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. చమురు ధరలు, రూపాయి మారకం విలువ, ఎఫ్ఐఐల పెట్టుబడి విధానాలు కూడా సూచీలకు కీలకమని అంటున్నారు. సీపీఐ, డబ్ల్యూపీఐ గణాంకాలను ఇన్వెస్టర్లు జాగ్రత్తగా పరిశీలించవచ్చు . ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ క్యూ3 ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంపైనా ఇన్వెస్టర్లు స్పందించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వాళ్లు జీఎస్టీ కట్టరు.. వసూలు చేస్తారు

- కాంపోజిషన్ స్కీములో ఉన్న జీఎస్‌టీ వ్యాపారుల చేతిలో నష్ట పోకుండా కొత్త రూల్
- ఇన్వాయిస్‌పై స్టేటస్ ప్రింట్ చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ: కాంపోజిషన్ స్కీము కింద ఉండే జీఎస్‌టీ వ్యాపారులందరూ ఇన్వాయిస్‌ల మీద తమ రిజిస్ట్రేషన్ స్టేటస్‌ను ముద్రించాలనే నిబంధన తేవాలని కేంద్ర రెవెన్యూ శాఖ ఆలోచిస్తోంది. ఈ నిబంధన వినియోగదారులకు ప్రయోజనం కలిగిస్తుందని భావిస్తోంది. కస్టమర్ల నుంచి జీఎస్‌టీ వసూలు చేసి, ప్రభుత్వం వద్ద జమ చేయకపోవడమేనేది జరగకుండా ఈ చర్య అడ్డుకుంటుందని రెవెన్యూ శాఖ అధికారి ఒకరు చెప్పారు. కాంపోజిషన్ స్కీముపై వినియోగదారులలో అవగాహన పెంపొందించేందుకు క్యాంపెయిన్‌ను ప్రవేశపెట్టే ఆలోచన ఉందని కూడా వెల్లడించారు. కాంపోజిషన్ స్కీము వ్యాపారులు టర్నోవర్ మీద కేవలం 1% జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. సాధారణంగా వస్తువుల ఆధారంగా ఈ జీఎస్‌టీ సాధారణ జీఎస్‌టీ వ్యాపారులకైతే 5,12, లేదా 18 శాతం దాకా ఉంటుంది. అందుకే అలాంటి వ్యాపారులు వినియోగదారుల నుంచి జీఎస్‌టీ వసూలు చేయడానికి వీలు లేదనేది నిబంధన. జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ పొందిన మొత్తం 1.17 కోట్ల వ్యాపారాలలో 20 లక్షలు కాంపోజిషన్ స్కీము కావాలని కోరుకున్నాయి. కాంపోజిషన్ స్కీములో ఉండి కూడా వినియోగదారుల నుంచి అధిక రేటులో జీఎస్‌టీని కొన్ని వ్యాపార సంస్థలు వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆ రెవెన్యూ శాఖ అధికారి పేర్కొన్నారు. అలా వసూలు చేసిన మొత్తాన్ని ఆ వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించడం లేదని కూడా తెలిపారు. దీంతో ఇన్వాయిస్‌లలో జీఎస్‌టీ స్టేటస్‌ను ముద్రించాలనే నిబంధన తేవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసి) ప్రతిపాదిస్తోంది.



లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఎల్ఐసీ వాటా తగ్గింది

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగంలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల హవా ఎక్కువవుతోంది. 2017-18 లో ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) మార్కెట్ వాటా తొలిసారిగా 70 శాతం కంటే కిందకు వచ్చేసింది. ఇదే సమయంలో ప్రైవేటు రంగ సంస్థల వాటా అంతకు ముందు ఏడాదిలోని 28.19 శాతం నుంచి 2017-18 లో 30.64 శాతానికి పెరిగింది. టోటల్ ప్రీమియం ఆదాయం ఆధారంగా 2016-17 లో 71.81 శాతంగా ఉన్న ఎల్ఐసీ మార్కెట్ వాటా 2017-18 నాటికి 69.36 శాతానికి తగ్గిపోయిందని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రైవేటు రంగ సంస్థల కొత్త బిజినెస్ ప్రీమియం 2017-18 లో పెరిగింది. ఇక రెన్యువల్ ప్రీమియంలో ఎల్ఐసీ వాటా 69.35 శాతం కాగా, ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థల వాటా 30.65. 2017-18 లో దేశంలో అన్ని ఇన్సూరెన్స్ సంస్థలూ కలిపి మొత్తం 2.82 కోట్ల కొత్త ఇండివిడ్యువల్ పాలసీలు జారీ చేశాయి. ఇందులో ఎల్ఐసీ ఒక్కటే 2.13 కోట్ల పాలసీలు జారీ చేసింది. ప్రైవేటు రంగంలోని అన్ని కంపెనీలు కలిపి 68.5 లక్షల పాలసీలను జారీ చేశాయి. కొత్త పాలసీల విషయంలో ప్రైవేటు రంగ కంపెనీలు 2017-18లో 8.47 శాతం వృద్ధి సాధిస్తే, ఎల్ఐసీ కేవలం 6 శాతం వృద్ధి సాధించింది. మార్చి 2018 నాటికి ఇండియాలో మొత్తం 68 సంస్థలు ఇన్సూరెన్స్ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో 24 కంపెనీలు లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలోనూ, 27 కంపెనీలు జనరల్ ఇన్సూరెన్స్‌లోనూ, 6 కంపెనీలు కేవలం హెల్త్ ఇన్సూరెన్స్‌లోనూ ఉండగా, మరో 11 కంపెనీలు రీఇన్సూరర్స్‌గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మొత్తం ఇన్సూరెన్స్ కంపెనీలలో 8 ప్రభుత్వ రంగానికి చెందినవి.



యాడ్స్‌లో కొత్త ట్రెండ్ డిజిటల్ ప్రచారాల్

వీడియో యాడ్స్‌కు పెరుగుతున్న డిమాండ్

- 2019లో మూడింతలు పెరగనున్న మొబైల్ వీడియో ఖర్చు
- కొత్త ప్లాట్‌ఫామ్‌లపై వీడియో యాడ్స్

వినేదాని కంటే, చూసే దానికే ఎక్కువ పవర్ ఉంటుంది అంటారు. నిజంగానే మనం ఏదైనా సినిమా చూస్తే చాలు.. ఆ సినిమా డైలాగ్స్ అన్నీ అవలీలగా చెప్పేస్తాం. అందుకే పెద్ద పెద్ద కంపెనీల నుంచి చిన్న సంస్థల వరకు ప్రతీది కూడా ఇప్పుడు.. తమ ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేసుకోవడానికి వీడియోపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. ఇటీవల డిజిటల్ మార్కెటింగ్ ఏ రేంజ్‌లో పెరుగుతుందో తెలిసిందే. పట్టణ ప్రాంత ప్రజల నుంచి గ్రామీణ ప్రాంత ప్రజల వరకు ప్రతి ఒక్కరి వద్ద స్మార్ట్‌ఫోన్లు ఉంటుండటంతో డిజిటల్ మార్కెటింగ్ భారీ ఎత్తున ఎగుస్తోంది. డిజిటల్ మార్కెటింగ్‌లో కూడా వీడియో మార్కెటింగ్‌కు లేదా అడ్వర్‌టైజ్‌మెంట్‌కు ఊహించలేని డిమాండ్ వస్తోంది. వచ్చే దశాబ్దంలో డిజిటల్ వీడియో అడ్వర్‌టైజింగే ఆధిపత్య స్థానంలోకి వస్తుందని పలు రిపోర్టులు అంచనావేస్తున్నాయి.

ఇటీవల స్నాప్‌చాట్, షేర్‌చాట్, టిక్‌టోక్, రోపోసో, లైక్ వంటి వీడియో ప్లాట్‌ఫామ్‌లు మనల్ని తెగ అలరిస్తోన్న సంగతి తెలిసిందే. యూజర్లు కూడా తమ స్మార్ట్‌ఫోన్లపై అత్యధిక సమయాన్ని ఎక్కువగా వీడియోలు చూసేందుకే వెచ్చిస్తున్నారు. దీంతో అడ్వర్‌టైజర్లు కన్జ్యూమర్లను అందిపుచ్చుకోవడానికి వీడియో అడ్వర్‌టైజింగ్‌పై ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. కంపెనీలు కూడా డిజిటల్‌లో వీడియో యాడ్స్ ఇవ్వడానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాయి. గ్లోబల్‌గా 2019లో అడ్వర్‌టైజర్లు మొబైల్ వీడియోపై 2,000 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2015లో ఇది 200 కోట్ల డాలర్లు మాత్రమే. ఈ ఏడాది మొత్తం ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో వీడియోలు 85 శాతం ఆక్రమించనున్నాయని సిస్కో అంచనా. గ్లోబల్ వీడియో ట్రాఫిక్ కూడా 2016 నుంచి 2021 నాటికి మూడింతలు పెరగనుంది. దీనిలో లైవ్ వీడియో, వీడియో యాడ్స్ రెండూ ఉండబోతున్నాయి. వీడియో యాడ్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యంతో, భవిష్యత్‌లో యాడ్స్ ఫ్రీ వీడియో, వీడియో విత్ యాడ్స్ రెండు విధాలుగా కంపెనీలు ఛార్జీ చేసినా ఆశ్చర్యపోవక్కర్లేదు.

ప్రతి మార్కెటర్ స్ట్రాటజీ డిజిటల్ వీడియో యాడ్సే

గత ఏడాది కాలంగా ఇన్‌స్టాగ్రామ్‌లో యాడ్ ఇంప్రెషన్స్‌లో వీడియో కంటెంట్ 65 శాతం వరకూ ఉంది. ఈ కంటెంట్ మరింత పెరుగుతోంది కూడా.

వీడియో యాడ్స్‌కు కన్జ్యూమర్ల నుంచి వస్తోన్న అనూహ్య స్పందన, గ్రోత్‌తో 2019లో ప్రతి మార్కెటర్ స్ట్రాటజీ డిజిటల్ వీడియో యాడ్స్‌గానే ఉండబోతోంది. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో యాడ్స్‌ను రన్‌చేస్తూ.. మార్కెటర్లు తమ వీడియో యాడ్ కంటెంట్‌ను పెంచుకుంటున్నారు. మోడ్రన్ వెబ్‌ను ప్రస్తుతం వీడియోనే నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. దీనికంతటికీ కారణం స్మార్ట్‌ఫోన్లు, హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ అనే చెప్పుకోవాలి.

ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లు ఇప్పటికే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అగ్రస్థానాల్లో ఉన్నాయి. కానీ కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన వీడియో కంటెంట్ ప్లాట్‌ఫామ్‌లు, స్టార్టప్‌లు షేర్‌చాట్, టిక్‌టోక్, రోపోసో వంటి వాటిల్లో కూడా వీడియో యాడ్స్‌కు ప్రాముఖ్యం పెరుగుతోంది. ఇటీవల టిక్‌టోక్, షేర్‌చాట్ ప్లాట్‌ఫామ్‌లు వీడియో కంటెంట్‌తో ఇండియన్ యూజర్ల మనసును దోచేస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లకు పెరుగుతోన్న ఆదరణను మార్కెటర్లు అందిపుచ్చుకుంటున్నారు.


అన్ని సైజుల వ్యాపారాలకు వీడియో మార్కెటింగ్ ఇప్పుడు ఒక వరంగా మారింది. ఏ విధంగా మనం డిజిటల్ యాడ్స్‌ను రూపొందించగలం, ఎలా ప్రజెంట్ చేస్తున్నాం అనే దానిపైనే వారి మార్కెటింగ్ భవిష్యత్తు ఎక్కువగా ఆధారపడి ఉంటోంది. ఎడ్యుకేషనల్ కంటెంట్, రిపోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాడ్స్ ఆర్గనైజేషన్స్ అన్నీ హై క్వాలిటీ వీడియోలను అందిస్తూ.. యూజర్లను తమ సొంతం చేసుకోవాలని చూస్తూ ఉన్నాయి. 'రోజుకు మేము కనీసం 150 డిజిటల్ సినిమాలు చేస్తూ ఉంటాం. వీటి వ్యవధి నిమిషం కంటే ఎక్కువ అంతే. కానీ 30 శాతం నుంచి 35 శాతం వృద్ధి సాధిస్తున్నాం' అని డబ్ల్యూఏటీకన్సల్ట్ అనే డిజిటల్ ఏజెన్సీ, సోషల్ మీడియా ఏజెన్సీ ఫౌండర్ రాజీవ్ దింగ్రా చెప్పారు.

మొబైల్ వీడియో యాడ్స్‌పై 2018లో 700 కోట్ల డాలర్ల ఖర్చు...

ఎక్సలెంట్‌గా రూపొందించిన లోగోలు, హై క్వాలిటీ బ్యానర్ యాడ్స్ కన్జ్యూమర్లను ఆకట్టుకోవడంలో చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. కానీ వాటికి మించి మరింత లోతుగా కస్టమర్ల హృదయాల్లో నిలిచిపోవాలంటే, ఆర్గనైజర్లకు ఉన్న వేదిక వీడియో యాడ్స్. విజువల్‌గా వారికి అవగాహన కల్పిస్తే, కొనుగోలు చేసేందుకు వినియోగదారులు మరింత ఆసక్తి చూపుతుంటారు. దీనికోసం కంపెనీలు ప్రస్తుతం యూనిక్ వీడియో యాడ్ కంటెంట్ ఇచ్చేందుకు ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నాయి. బీటూబీ, బీటూసీ, ఎస్ఎంబీ, హై టెక్, అనలాగ్ ప్రొడక్ట్ వంటి ఎలాంటి కంపెనీ అయినా ప్రస్తుతం డిజిటల్ వీడియో అడ్వర్‌టైజింగ్‌పైనే దృష్టిపెట్టాయి. ఇండస్ట్రీ అంచనా ప్రకారం మొబైల్ వీడియో యాడ్స్‌పై 2018 వరకు 700 కోట్ల డాలర్లను వెచ్చించారు.

- బిజినెస్ డెస్క్, వెలుగు


మొబైల్ వీడియోలపై 2019లో 2,000 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేసే అవకాశం	ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో వీడియోలు 85% ఆక్రమణ	డిజిటల్ వీడియో యాడ్స్‌వైపే మార్కెటర్లు మొగ్గు
2015లో ఈ ఖర్చు 200 కోట్ల డాలర్లు మాత్రమే	గ్లోబల్ వీడియో ట్రాఫిక్ 2016-2021 వరకు మూడింతలు పెంపు	షేర్‌చాట్, టిక్‌టోక్, రోపోసోల్లో కూడా వీడియో యాడ్స్




మర్చెంట్లతో పుంజుకున్న యూపీఐ

ఒక్క ఏడాదిలోనే భారీగా జంప్

యూపీఐ లావాదేవీలు ఇప్పుడు ఇద్దరి వ్యక్తులు మధ్య పేమెంట్ ఆప్షన్‌గా మాత్రమే కాకుండా... . మర్చెంట్ లావాదేవీలకూ ఉపయోగిస్తోన్న సంగతి తెలిసిందే. నగదు రహిత లావాదేవీలు జరుపడానికి యూపీఐ సులభతరంగా ఉంటుండటంతో, ఎక్కువ మంది యూజర్లు ఈ ప్లాట్‌ఫామ్ ద్వారానే అన్ని రకమైన లావాదేవీలు జరుపుతున్నారు. నగదు పంపించుకోవడం, బిల్లు పేమెంట్లు,వస్తువులు కొనేందుకు, సర్వీసెస్ పొందడానికీ వాడేస్తున్నారు. నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, మొబైల్ వాలెట్లు వంటి పేమెంట్ ఆప్షన్లను పొందుతున్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత 2016లో ఇది పర్సన్ టూ పర్సన్ పేమెంట్ ఆప్షన్‌గానే వచ్చింది. ఆ తర్వాత 2018లో పర్సన్ టూ మర్చెంట్ ఆప్షన్‌ను లాంచ్ చేశారు. పర్సన్ టూ మర్చెంట్ ఆప్షన్ వచ్చిన తర్వా త యూపీఐ లావాదేవీలు భారీగా పుంజుకున్నాయి. గత నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ.లక్ష కోట్లను క్రాస్ చేసినట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. యూపీఐ లావాదేవీల సంఖ్య 62.01 కోట్లకు చేరింది. మర్చంట్లకు యూపీఐ లావాదేవీలను అందించడానికి తొలుత 2017లో ట్యాక్సీ హైరింగ్ సర్వీసులకు దీన్ని వాడటం మొదలుపెట్టారు. అనంతరం టెలికాం, యుటిలిటీ బిల్స్, ఫుడ్ టెక్ కంపెనీలు, ఆన్‌లైన్ ఈకామర్స్ వంటి మర్చెంట్ ప్లాట్‌ఫామ్స్‌కు కూడా యూపీఐ ఆప్షన్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం పలు సర్వీసు ప్రొవైడర్లు చెల్లింపులు జరుపడానికి మీకు యూపీఐని పేమెంట్ ఆప్షన్‌గా అందిస్తున్నాయి. '2018లో పెద్ద పెద్ద బిజినెస్‌లు ఐఆర్‌సీటీసీ, ఓయో రూమ్స్, బుక్‌మైషోలు కూడా యూపీఐ పేమెంట్లను ప్రారంభించాయి' అని రేజర్ పే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కో ఫౌండర్ శశాంక్ కుమార్ తెలిపారు. అమెజాన్ లాంటి ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు గతేడాదే యూపీఐను ప్రారంభించాయి. యూపీఐ ద్వారా పెట్టుబడులను పెట్టొచ్చు. మ్యూచువల్ ఫండ్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ స్క్రిప్‌బాక్స్.కామ్ కూడా డిసెంబర్‌లోనే యూపీఐను తీసుకొచ్చింది.





నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.433	రూ.5.00
వరంగల్	రూ.435	రూ.5.00

బెంగళూరే బాద్‌షా

- పీబీఎల్- 4 చాంప్ రాప్టర్స్
- ఫైనల్లో 4–3తో ముంబైపై విజయం



బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) నాలుగో సీజన్‌లో బెంగళూరు రాప్టర్స్ విజేతగా నిలిచింది. సొంతగడ్డపై ఆదివారం జరిగిన ఫైనల్లో బెంగళూరు 4-3తో మాజీ చాంపియన్ ముంబై రాకెట్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో ఈ లీగ్‌లో తొలిసారి విజేతగా నిలిచి కొత్త చరిత్ర సృష్టించింది. తొలుత ఇరుజట్లు చెరో ట్రంప్‌మ్యాచ్‌తోపాటు పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లను నెగ్గడంతో స్కోరు 3-3తో సమమైంది. ఈదశలో జరిగిన నిర్ణయాత్మక పురుషుల డబుల్స్‌లో బెంగళూరుకు చెందిన మహ్మద్ అహసాన్-హెంద్రా సెతియావన్ జంట 15-13, 15-10తో కిమ్ జి జంగ్-లీ యోంగ్ డే జోడీపై వరుస గేమ్‌ల్లో విజయం సాధించి రాప్టర్స్‌కు కప్పు అందించింది. గత సీజన్‌లో హైదరాబాద్ హంటర్స్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన రాప్టర్స్.. ఈసారి మాత్రం ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమివ్వకుండా విజేతగా నిలిచింది. చాంపియన్ రాప్టర్స్‌కు రూ.3 కోట్లు, ముంబైకి రూ.1.5 కోట్లు ప్రైజ్‌మనీగా లభించింది. సెమీస్‌లో ఓడిన హైదరాబాద్ హంటర్స్, అవధ్‌కు రూ.75 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

శ్రీకాంత్ దూకుడు..


బెంగళూరు కెప్టెన్ శ్రీకాంత్ టోర్నీలో తన అజేయ రికార్డును కొనసాగించాడు. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 15-7, 15-10తో యాండెర్ అంటోన్సెన్‌పై గెలిచాడు. తర్వాత మహిళల సింగిల్స్ (ట్రంప్‌మ్యాచ్)లో రాప్టర్స్ ప్లేయర్ తై ట్రాంగ్ వు 15-8, 15-9తో శ్రీయాన్షి పరదేశీపై సునాయాస విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కిమ్ జంగ్-పియా బెర్నాడెత్ (ముంబై) 15-8, 15-14తో మార్కస్ ఎల్లిస్-లారెన్ స్మిత్ జంటపై, పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ 7-15, 15-12, 15-3తో బి సాయిప్రణీత్‌లపై గెలుపొందారు.

జుల్ఫికరుద్దీన్ ఇకలేరు

కన్నుమూసిన ఫుట్‌బాల్ లెజెండ్



వెలుగు, హైదరాబాద్: ఫుట్‌బాల్ లెజెండ్, మాజీ ఒలింపియన్.. తన ఆటతో దేశానికి, హైదరాబాద్ నగరానికి ఎంతో పేరు తెచ్చిన మహ్మద్ జుల్ఫికరుద్దీన్ కన్నుమూశారు. చాన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పద్మారావునగర్‌లోని స్వగృహంలో ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 83 ఏళ్ల జుల్ఫికర్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో ఇండియా ప్రాతినిధ్యం వహించిన జుల్ఫికర్ దేశంలోనే అత్యంత ప్రతిభావంతులైన ఫుట్‌బాలర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నారు. హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్ తరఫున 1954లో కెరీర్‌ను షురూ చేసి తర్వాత పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరారు. దివంగత ఎస్.ఎ. రహీమ్ శిష్యరికంలో రాటు దేలి 1955 నుంచి 12 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. దేశవాళీ టోర్నీల్లో అద్భుతంగా రాణించి సింగపూర్‌తో జరిగిన మెర్డెకా కప్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేశారు. మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో ఆరుగురు హైదరాబాదీలు ఆడిన ఇండియా టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. అప్పటికి 19 ఏళ్ల జుల్ఫికర్ టీమ్‌లో పిన్న వయస్కుడు. అయినా.. అసాధారణ నైపుణ్యాలతో అందరి దృష్టిని ఆకర్షించారు. మొత్తంగా మూడు మ్యాచ్‌ల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన జుల్ఫికర్ రెండు గోల్స్ చేశారు. 1958 టోక్యో ఆసియా క్రీడల్లోనూ ఇండియా టీమ్‌లో సభ్యుడిగా ఉన్న ఈ హైదరాబాదీ.. సంతోష్ ట్రోఫీలో మూడో సార్లు ఏపీని విజేతగా నిలిపారు. రోవర్స్ కప్‌ను నాలుగు సార్లు, డూరండ్ కప్‌ను రెండు సార్లు, డీసీఎమ్ ట్రోఫీని ఒక సారి నెగ్గారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న జుల్ఫికర్ మరణం పట్ల ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య, తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం, పలువురు మాజీ క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు.



మేఘనా ట్రిపుల్ ధమాకా

షట్లర్ ప్రణవ్‌కు గోల్డ్

పుణె: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారులు పతకాలు కొల్లగొడుతున్నారు. రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్ మేఘనా రెడ్డి స్వర్ణం, రెండు రజతాలతో సత్తా చాటింది. హూప్ విభాగంలో 11.05 స్కోరు చేసిన మేఘన పసిడి కైవసం చేసుకుంది. బాల్‌లో 12.35 పాయింట్లతో, రిబ్బన్‌లో 10.05 స్కోరుతో రెండు రజతాలు గెలుచుకుంది. బ్యాడ్మింటన్ అండర్-17 బాలుర సింగిల్స్ ఫైనల్లో ప్రణవ్ 15-21, 21-18, 21-11తో రవిపై నెగ్గాడు. అండర్-21 బాలుర 200 మీ. బ్యాక్‌స్ట్రోక్ స్విమ్మింగ్‌లో జస్వంత్ (2:16.10 ని.) కాంస్యం గెలిచాడు. ఏపీకి చెందిన లిఫ్టర్ పి. ధాత్రి అండర్-17 బాలికల 71 కేజీల విభాగంలో 151 కిలోల బరువు ఎత్తి గోల్డ్ నెగ్గింది. శ్రీలక్ష్మి అండర్-17 బాలికల 76 కేజీల కేటగిరీలో కాంస్యం నెగ్గింది. అండర్-17 బాలుర 200 మీటర్ల పరుగులో ఏపీ అథ్లెట్ శణ్ముగం శ్రీనివాస్ (21.92 సె.) బంగారు పతకం ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రీడల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన పదేళ్ల షూటర్ అభినవ్ షా స్వర్ణం నెగ్గిన పిన్నవయస్కుడిగా రికార్డులకెక్కాడు.

ఇండియా నాకౌట్ చేరేనా?

- బహ్రెయిన్‌తో చివరి లీగ్ నేడు
- రా. 9:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ లో

షార్జా: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నాకౌట్ దశకు చేరి చరిత్ర సృష్టించడమే లక్ష్యంగా సునీల్ ఛెత్రి నాయకత్వంలోని టీమిండియా లీగ్ దశలో తమ చివరి మ్యాచ్‌కు సిద్ధమైంది. వరల్డ్ ర్యాంకింగ్‌లో 97వ స్థానంలో ఉన్న ఇండియా, 113వ ర్యాంకులో ఉన్న బహ్రెయిన్‌తో సోమవారం అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచినా, కనీసం డ్రా చేసుకున్నా కూడా ఛెత్రి సేన నాకౌట్ దశకు చేరనుంది. ఒక వేళ బహ్రెయిన్ చేతిలో ఓడితే మాత్రం, థాయ్‌లాండ్, యూఏఈ మధ్య సోమవారం జరిగే మరో లీగ్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడాలి. ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు జరగ్గా... బహ్రెయిన్ 5 నెగ్గింది. ఇక, ఇండియా కెప్టెన్ ఛెత్రికి ఇది 107వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఇందులో బరిలోకి దిగితే ఇండియా తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా రికార్డును ఛెత్రి సమం చేయనున్నాడు.

శుబ్‌మన్‌కు పిలుపు

న్యూఢిల్లీ: అండర్–19 వరల్డ్‌కప్ నెగ్గిన ఇండియా టీమ్‌లో సభ్యుడైన శుబ్‌మన్ గిల్ సీనియర్ జట్టుకు ఎంపికయ్యాడు. న్యూజిలాండ్‌తో ఈనెల 23 నుంచి జరిగే వన్డే సిరీస్‌కు శుబ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. టీమిండియా నుంచి సస్పెండైన పాండ్యా, రాహుల్ స్థానాల్లో విజయ్ శంకర్, మయాంక్‌లను తొలుత ఎంపిక చేశారు. అయితే మయాంక్ చిన్న గాయంతో ఇబ్బంది పడుతున్నందున అతని స్థానంలో గిల్‌కు చాన్స్ వచ్చింది. ఇటీవలే కివీస్‌లో ఇండియా–ఎ తరఫున పర్యటించిన గిల్.. విశేషంగా రాణించాడు. అలాగే ఈ సీజన్ రంజీల్లో పంజాబ్ తరఫున ఆడిన అతను దాదాపు 99 సగటుతో పరుగుల మోత మోగించాడు.

బిగ్ ఫోర్ ఫైట్





ఏడో టైటిల్ వేటలో ఫెడరర్, జొకోవిచ్ ■ తొలిసారి బరిలోకి ప్రజ్నేశ్

నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ ■ ఉదయం 5.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

చాలాకాలంగా టెన్నిస్ కోర్టును ఏలుతున్న నాలుగు స్తంభాలు రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, ఆండీ ముర్రే, నొవాక్ జొకోవిచ్ మరో మెగా టోర్నీకి రెడీ అయ్యారు. అభిమానులంతా ముద్దుగా 'బిగ్ ఫోర్' అని పిలుచుకునే ఈ చతుష్టయం నేటి నుంచి మొదలవనున్న ప్రతిష్ఠాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో దిగనుంది. లేటు వయసులోనూ ధాటి కనబరుస్తున్న ఫెడెక్స్ టైటిల్ గెలుచుకుంటాడో... కెరీర్‌లో చివరి సారి ఈ టోర్నీ ఆడనున్న ముర్రే ఆకట్టుకుంటాడో... గాయం నుంచి కోలుకున్న నడాల్ తన సర్వీస్ సత్తా చాటుతాడో... నెంబర్ వన్ జొకోవిచ్ ఏడోసారి విజేతగా నిలుస్తాడో... తొలిసారి బరిలో ఉన్న మన యువ కెరటం ప్రజ్నేశ్ గుణేశ్వరన్ మెరిపిస్తాడో... గతేడాది మిక్స్‌డ్ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన రోహన్ బోపన్న అదే ఫామ్ కొనసాగిస్తాడో చూడాలి.

మెల్‌బోర్న్

టెన్నిస్ అభిమానులకు కనువిందు చేసేందుకు సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ సిద్ధమైంది. 1905లో ప్రారంభమై 114 ఏళ్లుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ 107వ ఎడిషన్‌కు సోమవారం తెరలేవనుంది. 12 రోజుల పాటు జరుగనున్న సీజన్ ప్రారంభ టోర్నీలో 'బిగ్-4' బరిలో దిగుతుండటం ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికే చెరో ఆరుసార్లు ఈ ట్రోఫీ చేజిక్కించుకున్న స్విస్ దిగ్గజం ఫెడరర్, సెర్బియా స్టార్ జొకోవిచ్ ఏడోసారి విజేతగా నిలవాలని ఉవ్విళ్లూరుతుంటే... గాయాలతో బాధపడుతున్న ముర్రే, నడాల్ సత్తా చాటాలని భావిస్తున్నారు. శరీరం సహకరిస్తే వింబుల్డన్ వరకు కొనసాగాలనుకుంటున్నానని ఇటీవల కన్నీటి పర్యంతమవుతూ చెప్పిన ముర్రేకు ఇదే ఆఖరి ఆస్ట్రేలియన్ ఓపెన్ కాగా... తొడ కండరాల గాయంతో కోలుకున్న రఫెల్ టోర్నీ ఆసాంతం రాణించగలడా అనేది అనుమానమే. దీంతో ముఖ్యంగా ప్రపంచ నెంబర్‌వన్ జొకోవిచ్, మూడో ర్యాంకర్ రోజర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

రోజర్ తాజాగా...

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగనున్న ఫెదరర్ మరోసారి టైటిల్ చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇటీవల హోప్‌మన్ కప్‌లో విజేతగా నిలిచిన 37 ఏళ్ల స్విస్ దిగ్గజానికి ఈ టోర్నీలో ప్రధాన పోటీ నొవాక్‌తోనే ఉండొచ్చు. 'మంచి ప్రదర్శన చేయడం ముఖ్యం. అదే చేయాలనుకుంటున్నా. ప్రత్యర్థులను తక్కువ అంచనా వేయను. వారికి గట్టి పోటీ ఇస్తా' అని ఫెడెక్స్ అన్నాడు. మరోవైపు బ్రిస్బేన్ వార్మప్ మ్యాచ్ నుంచి ఫిట్‌నెస్ సమస్యలతో వైదొలిగిన 32 ఏళ్ల నడాల్ ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా ఉన్నానంటున్నాడు.

సెరెనా సత్తా చాటేనా...

మాతృత్వ మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్న అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ తిరిగి సత్తాచాటేందుకు ఈ మెగాటోర్నీ సరైన వేదికగా భావిస్తోంది. తన పూర్వపు ఆటతీరుతో విజేతగా నిలవాలని చూస్తోంది. తొలి మ్యాచ్‌లో సోమవారం బుజర్నెస్కూ (రొమేనియా)తో సెరెనా తలపడనుంది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ కరోలినా వోజ్నియాకి (డెన్మార్క్), టాప్ సీడ్ హలెప్ (రొమేనియా), కెర్బర్ (జర్మనీ), ఒసాకా (జపాన్) కూడా తమ అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు.

కొత్త కెరటాలు..

టోర్నీ ఏదైనా అప్పుడప్పుడు సంచలన ఫలితాలు నమోదవడం ఖాయం. అలాగే ఈ సారి కూడా తమ సత్తచాటేందుకు కొత్త కుర్రాళ్లు సిద్ధమవుతున్నారు. వారిలో అలెగ్జెండర్ జ్వెరేవ్ (జర్మనీ), బోనా కోరిచ్ (క్రొయేషియా), కరెన్ కచనోవ్ (రష్యా), స్టిఫానో సిట్సిపస్ (గ్రీస్) ప్రమాదకారులు. ఇటీవల హోప్‌మన్ కప్ ఫైనల్ చేరిన 21 ఏళ్ల జ్వెరేవ్‌తో మేటి ఆటగాళ్లకు కూడా తిప్పలు తప్పకపోవచ్చు. తనదైన రోజున ఎంతటి ప్రత్యర్థినైనా చిత్తు చేయగల ఈ యువ సంచలనం దూకుడు చూస్తుంటే అనూహ్య ఫలితాలు ఖాయమనిపిస్తోంది. వీరితో పాటు భవిష్యత్తు తారలుగా పేరు తెచ్చుకునేందుకు మరింత మంది యువకులు రెడీ అవుతున్నారు.

తొలి రోజు ప్రధాన మ్యాచ్‌లు

పురుషుల సింగిల్స్

నడాల్ (స్పెయిన్) X డ్యూక్‌వర్త్ (ఆస్ట్రేలియా)
ఫెడరర్ (స్విట్జర్లాండ్) X ఇస్తోమిన్ (ఉజ్బెకిస్తాన్)
ఆండీ ముర్రే (బ్రిటన్) X రాబర్టో బటిస్టా (స్పెయిన్)

మహిళల సింగిల్స్

షరపోవా (రష్యా) X డార్ట్ (ఇంగ్లండ్)
హెర్‌కాగ్ (స్లొవేనియా) X కెర్బర్ (జర్మనీ)
వొజ్నియాకి (డెన్మార్క్) X ఉత్వానక్ (బెల్జియం)



కండ్లు చెదిరే ప్రైజ్‌మనీ

సింగిల్స్ విభాగంలో విజేతకు రూ. 20.8 కోట్లు, రన్నరప్‌కు రూ. 10.4 కోట్లు దక్కనున్నాయి. తొలి రౌండ్ దాటితే రూ. 38 లక్షలు లభిస్తాయి. డబుల్స్ విన్నర్‌కు రూ. 3.8 కోట్లు, రన్నరప్‌కు రూ. 1.9 కోట్లు లభిస్తాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో విన్నర్‌కు రూ. 94 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ. 48 లక్షలు అందుతాయి.

జొకో అడుగులు ఇక్కడి నుంచే...

పదకొండేళ్ల క్రితం 2008 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలవడం ద్వారా జొకోవిచ్ పేరు మారుమోగింది. అచ్చొచ్చిన టోర్నీలో మరోసారి విజేతగా నిలవాలనే ఉద్దేశంతో జొకో మెల్‌బోర్న్‌లో అడుగుపెట్టాడు. 'నా ప్రస్థానం ఇక్కడి నుంచే మొదలైంది. కెరీర్‌లో తొలి మేజర్ ట్రోఫీ ఇదే. నాపై నమ్మకాన్ని ఇచ్చిన ఆ విజయం తర్వాత అనేక అవకాశాలు వచ్చాయి. వాటిలో కూడా సత్తా చాటడం వల్లే ఈ స్థితిలో ఉన్నా' అని 31 ఏళ్ల నొవాక్ అప్పటి రోజులను గుర్తుచేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం విచిత్రమైన హావభావాలతో అందరితో 'జోకర్' అని పిలిపించుకునే జొకో టోర్నీ తొలి మ్యాచ్‌లో మంగళవారం మిచెల్ క్రూగర్ (అమెరికా)తో తలపడనున్నాడు. గతేడాది ఈ టోర్నీలో ప్రభావం చూపలేకపోయిన అతను గాయం నుంచి కోలుకొని రాకెట్‌లా దూసుకెళ్తున్నాడు. 2018 సీజన్ ప్రారంభంలో 20వ ర్యాంక్‌లో ఉన్న అతడు ప్రస్తుతం నెంబర్‌వన్ స్థానానికి చేరాడు. యూఎస్ ఓపెన్ నెగ్గి 14వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఖాతాలో వేసుకున్న జొకో... నడాల్ (17) కంటే మూడు టైటిల్స్ మాత్రమే వెనుక ఉన్నాడు. ఫెడెక్స్ (20) ఇద్దరికంటే ముందున్నాడు.



మరి మన కథ...

ఈ సారి ఇండియా నుంచి ముగ్గురు ప్లేయర్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో దిగనున్నారు. క్వాలిఫయింగ్ టోర్నీలో సత్తాచాటి మెయిన్ 'డ్రా'కు చేరిన ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌తో పాటు పురుషుల డబుల్స్‌లో దేశ టాప్ జోడీ రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గతేడాది మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హంగేరీ ప్లేయర్ తిమియా బాబోస్‌తో జోడీ కట్టిన రోహన్ బోపన్న ఫైనల్లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న బోపన్న జంట పురుషుల డబుల్స్‌లో ఏ మేరకు రాణిస్తుందో చూడాలి.



స్పెషల్ గ్రూప్ ఫొటో.. నెలల తేడా అంతే

8 మంది నర్సులు. ఒకే ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఇంచుమించు ఒకే టైంలో గర్భవతులయ్యారు. 4 నెలల తేడాలో అంతా పిల్లలకు జన్మనిచ్చారు. అసలు మేటర్లకొద్దాం. అమెరికా ఇలినాయిలోని ఆండర్సన్ హాస్పిటల్స్‌లోని పెవిలియన్ మహిళల విభాగమది. అక్కడి గైనకాలజీ శాఖలో సుసాన్, బ్రిటానీ, ఆష్లే, సారా, రెబెక్కా, గ్వెన్, మిషెల్, స్టవానియా పనిచేస్తున్నారు. కాకతాళీయమో ఏమోగానీ.. ఒకట్రెండు నెలల తేడాలోనే అంతా గర్భం దాల్చారు. నెలలు నిండాక అన్నా, రీస్, లోగాన్, హోల్డెన్, డేనియల్, చార్లెట్, చార్లెట్, జ్యుయెల్ అనే పిల్లలు పుట్టారు. ఈ ఫొటోను హాస్పిటల్ యాజమాన్యం పోస్ట్ చేసింది. పిల్లలు పుట్టిన తేదీ ప్రకారం క్రమ సంఖ్యలో నిలబడి ఆ నర్సులిలా గ్రూప్ ఫొటో దిగారు. లెక్క ప్రకారం మూడో ప్లేస్‌లో ఉండాల్సిన స్టవానియా ఆమె బిడ్డ జ్యుయెల్‌లు ఈ ఫొటోలో లేరు. వాళ్లందరినీ హాస్పిటల్ ఎలైట్ 8 ముద్దు బిడ్డలు అని యాజమాన్యం తెగ పొగిడేస్తోంది. బాగుంది కదా...!

వెన్ను కండరం స్పేస్‌లో పీక్కపోతది

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో (ఐఎస్ఎస్) ఆస్ట్రోనాట్లు దాదాపు ఆరునెలల పాటు గడుపుతుంటారు. అన్నాళ్లు అక్కడ ఉండి భూమికి వచ్చిన ఆ ఆస్ట్రోనాట్ల వెన్ను కండరాలు కుచించుకు పోతాయని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) సైంటిస్టులు చెబుతున్నారు. ఆ ప్రభావం నాలుగేళ్ల దాకా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. మార్స్‌పైకి మనిషిని పంపాలని నాసా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో.. అధ్యయన ఫలితాలను అంచనా వేస్తే మెడ కండరాలు తగ్గకుండా జాగ్రత్తపడొచ్చని చెబుతున్నారు. వెన్ను కండరాలు కుచించుకుపోతే నడుము నొప్పులొస్తాయని, అంతరిక్షానికి వెళ్లొస్తున్న ఆస్ట్రోనాట్లపై ఆ ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. ఐఎస్ఎస్‌లో గడిపొచ్చిన 17 మంది ఆస్ట్రోనాట్ల వెన్ను సీటీ స్కాన్లను పరీక్షించి ఈ విషయం తేల్చారు సైంటిస్టులు. గురుత్వాకర్షణ శక్తి వల్ల వాళ్ల కండరాలు 5.9 నుంచి 8.8 శాతం దాకా తగ్గిపోయాయని గుర్తించారు. మామూలు కండరాలు మళ్లీ పెరిగినా, స్పైన్ కండరాలు మళ్లీ యథావిధిగా జీవం పోసుకోవడానికి నాలుగేళ్ల దాకా పడుతుందని తేల్చారు. జీరో గ్రావిటీలో వ్యాయామం చేయడం వల్ల ప్రభావాన్ని కొంత తగ్గించొచ్చంటున్నారు.

వినువీధుల్లో యాడ్స్

రాత్రిళ్లు వెలుగుతూ కనిపిస్తాయి

చిమ్మచీకట్లో నింగికేసి చూస్తే అందంగా ఏం కనిపిస్తాయి. పండు వెన్నెల, సుదూరాన మిణుకు మిణుకుమంటున్న నక్షత్రాలు ఇదే కదా మీ సమాధానం. అతి త్వరలో ఈ మాట మార్చుతారు. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఏది అందంగా ఉందంటే ఇంటర్నేషనల్ కంపెనీల పేరు చెప్పడం మొదలెట్టేస్తారేమో! మేం ఎందుకలా చెబుతాం అంటారా? ఇది చదవండి. 2021 నుంచి ఆకాశ వీధుల్లో జాబిల్లి, చుక్కలతో పాటు 'యాడ్స్' కూడా కనిపిస్తాయి! మీరు అనుకుంటోంది కరెక్టే. వాణిజ్య ప్రకటనలు నీలాకాశ వినువీధుల్లో స్వేచ్ఛగా విహరించబోతున్నాయి. రష్యన్ స్టారప్ కంపెనీ 'స్టార్ట్ రాకెట్' ఇందుకు వ్యూహ రచన చేస్తోంది. ఇప్పటివరకూ బోర్డులు, బిల్డింగులు, భారీ కట్టడాలకు మాత్రమే పరిమితమైన వాణిజ్య ప్రకటనల్ని అంతరిక్షం నుంచి భూమ్మీదున్న మనుషులకు కనిపించేలా చేయనుంది.



- భూమ్మీదున్న జనాభా అంతా చూడొచ్చు
- రష్యాకు చెందిన 'స్టార్ట్ రాకెట్' వినూత్న ఐడియా

2021లో బిల్ బోర్డ్ స్టైల్ యాడ్స్‌ను అంతరిక్షం నుంచి తొడి యాడ్‌ను ప్రదర్శించనున్నట్లు స్టార్ట్ రాకెట్ ప్రకటించింది. కంపెనీ వెబ్‌సైట్‌లో ఉన్న శాంపిల్స్‌ను చూస్తే ఎవరికైనా కళ్లు తిరిగిపోతాయి. వెలుగులు విరజిమ్ముతున్న చంద్రుడి పక్కనే కోకకోలా, కేఎఫ్‌సీ, మెక్‌డొనాల్డ్ యాడ్స్‌ను స్టార్ట్ రాకెట్ ప్రదర్శించింది. ఇలా ప్రపంచంలోని బెస్ట్ బ్రాండ్స్‌ను రాత్రిళ్లు ఆకాశంలో ప్రదర్శిస్తామని చెబుతోంది. 2020లో ప్రాజెక్టును ప్రారంభించనుంది. ప్రకటనలు మాత్రం 2021 నుంచి ఆకాశంలో కనువిందు చేస్తాయి.

ఆర్బిటాల్ డిస్ ప్లే


క్యూబ్ శాటిలైట్స్ ద్వారా స్టార్ట్ రాకెట్ అంతరిక్షంలో యాడ్స్‌ను తయారు చేస్తుంది. ఉదాహరణకు ఒక కంపెనీ స్టార్ట్ రాకెట్ వద్దకు యాడ్ కోసం వెళ్లిందని అనుకుందాం. ఏ సైజ్‌లో యాడ్ కావాలో తెలుసుకుని, దానికి తగినన్ని క్యూబ్ శాటిలైట్స్‌ను స్టార్ట్ రాకెట్ ఒకేసారి అంతరిక్షంలోకి పంపుతుంది. వాటన్నింటిని ఒక పద్ధతి ప్రకారం సెట్ చేసి యాడ్‌లా మారుస్తుంది. ఇవి 400 నుంచి 500 కిలోమీటర్ల ఎత్తులో, ప్రవేశ పెట్టిన కక్షలో తిరుగుతూ భూమ్మీదున్న 700 కోట్ల మందికి కనిపిస్తాయి. యాడ్‌ను చూసే వారి సంఖ్యను బట్టి కంపెనీల నుంచి స్టార్ట్ రాకెట్ డబ్బు వసూలు చేస్తుంది. ఒక్కరే చూశారనుకోండి 650 నుంచి 1050 రూపాయలు చెల్లించాలి. ఇలా టార్గెట్ చేసిన ఆడియన్స్ సంఖ్యను బట్టి కంపెనీలు స్టార్ట్ రాకెట్‌కు పైకం చెల్లించాల్సివుంటుంది.

చట్టపరంగా చిక్కులు?

స్టార్ట్ రాకెట్ ఆలోచనకు టెక్నాలజీ ఉన్నా, చట్టపరంగా సమస్యలు రావొచ్చని స్పేస్, శాటిలైట్ చట్టాల నిపుణులు పేర్కొంటున్నారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వల్లే తొలి సమస్య రావొచ్చని చెబుతున్నారు.


క్యూబ్‌శాట్స్ ఎలా పని చేస్తాయి?

రాకెట్ ద్వారా అంతరిక్షానికి చేరుకునే క్యూబ్ శాట్స్ విచ్చుకుంటాయి. వీటికి కాన్వాస్‌తో తయారు చేసిన బోర్డులు ఉంటాయి. సూర్యుడి నుంచి వచ్చే వెలుతురుతో సొంతంగా చార్జింగ్ చేసుకోగలవు. ఇప్పటివరకూ ఏ దేశం ఇలాంటి ప్రయత్నం చేయలేదు. అంతేకాకుండా ఎప్పుడంటే అప్పుడు యాడ్ సైజును పెంచుకునేందుకు కొత్త క్యూబ్ శాట్స్‌ను నింగికి పంపొచ్చు. ఒకవేళ కంపెనీతో యాడ్ ఒప్పందం పూర్తయితే, అవే శాటిలైట్స్‌ను వేరే లెటర్లుగా మార్చి మరో యాడ్‌ను ప్రదర్శించుకునే అవకాశం ఉంది. ప్రపంచానికి ఆపద ముంచుకొచ్చినప్పుడు అత్యంత వేగంగా సమాచారాన్ని చేరవేసేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ పేర్కొంది. ఈ ఏడాది అక్టోబర్‌లో తొలి లాంచ్‌కు ప్రిపరేషన్లు మొదలవుతాయని చెప్పింది. ఆ తర్వాత కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటామని వెల్లడించింది. 2021 జనవరిలో టెస్ట్ లాంచ్, జులైలో తొలి రాకెట్ నింగిలోకి వెళ్తుందని తెలిపింది.



నాణేలతో ఇండియా చరిత్ర

చరిత్రను ఓ బ్రహ్మ పదార్థంగా భావించే వాళ్లు బోలెడు. అదో మహాసముద్రమని, దాన్ని ఈదడం అసాధ్యమని చెబుతుంటారు. అలాంటి దేశ చరిత్రను 133 నాణేలతో కళ్ల ముందు ఆవిష్కరించారు అరుణ్ రామ్మూర్తి. ఆయన రాసిన 'సువర్ణ మొహర్' పుస్తకం ముద్రణా శాస్త్రాన్ని తాకుతూ ఇండియన్ హిస్టరీని వివరిస్తుంది. దేశ చరిత్రను అరుణ్ 20 భాగాలుగా విడగొట్టి విడమర్చి చెప్పారు. "2500 ఏళ్ల నాటి చరిత్రను నాణేల ఆధారంగా చెప్పాను. ఒకే రాజ్యంపై ఫోకస్ పెట్టకుండా దేశం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పని చేశాను. ప్రపంచంలోని అతి పురాతన నాణెలు ఇండియాలో ఉన్నాయి. వేదాల్లో కూడా నిష్కాస్, సువర్ణాలు అని నాణేల ప్రస్తావన ఉంది" అని అరుణ్ చెప్పారు. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దంలో తొలిసారిగా నాణేల



ముద్రణ చేశారట. వాటిపై రాణుల చిత్రాలను చెక్కేవారట. ఆ తర్వాతి కాలంలో చాలా ఇండియన్ కాయిన్లపై రాణులు, దేవతల రూపాలు కనిపించాయి. ప్రపంచంలోనే తొలిసారిగా కాయిన్లపై తన రూపాన్ని ముద్రించుకున్న ముస్లిం రాణి రజియా సుల్తానా అని పుస్తకంలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఈమె కాయిన్లు ముద్రితమయ్యాయి. మొఘల్ చక్రవర్తి జహంగీర్ 12 కేజీల బరువు, 21 సెంటీమీటర్లు వ్యాసార్థం ఉన్న అతి పెద్ద కాయిన్లను (మొహర్లు) ముద్రించారట. దేశ సందర్శనకు విచ్చేసే అతిథులకు వీటిని బహుమానంగా అందించేవారట. వీటిలో ఒకటి యూరప్‌లో జరిగిన ప్రైవేట్ వేలంలో కోటి డాలర్లకు అమ్ముడుపోయింది. 'ఫనం' అనే అతి చిన్న కాయిన్(0.3 గ్రాముల బరువు) దక్షిణ భారత దేశంలో తొమ్మిది నుంచి 19 శతాబ్దాల మధ్య ఎక్కువగా కనిపించేదట.



సముద్రమంత నిఘా!

కొత్త రాడార్ వ్యవస్థను రూపొందించిన చైనా

- ఇండియా సైజ్ ఉన్న ప్రాంతాన్ని పర్యవేక్షించే సత్తా
- దేశీయంగానే అభివృద్ధి చేసిన డ్రాగన్ దేశం

బీజింగ్: అత్యాధునిక ఆయుధాలు, టెక్నాలజీ విషయంలో ఎప్పుడూ ముందుండే చైనా కొత్త రాడార్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇండియా సైజు ఉన్న ప్రాంతం మొత్తాన్ని ఏకకాలంలో, ఎల్లప్పుడూ నిఘా ఉంచగలిగిన సిస్టమ్‌ను రూపొందించింది. గతంలో అమెరికా తయారు చేసిన నిఘా వ్యవస్థ కన్నా ఇది సమర్థంగా పని చేస్తుందని హాంగ్‌కాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది. "దేశీయంగా తయారు చేసిన అత్యాధునిక సముద్ర రాడార్ సిస్టమ్‌ను చైనా అందుబాటులోకి తీసుకొచ్చింది. చైనా పరిధిలోని సముద్రాలను నిరంతరం ఇది పర్యవేక్షిస్తుంది. శత్రువుల షిప్పుల, ఎయిర్‌క్రాఫ్టులు, మిస్సైళ్లను వెంటనే గుర్తించి సమాచారమిస్తుంది. ఇంతకుముందు ఉన్న టెక్నాలజీ కంటే సమర్థంగా పని చేస్తుంది" అని వెల్లడించింది. 'ఓవర్ ది హారిజన్ (ఓటీహెచ్)' రాడార్ ప్రోగ్రామ్‌లో పని చేసిన సైంటిస్టు ఈ వివరాలు చెప్పినట్లు తెలిపింది. హార్బిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (సీఏఎస్)లో పని చేసే విద్యావేత్త లియు యోంగ్‌టన్ ఈ రాడార్ టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేశారని చెప్పింది. పీపుల్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) నేవీ క్యారియర్ కోసం ఈ కాంపాక్ట్ రాడార్‌ను డెవలప్ చేశారని వెల్లడించింది.

గతంలో 20 శాతమే..

"సంప్రదాయమైన టెక్నాలజీలపై ఆధారపడటం వల్ల చైనా పరిధిలోని సముద్రాల్లో 20 శాతం మాత్రమే నిఘా, పర్యవేక్షణ చేయగలుగుతున్నాం. ఓటీహెచ్ రాడార్ వ్యవస్థతో మొత్తం 100 శాతం ప్రాంతాన్ని కవర్ చేయొచ్చు" అని లియు యోంగ్‌టన్ చెప్పారు. ఇటీవల జరిగిన గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్ కార్యక్రమంలో దేశంలోనే అత్యుత్తమమైన సైన్స్ అవార్డును షీ జిన్‌పింగ్ చేతుల మీదుగా లియు అందుకున్నారు. "కొత్త వ్యవస్థతో దక్షిణ చైనా సముద్రం, ఇండియన్ సముద్రం, పసిఫిక్ సముద్రం తోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో సమాచారాన్ని సేకరించే సామర్థ్యాలు మరింత మెరుగయ్యాయి" అని లియు టీమ్‌లోని సీనియర్ సభ్యుడొకరు చెప్పారు.

అమెరికా కూడా..

ఓటీహెచ్ రాడార్ టెక్నాలజీని చైనా మాత్రమే కాదు, గతంలో అమెరికా కూడా డెవలప్ చేసింది. అమెరికా డిఫెన్స్ కాంట్రాక్టర్ 'రేథియాన్' సంస్థ 2016లోనే ఇలాంటి ఓ రాడార్ సిస్టమ్‌పై పేటెంట్ పొందింది.





సిప్టా వచ్చాడో సుర్రు సుమ్మయిపోద్ది

సిప్టా.. ఓ సూపర్ హీరో.. పిల్లల్ని బాధ పెడుతుంటే వెంటనే వచ్చేస్తాడు.. వారికో స్కెచ్ బుక్ ఇస్తాడు.. దాంట్లో ఏం గీసినా జీవం పోసుకుని బయటకు వచ్చి వాళ్లను కాపాడుతుంది.. భలే ఉంది కదా చిన్న పిల్లలకు నచ్చేట్టుగా.. అందుకే ఈ సిప్టా అంతర్జాతీయ అవార్డును గెలుచుకుంది. యునిసెఫ్, కామిక్స్ యునైటింగ్ నేషన్స్ నిర్వహించిన వరల్డ్‌వైడ్ కామిక్ కాంటెస్ట్‌లో తొలిస్థానంలో నిలిచింది. ఇండోనేసియాకు చెందిన స్టూడెంట్ రిజ్కా రెయిసా ఫాతిమా రష్లి (17) ఈ సిప్టాకు జీవం పోసింది. పోటీకి 130 దేశాల నుంచి 3,600 దరఖాస్తులొచ్చాయి. సుమారు 23 వేల మంది ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొని విన్నర్‌ను ఎంపిక చేశారు.

ప్రతి ఒక్కరికీ చెప్పేందుకే


చిన్నారులను హింసించే, దాడి చేసే సంఘటనలు ముమ్ముందు వారి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రపంచవ్యాప్తంగా చిన్నారులపై జరుగుతున్న హింస గురించి ప్రతి ఒక్కరికీ చెప్పేందుకే సిప్టాను రూపొందించానని రిజ్కా చెప్పింది. చిన్నారులు ఎదుర్కొన్న సంఘటనలను కథలుగా, డ్రాయింగ్ రూపంలో వాళ్లే చెప్పేలా తన వంతు ప్రయత్నం చేశానని అంటోంది. దీంతో చిన్నారుల్లో స్ఫూర్తి కూడా నింపొచ్చని భావించానంది. కళ మీద ఇష్టంతో ఆర్టిస్టయిన రిజ్కా తను రూపొందించిన బొమ్మలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

ప్రపంచ అధినేతలకు సిప్టా గిఫ్ట్

యునిసెఫ్ పోటీలో గెలిచిన రిజ్కా.. ఓ ప్రొఫెషనల్ టీంతో కలసి సిప్టా పేరుతో అద్భుతమైన కామిక్ పుస్తకాన్ని విడుదల చేయబోతోంది. 2019 జూలైలో ఐక్యరాజ్యసమితిలో సుస్థిరాభివృద్ధిపై జరగనున్న హై లెవల్ పొలిటికల్ సదస్సులో ప్రపంచ దేశాల అధినేతలకు ఆ పుస్తకాన్ని అందించనున్నారు. ప్రపంచంలోని అన్ని స్కూళ్లలోనూ ఇవ్వనున్నారు. చిన్నారులపై జరుగుతున్న హింస, దాడులు ప్రపంచానికి తెలిసేలా 2018 అక్టోబర్‌లో గ్లోబల్ సూపర్ హీరో కామిక్ పోటీని యునిసెఫ్, కామిక్స్ యునైటింగ్ నేషన్స్ ప్రారంభించాయి.

చంద్రుడిని చూపించే రాకెట్

మనిషిని చందమామపైకి తీసుకెళ్లేందుకు తలపెట్టిన మహత్కార్యంలో భాగంగా స్పేస్ ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ చాలా సీరియస్‌గా పనిచేస్తున్నారు. అందులో భాగంగా టెస్ట్‌ఫ్లైట్ చేసేందుకు స్టార్‌షిప్‌ను తయారు చేస్తున్నారు. ఇప్పుడు దాని అసెంబ్లింగ్ పూర్తయిపోయింది. ఆ ఫొటోను ట్విట్టర్‌లో షేర్ చేసిన ఆయన.. ఇది జస్ట్ టెస్ట్ కోసమేనని చెప్పారు. 120 అడుగుల ఎత్తున్న దీనిని ఉపకక్ష్యల్లో పరీక్షిస్తామని చెప్పారు. ఒరిజినల్ రాకెట్ ఇంకా పెద్దగా, మందంగా, ముడతలు లేకుండా ఉంటుందని చెప్పారు. ఇక, దానిని ట్విట్టర్‌లో పెట్టిన మరుక్షణం.. నెటిజన్లు దానిని 1954లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ సినిమా ఎక్స్‌ప్లోరర్ ఆన్ ద మూన్‌లోని రాకెట్‌లా ఉందని పోలిక పెట్టారు. మరికొందరు టాయ్‌స్టోరీ, వాలేస్ అండ్ గ్రోమిట్ అనే సినిమాల్లోని కార్టూన్ రాకెట్‌లా ఉందని చమత్కరించారు. ఇంకొందరేమో టిన్‌టిన్ డెస్టినేషన్ మూన్ సినిమాలోని రాకెట్‌లా ఉందంటున్నారు. ఆర్బిటాల్ (కక్ష్యలోకి వెళ్లే) రాకెట్ నిర్మాణం జూన్ నాటికి పూర్తవుతుందని మస్క్ వెల్లడించారు. అంతేకాదు.. ఒరిజినల్ రాకెట్‌కు కిటికీలు ఉంటాయట.



కోతులకు మలేరియా?

- బానెట్, రియస్ జాతి కోతుల్లో ప్లాస్మోడియం పరాన్నజీవి
- అడవులకు వ్యాపిస్తుందని ఆందోళన

మూలిగే నక్కపై తాటికాయ పడటమంటే ఇదేనేమో! మరో పదేళ్లలో మలేరియాను నిర్మూలించాలని ఇండియా ప్రయత్నిస్తుంటే, మనుషుల్లో కనిపించే ఈ జబ్బు పరాన్నజీవి దేశీ కోతులకు పాకింది. బానెట్, రియస్



జాతి కోతుల్లో 'ప్లాస్మోడియం ఫాల్సీపారమ్' పరాన్నజీవిని బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సైంటిస్ట్ జోత్స్నా దీక్షిత్ గుర్తించారు. ఐదు రకాల కోతి జాతుల మల విసర్జాలపై చేసిన రీసెర్చ్‌లో ఈ విషయం తేలిందని ఆమె చెప్పారు. కేరళలోని త్రిచి జూలోని బానెట్ కోతుల రక్తం, లివర్ శాంపిల్స్‌ను తెప్పించి టెస్టులు చేయగా ప్లాస్మోడియం పరాన్నజీవి ఉందని తెలిపారు. అయితే దీని వల్ల కోతులకు మలేరియా వస్తుందా రాదా అన్నదానిపై క్లారిటీ లేదని పేర్కొన్నారు. కోతుల్లో ప్లాస్మోడియం ఆనవాళ్లను గుర్తించడం ఇదేం తొలిసారి కాదు. ఆఫ్రికా, మలేసియా కోతుల్లో ఇంతకుముందే ఈ పరాన్నజీవి ఉందని పసిగట్టారు. బానెట్ కోతులు దక్షిణ భారతదేశంలో, రియస్ కోతులు ఉత్తర భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తాయి. పట్టణాలు, చిన్న చిన్న ఊళ్లలోనూ ఇవి తిరుగుతుంటాయి. అలా మనుషుల నుంచి ప్లాస్మోడియం కోతులకు వ్యాప్తి చెందివుండొచ్చని జోత్స్న భావిస్తున్నారు. కోతుల బెడద పెరిగిన చోట్ల ఆఫీసర్లు వాటిని పట్టుకుని తీసుకెళ్లి అడవుల్లో వదిలేస్తున్నారు. దీని వల్ల ఇతర కోతులకు ప్లాస్మోడియం పాకుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్మోడియం, ప్లాస్మోడియం ఫాల్సీపారమ్, ప్లాస్మోడియం మలేరియా, ప్లాస్మోడియం ఒవాలే, ప్లాస్మోడియం వైవాక్స్ అనే భిన్న రకాల పరాన్న జీవుల వల్ల మనుషులకు మలేరియా వస్తుంది. ప్లాస్మోడియం నోలెసీ అనే పరాన్నజీవి వల్ల జంతువులకు ఈ జబ్బు వస్తుంది. 2018లో నోలెసీ వల్ల మలేసియాలో విష జ్వరాలు వచ్చాయి. కోతుల నుంచి మనుషులకు నోలెసీ పాకినట్లు సైంటిస్టులు గుర్తించారు.

పాత కారు.. 15 కోట్లు

ఫోర్డ్ మస్టంగ్.. ఈ పేరే ఓ బ్రాండ్. చాలా మందికి ఈ కారు గురించి తెలియకపోవచ్చు గానీ.. కార్లంటే పిచ్చి ఉన్నోళ్లకు, రేసర్లకు ఇది బాగా పరిచయమున్న బ్రాండ్. తొలిసారి 1964లో రోడ్డుపై ఉరుకులు పెట్టింది. ఆ తర్వాత కాలానికి తగ్గట్టు మారిపోయింది. ఇప్పుడు అల్ట్రా మోడర్న్ అయిపోయింది. ఈ కారు తొలితరం ఫోర్డ్ మస్టంగ్. 1967లో తయారు చేశారు. మస్టంగ్ షెల్బీ జీటీ 500 సూపర్ స్నేక్ అని పిలుస్తారు. శుక్రవారం రాత్రి అమెరికాలోని ఫ్లా కిసిమ్మీలో నిర్వహించిన మెకం ఆక్షన్‌లో ఇది సుమారు రూ.15.48 కోట్లకు (22 లక్షల డాలర్లు) అమ్ముడైంది. వేలంలో అత్యధిక ధరకు అమ్ముడైన ఫోర్డ్ మస్టంగ్‌గా రికార్డులకెక్కింది. నిజానికి గుడ్‌ఇయర్ టైర్లను టెస్ట్ చేయడానికి కరోల్ షెల్బీ అనే పాత తరం రేసర్ ఈ కారును డిజైన్ చేశాడు. జీటీ500లో పవర్‌ఫుల్ ఇంజన్ అయిన 428 క్యూబిక్ ఇంచ్ వీ8 ఇంజన్‌ను తీసేసి 427 క్యూబిక్ ఇంచ్ వీ8 రేసింగ్ ఇంజన్‌ను పెట్టాడు. తర్వాత టెక్సస్‌లోని ట్రాక్‌పై దాన్ని టెస్ట్ చేయగా కారు గంటకు 270 కిలోమీటర్ల స్పీడ్ అందుకుంది. నిజానికి ప్రారంభంలో 50 కార్లను తయారు చేసి జీటీ500 కార్ల రేటుకు డబుల్ రేట్‌కు అమ్మేలా ప్లాన్ చేశారు. కానీ, ఎవరూ కొనకపోవడంతో సుమారు రూ.3.52 లక్షలకు (5 వేల డాలర్లు) అమ్మారు. అప్పుడెవరూ అంతగా ఆసక్తి చూపకపోయినా ఇప్పుడు మాత్రం దాని ధరకు 50 రెట్లు ఎక్కువకు అమ్ముడైంది.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.